తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.APTEL / 2013 /50370

శుక్రవారం 07.02.2025 | సంపుటి : 11 సంచిక : 209 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698




# స్థానిక సమరానికి సై

## భారీ బహిరంగ సభల ద్వారా జనంలోకి..

- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణలపై ప్రజలకు వివరించాలి
- విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాల్సిందే
- స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలపై దృష్టి సారించండి
- సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పండి
- సిఎల్పీ భేటీలో ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ దిశానిర్దేశం





హైదరాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :

కులగణనపై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని వాటిని తిప్ఇకొట్టాలని కాంగ్రెస్ నిర్ణయించిందని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యేలకు సూచించామని అన్నారు. పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై సలహాలు తీసుకున్నట్లు వెల్లడించారు. పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించాం. రాష్ట్ర ఆదాయం, అప్పులు, వ్యయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాం. ఫిబ్రవరిలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహి స్తాం. బహిరంగ సభలకు అధిష్ఠానం నేతలను ఆహ్వానించేందుకే దిల్లీ వెళ్తున్నాం. ఎమ్మెల్యేలు డిన్నర్ సమావేశాలు నిర్వహించుకోవటం తప్పేమీ కాదని కూడా అన్నారు. సీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వే, బడ్జెట్ అంశాలపై ప్రధానంగా చర్చించామని తెలిపారు.

'స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించాం. సమావేశంలో ఎమ్మెల్యేలు కూడా వారి అభిప్రాయాలు చెప్పారు. పథకాలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. సుమారు మూడు గంటలకు పైగా సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించామని అన్నారు. ఈ క్రమంలో సమావేశంలో చర్చించిన అంశాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. .స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా కులగణన చేపట్టామని... రాహుల్ గాంధీ ఆశయం మేరకు పరిపూర్ణంగా సర్వే చేసి ఎవరు ఎంత సంఖ్యలో ఉన్నారో తేల్చామని అన్నారు. వాస్తవాలు తెలియక బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ బీసీ సంఘాలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. చాలా అంశాలపై సీఎల్పీ సమావేశం జరిగిందని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డిప్యూటీ సీఎం భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. సూర్యాపేటలో కులగణన జరిగిన తీరుపై బహిరంగ సభ నిర్వహించ నున్నామని.. ఈ సభకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను ఆహ్వానించటానికి ఢిల్లీ వెళ్తున్నామని అన్నారు. ఈ సమావేశం ద్వారా ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలు నివృత్తి చేశామని అన్నారు. బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకే కేటిఆర్ ఢిల్లీ వెళ్లారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇందు కోసం ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో కాంగ్రెస్ బలాన్ని పెంపొందించేందుకు మిగతా 2లో..

> స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కొత్త, పాత నేతలు సమన్వయంతో సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి దీపాదాస్ మున్షీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో కొత్త పాత నేతలు సమన్వయంతో సాగితేనే స్థానిక సంస్థల్లో పాగా వేయగలమని సూచించారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బీసీ కులగణన చేపట్టామని, ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతా చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు ఉత్తర తెలంగాణలో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేద్దామని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రభావాన్ని నిలబెట్టుకోవాలని, ప్రతీ స్థాయిలో విజయాన్ని సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. అలాగే సమస్యలపై ఎమ్మెల్యేలు నేరుగా తనను కలుసుకోవచ్చని అన్నారు.

## ఓట్ల కోసం కాంగ్రెస్ జైభీమ్ నినాదాలు

### అంబేద్కర్‌ను ఏనాడూ గౌరవించని పార్టీ అది

**ఆయనను ఓడించేందుకు అనేక కుట్రలు చేసింది**

**ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆగ్రహం**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల కాంగ్రెస్‌కు ఏనాడూ గౌరవం లేదని ప్రధాని మోడీ అన్నారు. ఓట్ల రాజకీయంకోసం ఇప్పుడు ఆయన పేరును వాడుకుంటోందని మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని మారోసారి టార్గెట్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినదంతా.. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించేదని అన్నారు.. బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని ఆరోపించారు, సామాజిక సంస్కర్త పట్ల ఆ పార్టీ దారుణంగా ప్రవర్తించిందన్నారు.. అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవించలేదు.. అంబేద్కర్‌ను ఓడించేందుకు కుట్రలు చేసిందని విమర్శించారు.. కానీ, ఇప్పుడు ఓట్ల కోసం జై భీమ్ నినాదాలు చేస్తోంది.. కాంగ్రెస్ రంగులు మార్చే పార్టీ అని దుయ్యబట్టారు.. ఎస్సీ, ఎస్టీల ఆర్థిక వెనుకబాటు తనాన్ని అంబేద్కర్ తొలగించాలని అన్నారు.. కానీ, కాంగ్రెస్ ఆ పని చేయలేకపోయిందన్నారు. కాంగ్రెస్ బీఆర్ అంబేద్కర్‌తో దారుణంగా వ్యవహరించింది? వారు ఆయనను వ్యతిరేకించారు.. బాబాసాహెబ్ చెప్పినదంతా కాంగ్రెస్‌ను వ్యతిరేకించేది అని ప్రధాని మోడీ అన్నారు. ప్రతిదానికీ డాక్యుమెంట్స్ ఎవిడెన్స్ ఉన్నాయి.. వాటిని ధృవీకరించవచ్చన్న ఆయన.. ఎన్నికల్లో బాబా సాహెబ్ ఓడిపోయేలా కాంగ్రెస్ ఎటువంటి రాయిని వదిలిపెట్టలేదన్నారు.. ఎందుకంటే వారు ఆయనను సహించలేక పోయారు. భారతరత్నకు ఆయన అర్హుడని భావించలేదు అంటూ ఫైర్ అయ్యారు.. సబ్ కా సాత్ కాంగ్రెస్‌కు సాధ్యం కాదు అని స్పష్టం చేశారు.. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనేది కాంగ్రెస్ పార్టీకి అర్థం కాని విషయం అని పేర్కొన్నారు.. కాంగ్రెస్ విషయానికొస్తే? వారు సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ ఆశించడం పెద్ద తప్పు? అది వారి ఆలోచనలకు అతీతమైనది.. వారి రోడ్ మ్యాప్ కు కూడా సరిపోదు.. ఎందుకంటే అది ఒక పెద్ద పార్టీ.. ఒక రాజవంశానికి అంకితం చేయబడింది కాబట్టి.. వారికి సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ సాధ్యం కాదు అని విమర్శించారు..మేం స్కిల్ డెవలప్‌మెంట్‌తో వెనుకబడి వర్గాల జీవితాలను మెరుగుపరిచే ప్రయత్నం చేస్తున్నాం.. విశ్వకర్మ యోజనతో చేతివృత్తుల వారి అభివృద్ధికి చర్యలు తీసుకున్నాం అన్నారు మోడీ.. కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యం చేసిన పేదలను మేం గౌరవిస్తున్నాం.. పేదల అభివృద్ధే మా ప్రథమ ప్రాధాన్యం అని స్పష్టం చేశారు.. కేవలం అర్హులకే మిగతా 2లో..

## యూజీసీ వ్యవహారం దేశంపై కుట్ర

### భాషాసాంస్కృతులపై ఆర్ఎస్ఎస్ దాడి

**రాహుల్ గాంధీ ధ్వజం**



న్యూఢిల్లీ, (జనంసాక్షి) :

యూజీసీ ముసాయిదా విద్యాపరమైన చర్య మాత్రమే కాదని, ఇది మన చరిత్ర, సంప్రదాయం, సంస్కృతి, భాషలపై దాడి చేసేందుకు ఆరెస్సెస్ చేస్తున్న ప్రయత్నం అని కాంగ్రెస్ ఎంపి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఇదే విషయాన్ని తాను కొంతకాలంగా చెబుతున్నానని అన్నారు. ఈ దేశంలో ఒకే చరిత్ర, ఒకే సంప్రదాయం, ఒకే భాష విధించాలనే ఆలోచనతోనే వారు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని అన్నారు. వివిధ రాష్ట్రాల విద్యా వ్యవస్థపై మిగతా 2లో..

### మీ నిబంధనల వల్ల విద్యార్థులకు నష్టం

- యూజీసీ రూల్స్‌పై కేటీఆర్ ఫైర్
- కేంద్రమంత్రికి కెటిఆర్ వినతి పత్రం అందచేత
- ఎన్‌హెచ్ 365 పొడిగించాలని గడ్కరీకి కెటిఆర్ వినతి



### 18 వైద్య కళాశాలలకు యూజీసీ తాఖీదులు

- తెలుగు రాష్ట్రాల నుంచి 4 కాలేజీలు

న్యూఢిల్లీ (జనంసాక్షి) :

ర్యాగింగ్ నిరోధక చర్యలు పాటించని వైద్య కళాశాలలపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సీరియస్ అయింది. ఈ మేరకు దేశ వ్యాప్తంగా 18 వైద్య కళాశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ జాబితాలో ఏపీ, బిహార్ నుంచి మూడు చొప్పున కాలేజీలు ఉండగా.. దిల్లీ, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరి నుంచి రెండేసి, మధ్యప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్ నుంచి ఒక్కో కాలేజీ చొప్పున ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. ఈ జాబితాలో ఏపీ నుంచి ఆంధ్రా మెడికల్ కాలేజ్ (విశాఖ)బీ గుంటూరు మెడికల్ కాలేజ్, కర్నూలు మెడికల్ కాలేజ్ ఉండగా.. తెలంగాణ నుంచి ఉస్మానియా మెడికల్ కాలేజ్ ఉండటం గమనార్హం.

కాలేజీల్లో ర్యాంగింగ్ భూతాన్ని కట్టడి చేసేందుకు యాంటీ ర్యాగింగ్ రెగ్యులేషన్స్- 2009 నిర్దేశించిన తప్పనిసరి అంశాలను ఈ కళాశాలలు పాటించలేదని యూజీసీ కార్యదర్శి మనీష్ జోషి తెలిపారు. మరీ ముఖ్యంగా ఈ నిబంధనల ప్రకారం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి యాంటీ ర్యాగింగ్ డిక్లరేషన్ను పొందడంలో విఫలమైనట్లు మిగతా 2లో..

## ఇమ్మిగ్రేషన్ చట్టాలను అమలు చేస్తున్నాం

**వలసదారులను పంపివేతపై అమెరికా వివరణ**




న్యూఢిల్లీ, (జనంసాక్షి) :

తమదేశంలో అక్రమంగా ఉంటున్న భారత వలసదారులను వెనక్కి పంపడంపై అమెరికా స్పందించింది. తమ దేశం, ప్రజల భద్రత కోసం ఇమ్మిగ్రేషన్ చట్టాలను అమలు చేయడం అత్యంత ఆవశ్యకమని, అది తమ విధానమని పేర్కొంది. ఆ విమాన ప్రయాణం గురించి ఇంతకుమించి ఏం చెప్పలేమని వ్యాఖ్యానించింది. ఈ మేరకు భారత్‌లోని యూఎస్ దౌత్యకార్యాలయ ప్రతినిధి మాట్లాడారు. భారత్‌కు చెందిన 104 మంది అక్రమ వలసదారులతో అమెరికా నుంచి బయలుదేరిన సైనిక విమానం బుధవారం అమృత్‌సర్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. నిన్న మధ్యాహ్నం శ్రీ గురు రాందాస్ జీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానం దిగింది. ఇందులో హరియాణా, గుజరాత్, పంజాబ్, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్.. తదితర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. ఈ తరలింపు వేళ వలసదారులతో అమానవీయంగా

## వలసదారుల తరలింపు కొత్తేమీ కాదు

- కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్
- రాజ్యసభలో ప్రతిపక్షాల నిరసన



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 07 (జనంసాక్షి) :

అమెరికా అక్రమ వలసదారులను తిరిగి స్వదేశానికి పంపుతోన్న తరుణంలో.. వారి పట్ల ఆ దేశం వ్యవహరిస్తున్న తీరుపై రాజ్యసభలో ప్రతిపక్షాలు గురువారం తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ రాజ్యసభలో స్పందించారు. అక్రమ వలసదారులను స్వదేశానికి పంపడం నేడు కొత్తేమి కాదన్నారు. ఇది ఆ దేశ ప్రామాణిక విధానమని ఆయన తెలిపారు. విమానంలో వారిని తిరిగి తీసుకు వస్తున్న తరుణంలో వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం మాత్రం సరికాదని మంత్రి జైశంకర్ అభిప్రాయపడ్డారు. విదేశాలల్లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు తేలితే తమ పౌరులను తిరిగి తీసుకు రావడం అన్ని దేశాల ప్రాథమిక బాధ్యత అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. అయితే ఇలా దేశం నుంచి వెనక్కి పంపుతోన్న వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించకుండా ఉండాలని.. అమెరికా అధికారులతో తాము సంప్రదింపులు జరుపుతోన్నట్లు ఆయన తెలిపారు. ఇక బహిష్కరణకు గురైన వారు అందించిన సమాచారం ఆధారంగా.. ఏజెంట్లు.. ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ఈ అంశంపై అమెరికా మిగతా 2లో..



## 12 నుంచి మినీ మేడారం జాతర

- 4 రోజులపాటు జాతర సంబురాలు
- పటిష్ట ఏర్పాటు చేసిన అధికారులు 2

## తెలంగాణలో పీఈ సెట్, ఎడ్ సెట్ షెడ్యూల్

**వివరాలు వెల్లడించిన ఉన్నత విద్యామండలి** 2

### ప్రభుత్వ విధానాలపై హద్దుమీరితే

## సహించేది లేదు

**ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం నోటీసులు**

**రెడ్లపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు**



హైదరాబాద్, (జనంసాక్షి) :

రెడ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు టీపీసీసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇటీవల వరంగల్ లో జరిగిన బిసి సభలో మల్లన్న మాట్లాడుతూ.. రెడ్లపై తీవ్ర పదజాలంతో దూషించారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, రెడ్డి సంఘాల నేతలు మల్లన్న ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని.. కాంగ్రెస్ పార్టీ, అతడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేపై కూడా మల్లన్న ఘాటుగానే విమర్శలు చేశారు. ఈ క్రమంలో పీసీసీ క్రమశిక్షణ కమిటీ తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. వరంగల్ సభలో చేసిన వ్యాఖ్యలపై మిగతా 2లో..

## ఏఆర్ ఎస్ఐ ఆత్మహత్య

**కుటుంబ కలహాలే కారణమని అనుమానం** 2

### పనామా, అమెరికాల మధ్య

## కుదిరిన ఒప్పందం

**కెనాల్ నుంచి ప్రయాణానికి ఎలాంటి ఫీజు ఉండదు**

**వెల్లడించిన అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సె**




వాషింగ్టన్,ఫిబ్రవరి6 (జనంసాక్షి) :

పనామా కెనాల్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొంతమేరకు పంతం నెగ్గించుకొన్నారు. తమ యుద్ధ నౌకలు ఈ కెనాల్ నుంచి ప్రయాణించినప్పుడు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఆ దేశం అంగీకరించిందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సె వెల్లడించారు. ఈ మేరకు అమెరికా రక్షణ మంత్రి హెగ్సె, పనామా పబ్లిక్ సెక్యూరిటీ మంత్రి ఫ్రాంక్ అలెక్స్‌కు మధ్య ఒప్పందం కుదిరింది. తాజాగా కుదిరిన ఒప్పందం ప్రకారం అమెరికా ప్రభుత్వ నౌకలకు దీని నుంచి భారీ మొత్తంలో నగదు మిగులుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో అక్రమ వలసదారులపై ఆ దేశం తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోందని మెచ్చుకొన్నారు. ఈ ఒప్పందం విషయాన్ని అమెరికా విదేశాంగ శాఖ కూడా ధ్రువీకరించింది. 'అమెరికా ప్రభుత్వ నౌకలు ఇప్పుడు పనామా కెనాల్ నుంచి ఎటువంటి ఛార్జీలు లేకుండా ప్రయాణించవచ్చు' అని ఎక్స్‌లో చేసిన పోస్టులో పేర్కొంది. వాస్తవానికి కొన్నాళ్ల క్రితమే పనామా అమెరికాకు కొన్ని రాయితీలు ఇవ్వాలని నిర్ణయించుకొంది. ఈవిషయాన్ని ఆదివారమే విదేశాంగ మంత్రి రూబియో సూచాయగా వెల్లడించారు. నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నాటినుంచి ట్రంప్ పనామా కాల్వను తిరిగి స్వాధీనం చేసుకొంటామని హెచ్చరికలు జారీ మిగతా 2లో..

## ప్చ్.. ట్రంప్ అలా అనలేదు

- పాలస్తీనీయుల తరలింపుపై విమర్శల నేపథ్యంలో శ్వేతసౌధం వివరణ
- గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుంటామనలేదు
- కేవలం నిర్మాణ పనులు మాత్రమే చేస్తామన్నాం



వాషింగ్టన్, (జనంసాక్షి) :

గాజాను స్వాధీనం చేసుకొని అభివృద్ధి చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం సర్వత్రా సంచలనం సృష్టించింది. దీనికితోడు అక్కడి పాలస్తీనా వాసులను శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలించేస్తామని బాంబు పేల్చారు. దీనిని పలు వర్గాలు తీవ్రంగా మిగతా 2లో..

# స్థానిక సంగ్రామానికి సన్నద్ధం

- ఆశల పల్లకిలో ఆశావహులు
- రిజర్వేషన్ల కోసం ఎదురు చూపులు
- అనుకూలిస్తే సర్పంచ్ లేదా ఎంపీటీసీ,జెడ్పిటిసి బరిలో నిలిచేందుకు పావులు
- ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం కులగనన, ఎస్సీ వర్గీకరణ పూర్తి చేయడంతో స్థానిక సంగ్రామానికి వెళ్తున్నట్లు సంకేతాలు వెలువడడంతో గ్రామాల్లో ఆశావాహులు రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్లు అనుకూలిస్తే సర్పంచ్,ఎంపీటీసీ,జెడ్పిటిసి బరిలో నిలిచేందుకు పావులు కదుపుతున్నారు. ఇందుకోసం ఇప్పటినుంచే సామాజిక సేవలు యువత,కుల సంఘాలను ప్రసన్నం చేసుకునే పనులలో నిమగ్నమయ్యారు. మరోవైపు అధికారులు ఓటరు జాబితా ప్రచురణ, పోలింగ్ ప్రక్రియ,డిస్ట్రిబ్యూషన్, జోనల్ రూట్ ఆఫీసర్, ఇతర కసరత్తు ముమ్మరం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీలు ఉండగా 2268 వార్డులు ఉన్నాయి. జెడ్పిటిసి స్థానాలు 12, ఎంపీటీసీ స్థానాలు 123 ఉన్నాయి. సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి 2268 పోలింగ్ కేంద్రాలు ఉండగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ 95 శాతం పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం 2219 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. జిల్లాలో 346279 మంది ఓటర్లు ఉన్నారు.ఎన్నికల నిర్వహణలో కీలకమైన పోలింగ్ స్లిప్పు, కరపత్రాలు, స్టేషనరీ తదితర సామాగ్రి సేకరణ కోసం ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు.ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించే పనులు నిమగ్నమయ్యారు.

గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి కాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన ఏడాది దాటింది. ఏడాది కాలంగా గ్రామపంచాయతీలో నిధులు లేక గ్రామాల్లో పనులు చేపట్టడం ఇతర వాటికి పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారులు ఆర్థిక భారం మోస్తూ పనులు నెట్టుకొస్తున్నారు. గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లు పదేళ్లపాటు అమలయ్యేలా 2019లో పంచాయతీరాజ్ చట్టం చేసింది.ఈ చట్టం ప్రకారం రిజర్వేషన్లు మార్చకుండా ఎన్నికల నిర్వహించాలి, కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ కొత్త విధానాన్ని అమలు చేయినట్లు జోరుగా ప్రచారం సాగుతుంది. గత ఎన్నికల్లో ఎస్సీలకు 15, ఎస్టిలకు ఏడు, బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యాయి. అందులో మహిళలకు 50 శాతం కేటాయించారు. గత ఎన్నికల్లో బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కాక బీసీ గణాంకాలు చేపట్టి అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ కొనసాగింది. ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న వారందరూ తమ స్థానాల్లో ఏ రిజర్వేషన్ ఖరారు అవుతుందో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తమకు రిజర్వేషన్లు అనుకూలిస్తే సర్పంచ్ లేదా ఎంపీటీసీ,జడ్పిటిసిగా బరిలో నిలిచేందుకు సమయత్వం అవుతున్నారు.

### ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావాహులు

రిజర్వేషన్లు అనుకూలిస్తే బరిలో నిలిచేందుకు ఇప్పటి నుంచే ఆశావాహాలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వారి ఇల్లు చుట్టు చెక్కర్లు కొడుతున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు యువత, క్రీడాకారులు,కుల సంఘాలను మచ్చిక చేసుకుంటున్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే వారికి ఏం కావాలో చూసుకుంటామంటూ హామీలు ఇస్తూ.. ప్రసన్నం చేసుకుంటున్నారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు,ఎన్నికల బాక్సులు సిద్ధం కాగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. మరోవైపు రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది నియామకానికి రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. గ్రామ పంచాయతీలు,ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణ కోసం ఆర్ఓ,ఏఆర్ఓ లను ఇతర సిబ్బంది ఎంపిక చేయాలని ఎన్నికల సంఘం తాజాగా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు పంపింది. సిబ్బంది సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని ఒకటి లేదా రెండు దఫాలో ఎన్నికల్లో నిర్వహణ ఏర్పాటు చేయనున్నారు.

# న్యాక్‌లో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ



- టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి
- నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ (న్యాక్)లో సందర్శన

హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ మాదాపూర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ (న్యాక్) ను టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి గురువారం సందర్శించారు. న్యాక్ ఆధ్యర్యంలో సివిల్, ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్, సినిమాటోగ్రఫీ తదితర స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ నిర్వహిస్తోన్న విభాగాలను సందర్శించి శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకు న్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతోన్న న్యాక్ లో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడి వారి శిక్షణ అనుభావాలను, శిక్షణ పూర్తయ్యాక భవిష్యత్ ఆలోచనల గురించి సీఈవో తెలుసుకున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక సుమారు రెండు లక్షల మంది నిరుద్యోగ, ఉద్యోగ యువతకు సివిల్ వర్క్ లో వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇచ్చామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక సంబంధిత శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచనల మేరకు సినిమాటోగ్రఫీ లో యువతకు శిక్షణ ఇస్తున్నామని డైరెక్టర్ శాంతిశ్రీ సీఈవోకు వివరించారు. గ్రామీణ ప్రాంత యువతకు వారి అభిప్రాయాలకు అనుగుణంగా నైపుణ్యం అందించేందుకు న్యాక్ ఎంతగానో దోహదపడుతోందని వేణుగోపాల్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. యువతకు న్యాక్ లో జరిగే నైపుణ్య శిక్షణను డిజిటల్ రూపంలో టి-సాట్ ద్వార ప్రసారం చేసే విధంగా చర్యలు తీసుకునేందుకు టి-సాట్ సీఈవో, న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ ఒక ప్రణాళి కను రూపొందించుకోవాలని నిర్ణయించారు.

# కుంభాభిషేకం మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



జయశంకర్ భూపాల పల్లి బ్యూరో, (జనంసాక్షి): కాళేశ్వర ముక్తేశ్వర స్వామి పుణ్య క్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగే మహా కుంభాభిషేకం మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 7 నుండి 9వ తేదీ వరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేకం మహోత్సవాల రోజు వారి కార్యక్రమాల షెడ్యూల్ ను గురువారం ఆయన ప్రకటించారు. మహా కుంభాభిషేకం మహోత్సవ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. స్వామి వారి తీర్థ ప్రసాదాల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భద్రతా పరమైన చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య ఏర్పాట్లను పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులకు విధులు కేటాయించినట్లు తెలిపారు. 42 సంవత్సరాలు తరువాత జరుగుతున్న అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ మహోత్సవాలను సమన్వయంతో విజయ వంతం చేయాలని సూచించారు. అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మహోత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహోత్సవాలకు విచ్చేయు భక్తులు, జిల్లా యంత్రాంగం సలహాలు, సూచనలు పాటించాలని ఆయన సూచించారు. చుట్టుప్రక్కల జిల్లాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన బందోబస్తు, రద్దీ నియంత్రణ, వాహనాలు పార్కింగ్ వంటి చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివరించారు.

# వేసవిలో 24 గంటల సరఫరాకు అధికారులు చర్యలు

- తుక్కుగూడ విద్యుత్ ఎడీఈ శంకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : వేసవి సీజన్‌లో ప్రజలకు 24 గంటలు నిరంతరంగా నాణ్యమైన కరెంటు సరఫరా చేసేందుకు ముందుస్తుగా పకడ్బందీ, ప్రణాళికా బద్ధంగా చర్యలకు సన్నద్ధమవుతున్నామని తుక్కుగూడ విద్యుత్ ఎడీఈ శంకర్ అన్నారు. ఒక్క క్షణం పాటు విద్యుత్ పంపిణీ లోపాలు, అంతరాయం లేకుండా వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా తమ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇతర సీజన్ల కంటే వేసవిలో ఒక్కసారిగా వాతావరణం మార్పు, ఎండల తీవ్రత పెరగడం, సుమారు 30 శాతం కరెంట్ అధికంగా ప్రజలు వినియోగి స్తారన్నారు. ఇళ్లు, ఆఫీసుల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల ఇతరత్రా వాడకం తీవ్రత పెరుగుతోందన్నారు. వేసవి సీజన్‌లో కరెంట్ పంపిణీకి సంబంధించి ఎలాంటి డోకా ఉండదని తెలిపారు. ఈ దిశగా కరెంట్ డిమాండుకు తగ్గట్టుగా విద్యుత్ పంపిణీ సామర్థ్యాన్ని పెంచేందుకు తన పరిధిలో చర్యలు చేపట్టామ న్నారు. తుక్కుగూడ సెక్షన్లలో కరెంట్ తాకిడి తీవ్రతను తట్టుకునేందుకు అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయా చోట్ల బిగిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించగా మంజూరు లభించిందని పేర్కొన్నారు. ప్రాంతాలను గుర్తించామని, త్వర లో వీటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. వేసవికాలం ముగిసే వరకూ 24 గంటల పాటు తమ సిబ్బంది విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సమస్యాత్మక బస్తీలు, కాలనీల్లో కరెంట్ సమస్యల గురించి ఫిర్యాదులు రాగానే సిబ్బంది అక్కడకు వెళ్లి మరమ్మతుల ద్వారా కరెంట్ సరఫరాను పునరుద్ధరిస్తు న్నామన్నారు. ఏ వేళలో అయినా కరెంట్ లోపాలు, సమస్యలు వస్తే కందు కూరు, మహేశ్వరం, తుక్కు గూడ, జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని వారు మామిడిపల్లి, మల్లాపూర్, బాలాపూర్, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌కు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. అంతేకాకుండా కరెంట్ డిమాండు దృష్టిలో పెట్టుకుని అత్యవసర వేళలో ప్రజల సౌకర్యార్థం సంచార ట్రాన్స్‌ఫా ర్మర్లను అందుబాటులో ఉంచుతామని ఏడీఈ శంకర్ వివరించారు. ఎక్కడైన కరెంట్ సమస్యలు వస్తే వెంటనే 9490153575కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# నకిలీ ఐడీ కార్డుతో సచివాలయ ప్రవేశానికి యత్నం

- అడ్డుకుని అరెస్ట్ చేసిన భద్రతా సిబ్బంది



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : తెలంగాణ సచివాలయంలోకి నకిలీ తహసీల్దార్ వెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన కలకలం రేపింది. తిప్పర్తి తహసీల్దార్ అని చెప్పి అంజయ్య అనే వ్యక్తి నకిలీ ఐడీ కార్డుతో సచివాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. భద్రతా సిబ్బందికి అనుమానం వచ్చి అడ్డుకున్నారు. తిప్పర్తి ఎంఆర్‌వో కార్యాలయానికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవడంతో అంజయ్య నకిలీ తహసీల్దార్ అని తేలింది. ఎస్‌టీఎఫ్ ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు అంజయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అంజయ్య వచ్చిన వాహనంపై కూడా తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అని స్టిక్కర్ ఉండటంతో పోలీసులు కంగుతిన్నారు.



# విద్యార్థినులను చితకబాదిన ఉపాధ్యాయురాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 06(జనంసాక్షి) : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఉపాధ్యాయురాలితో మాట్లాడుతుండగా మరో ఉ పాధ్యాయురాలు విద్యార్థినులను చితక బాధిన బుధవారం ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సమాచారం అందుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని ప్రిన్సిపాల్, స్వరూప, ఉపాధ్యాయురాలుతో గొడవకు దిగారు. విద్యార్థినులు సిరి, ఎల్. శ్రావ్య, జే. సిరి, సీహెచ్ సిరిచందన, బి.అశ్విత, తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో బుధవారం విద్యార్థినులు ఇంగ్లీష్ ఉపాధ్యారాలు కృష్ణవేణితో మాట్లాడుతున్నారు. ఇది గమనించిన మరో ఉపాధ్యాయురాలు రమాదేవి విద్యార్థినులు తరగతి గదికి వెళ్లకుండా బయటికి ఎందుకు వచ్చారని ఆగ్రహంతో కొట్టినట్లు విద్యార్థినులు తెలిపారు. ఉపాధ్యాయురాళ్ల మధ్య గొడవలు ఉండడటం వల్లనే మా బిడ్డలను ఎందుకు కొట్టారని విద్యార్థినులు తల్లిదండ్రులు దేవరుప్పులకు చెందిన జోగు ఇందిరమ్మ. పరకాలకు చెందిన చిర్ర ఎల్లయ్య, సురేష్ లు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఘనంగా బంజారా సాంస్కృతిక సమ్మేళనం



మరిపెడ ఫిబ్రవరి 06 (జనంసాక్షి) : బంజారాల తీజ్ పండుగ సాంప్రదాయాలు మరిపెడ మున్సిపాలిటీ ఆడిటోరియంలో గురువారం రాష్ట్రస్థాయిలో బంజారా సాంస్కృతి సాంప్రదాయాన్ని ఘనంగా బంజారా సంస్కృతిక సమ్మేళనం కార్యక్రమం మరిపెడ జడ్పిహెచ్ సీతారాంపురం పాఠశాల ఎం.రామచంద్ర అధ్యక్షతన నిర్వహించారు. బంజారా సాంస్కృతిక సమ్మేళనం సాంప్రదాయాలు అన్ని వివరించారు. బంజారా లంబాడి సంస్కృతి సాంప్రదాయానికి చాటిచెప్పే పండుగలతో అతి ముఖ్యమైన తీజ్ పండుగ ఫీజు అనగా గోధుమ మొలకలు అని అర్థమన్నారు. ఈ పండుగను పెళ్లి కానీ అమ్మాయిలు శ్రావణ మాసంలో భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు అత్యంత వైభవంగా జరుపుకుంటారని అన్నారు. ఈ పండగ ముఖ్య చాటిచంగా వివరించారు. ఈ పండుగ ముఖ్య ఉద్దేశం ఇతర తరాల నుండి వస్తున్న బంజారా సంస్కృతి సాంప్రదాయాలను రక్షించడం ఆరోజు తండా నాయకుని ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తూ తండా నాయకులు ఇతర తండా పెద్దలను గౌరవించడం తండాలో వర్షాలు బాగా కురిసి ప్రతి తండా ప్రకృతి పచ్చదనంతో కలకలలాడుతూ ఎల్లప్పుడు పచ్చగా హరిత భరితంగా ఉండడం పెళ్లి కాని అమ్మాయిలకు చక్కటి భర్త దొరకాలని అన్ని కోరికలు అమ్మాయిలకు కోరుకోవడం జరుగుతుందన్నారు. మరిపెడలో వివిధ పాఠశాలల నుండి ఈ రాష్ట్ర స్థాయి బంజారా సంస్కృతి సాంప్రదాయంలో మండలంలో వివిధ పాఠశాలల నుండి సాంగ్స్ ఆర్ట్స్ గేమ్స్ ఆటపాట పోటీలలో పాల్గొన్న విజేతలకు బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జెండర్ కో-ఆర్డినేటర్ హజారీ శిరీష, జిల్లా జెండర్ కో-ఆర్డినేటర్ గుండ్ల విజయ కుమారి, జిల్లా సైన్స్ ఆఫీసర్ అప్పారావు మండల రెవెన్యూ ఆఫీసర్ సైదులు, మండల విద్యాశాఖ అధికారి జి. అనితాదేవి ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కులగణనను రీ సర్వే చేయాలి

- బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని డిమాండ్




హైదరాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : ప్రభుత్వం కులగణనను రీ సర్వే చేయాలని, రెండోసారి సర్వే చేస్తే ప్రజల్లో ఎలాంటి అయోమయం ఉండదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ పద్మా రావునగర్‌లో గురువారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంతో తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సర్వే తప్పులతడకగా ఉందన్నారు. సర్వే లెక్కలలో ఎలాంటి స్పష్టత లేదన్నారు.ప్రజలలో అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు.'2014లో కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే కంటే 2024 లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సర్వే లో 62 లక్షల మంది జనాభా తగ్గింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి ఎన్నికల లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఉన్న అయోమయాన్ని తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అని తలసాని అన్నారు.

# హాస్టళ్లలో రాత్రి బస చేసిన కలెక్టర్

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ హనుమంతరావు ప్రయత్నాలు మొదలు పెట్టారు. వసతి గృహాల్లో బస, విద్యార్థుల ఇంటి తలుపు తట్టే కార్యక్రమాలను చేపట్టారు. సంస్థాన్ నారాయణపురంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో రాత్రి బస చేసిన కలెక్టర్.. తెల్లవారుజామున 5 గంటలకే కంకణాలగూడెం వెళ్లి పదో తరగతి విద్యార్థి ఇంటి తలుపు తట్టారు. జిల్లాలోని 86 గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశంతో ఇదే రోజున ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అ గ్రేడ్‌లో ఉన్న 800 మంది విద్యార్థుల ఇంటి తలుపు తట్టి వారిలో ప్రేరణ కలిగించే కార్యక్రమం చేపట్టారు

# డంప్‌యార్డుతో ప్రజల ఆరోగ్యానికి చేటు



- అటవీ ప్రాంతాన్ని కాలుష్యం చేస్తే ఊరుకోం
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి హెచ్చరిక

సంగారెడ్డి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్యారానగర్‌లో 150 ఎకరాల్లో ఎర్పాటు చేయనున్న డంప్ యార్డుని వ్యతిరేకిస్తున్నామని, డంప్ యార్డ్‌తో అక్కడ అడవి మొత్తం కాలుష్యం అవుతుందని ఎమ్మెల్యే సునీత లక్ష్మా రెడ్డి అన్నారు. డంప్ యార్డ్‌కు వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నల్లవల్లి, ప్యారానగర్ ప్రాంతంలో మంచి పంటలు పండే భూములు ఉన్నాయి. పోలీసుల పహారాలో డంప్ యార్డ్ నిర్మాణం చేస్తున్నారని మండిపడ్డారు. మరో లగచర్ల మాదిరిగా ఇక్కడ పోలీసుల ఒత్తిళ్లు ఉన్నాయి. పచ్చటి అటవీ ప్రాంతాన్ని నాశనం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుందని మండిపడ్డారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ మాదిరిగా నల్లవల్లి ప్రాంత వాసులకు అనారోగ్య సమస్యలు వస్తాయి. కోర్టు నుంచి ఆదేశాలు ఉన్నా.. అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. రాత్రికి రాత్రి పనులు చేస్తున్నారు. కోర్టు ఆర్డర్ ఉన్నా లెక్కచేయటం లేదన్నారు. అటవీ ప్రాంతంలో రాత్రి సమయాల్లో వందల సంఖ్యలో చెత్త లారీలు వస్తాయి. దానివల్ల ప్రమాదాలు జరుగుతాయి. 150 ఎకరాల్లో డంప్‌కి బదులుగా ఏదైనా పరిశ్రమ పెడితే మేము అభినందిస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో అరెస్ట్ చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులను అరెస్ట్ చేయడమే ప్రజా ప్రభుత్వమా? అని నిలదీశారు. డంప్ యార్డుని వెంటనే ఆపాలి. రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలన్నారు. రైతులకు మద్దతు ఇవ్వడానికి వెళ్తే నన్ను కూడా అరెస్ట్ చేశారు. పోలీస్ నిర్బంధాల మధ్య యార్డ్ నిర్మాణం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ అధికారులు యార్డ్ నిర్మాణానికి ఏ విధంగా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. రైతులకు రోడ్స్ వేస్తాం అంటే అనుమతులు ఇవ్వలేదు. డంప్ యార్డుకు ఏ విధంగా అనుమతులు ఇస్తారు. వెంటనే అనుమతులు రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# క్యాన్సర్ నివారణకు అవగాహనే కీలకం


ఆధునిక జీవనశైలి, క్రమరహిత ఆహారపు అలవాట్లు, ప్రాసెస్ చేసిన జంక్ ఫుడ్ వినియోగం, కాలుష్యం తదితర కారణంగా క్యాన్సర్ కేసులు గత దశాబ్దంలో మన దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పెరిగాయి. ప్రతి సంవత్సరం లక్షల మంది మరణాలకు కారణమయ్యే అత్యంత ముఖ్యమైన ఆరోగ్య సవాళ్లలో క్యాన్సర్ ఒకటి.

**ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవం:**

పెరుగుతున్న క్యాన్సర్ ప్రభావంపై దృష్టిని ఆకర్షించడానికి, దానిని ఎదుర్కోనే చర్యలను ప్రోత్సహించడానికి, అవగాహన కల్పించడం, గుర్తింపు, నివారణ, చికిత్సను మెరుగుపరచడానికి కృషి చేసే చర్యలను బలోపేతం చేయడానికి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 2025 యొక్క థీమ్, “యునైటెడ్ బై యూనిక్”. ఈ దినోత్సవం 4 ఫిబ్రవరి 2000న ప్యారిస్‌లో యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ చే నిర్వహించబడిన న్యూ మిలీనియం కోసం జరిగిన ప్రపంచ క్యాన్సర్ సదస్సులో స్థాపించబడింది.

**ఈ దినోత్సవ ప్రాముఖ్యత:** క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, క్యాన్సర్ గురించి అపోహలను తొలగించడం, క్యాన్సర్ సంబంధిత ప్రచారాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, సకాలంలో కేన్సర్ ను గుర్తిస్తే నూటికి నూరు శాతం నయం చేయొచ్చని అవగాహన కల్పించడమే ఈ రోజు లక్ష్యం.

**క్యాన్సర్ – రకాలు :** క్యాన్సర్ అనేది శరీరంలోని ఏదైనా అవయవం లేదా కణజాలాన్ని ప్రభావితం చేసే వ్యాధుల పెద్ద సమూహం. ఇది అనియంత్రితంగా విభజించే కణాల అసాధారణ పెరుగుదలను సూచిస్తుంది. క్యాన్సర్ ఒక శరీర భాగం లేదా అవయవం లేదా కణజాలం నుండి మరొకదానికి వ్యాపించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. మానవ శరీరంలోని కణాల పెరుగుదలను ఎప్పుడు ప్రారంభించాలి ? ఎప్పుడు ఆపాలి ? లాంటి సూచనలను కణాలకు వాటిలోని జన్యువులు సమాచారాన్ని పంపుతాయి. ఆరోగ్యవంతమైన కణాలు ఈ సూచనలను పాటిస్తాయి. కానీ క్యాన్సర్ కణాలు వాటిని విస్మరిస్తాయి. సాధారణ కణాలు క్యాన్సర్ కణాలుగా మారినప్పుడు అవి అసాధారణంగా అనేక రెట్లుగా వ్యాప్తి చెందుతాయి. క్యాన్సర్లలలో సుమారుగా వందకు పైగా రకాలు ఉన్నాయి. అవి ప్రభావితం చేసే కణజాల రకాన్ని బట్టి వాటిని వర్గీకరిస్తారు. వీటిలో మూడు విస్తృత క్యాన్సర్ వర్గీకరణలు ఉన్నాయి. అవి ఘన (సాలిడ్) క్యాన్సర్లు, రక్త క్యాన్సర్లు, మిశ్రమ క్యాన్సర్లు.



జనంసాక్షి

**లక్షణాలు :** క్యాన్సర్ లక్షణాలు వ్యక్తి నుండి వ్యక్తికి మారుతూ ఉంటాయి. ఇవి ఒక వ్యక్తికి ఏ రకమైన క్యాన్సర్ ఉంది? అది ఎంత అభివృద్ధి చెందింది ? అనే దానిపై ఆధారపడి ఉంటాయి.

**కారణాలు :** క్యాన్సర్ రావడానికి ఒకే ఒక్క కారణం లేదు. కానీ కొన్ని కారకాలు అభివృద్ధి చేసే అవకాశాన్ని పెంచుతాయి. అవి జన్యుకారకాలు, పొగాకు వినియోగం, అనారోగ్యకరమైన ఆహారం, శారీరక నిష్క్రియాత్మకత, పర్యావరణ కారకాలు, పోషకాహారలోపం, కొన్నిరకాల రేడియేషన్లు, కాలుష్యం లాంటివి ప్రధానమైనవి.

**ప్రపంచ గణాంకాలు :** ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా మరణాలకు క్యాన్సర్ రెండవ ప్రధాన కారణం. క్యాన్సర్ నిర్ధారణ తర్వాత 5 సంవత్సరాలలోపు జీవించి ఉన్న వారి సంఖ్య 5.35 కోట్లుగా అంచనా వేయబడింది. అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధనా ఏజెన్సీ ప్రపంచ క్యాన్సర్ తాజా గణాంకాల ప్రకారం 2022 సంవత్సరంలో రెండు కోట్లు కొత్త క్యాన్సర్ కేసులు, 97 లక్షల మరణాలు సంభవించాయి. సుమారు తొమ్మిది మంది పురుషులలో ఒకరు, పన్నెండు మంది మహిళల్లో ఒకరు ఈ వ్యాధితో మరణిస్తున్నారు. గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ అంచనా ప్రకారం 2022లో ప్రపంచవ్యాప్తంగా మూడింట రెండు వంతుల కొత్త కేసులు, మరణాలలో పది రకాల క్యాన్సర్‌లను కలిగి ఉన్నాయని చూపిస్తున్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణంగా సంభవించే క్యాన్సర్. ఇవి 25 లక్షలు కేసులుతో(12.4%) ప్రథమ స్థానంలోనూ, స్త్రీలలో రొమ్ము క్యాన్సర్లు 23 లక్షల (11.6%) కేసులుతో రెండవ స్థానంలో ఉన్నాయి. కొలొరెక్టల్ క్యాన్సర్ 19 లక్షల (9.6% ) కేసులతోను, ప్రోస్టేట్ క్యాన్సర్ 15 లక్షల( 7.3%) కేసులు, పొట్ట క్యాన్సర్ 9.7 లక్షల ( 4.9%) కేసులతో తరువాత స్థానాలలో ఉన్నాయి. పురుషులలో ప్రోస్టేట్, కొలొరెక్టల్ క్యాన్సర్లు సాధారణంగా సంభవించే క్యాన్సర్లలో రెండవ, మూడవ స్థానంలో ఉన్నాయి.


**మరణాలు :** మొత్తం క్యాన్సర్ మరణాలలో 18 లక్షల (18.7%) మరణాలు ఊపిరితిత్తుల క్యాన్సర్, కొలొరెక్టల్ క్యాన్సర్లతో 9 లక్షలు ( 9.3%), కాలేయ క్యాన్సర్లతో 7.6 లక్షలు (7.8%), బ్రెస్ట్ క్యాన్సర్లతో 6.7 లక్షలు( 6.9%), పొట్ట క్యాన్సర్లతో 6.6 లక్షలు (6.8%) మరణాలు సంభవించాయి. మహిళలలో ప్రధాన కారణం రొమ్ము క్యాన్సర్. అదే పురుషుల విషయం వచ్చేసరికి ఊపిరితిత్తుల క్యాన్సరుగా ఉంది.

**మన దేశంలో పరిస్థితి :** 140 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. 2023 లో మనదేశంలో 14,96,972 క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని నేషనల్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ నివేదిక చూపిస్తుంది. 2040 నాటికి భారతదేశంలో క్యాన్సర్ కేసులు రెట్టింపు అవుతాయని అంచనా.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

# డిఎంఎఫ్టీ నిధుల ఖర్చుపై కాగ్





**ఎండి.మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు**
**9951865223**

డిఎంఎఫ్టీ నిధులు, ఒకప్పుడు కోల్ సెస్ లు లేకుంటే సింగరేణి పరిధి లోని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల అభివృద్ధి కి అవకాశమే ఉండక పోయేది. ఇప్పుడు డిఎంఎఫ్టీ నిధులు కీలకం అయ్యాయి. సింగరేణి కార్మికుల సంక్షేమం, ప్రాంతం అభివృద్ధి, బొగ్గు గనుల విస్తరణ మీదే ఆధారపడి ఉంటుంది. సింగరేణి ప్రస్తుతం మంచి లాభాల్లో ఉన్నది. రాష్ట్రం కు కేంద్రం కు వాటి వాటా ను బట్టి పన్నులు చెల్లిస్తున్నది. ఈ నేపథ్యంలో ఇక ముందు డిఎంఎఫ్టీ నిధుల ఖర్చు మీద కాగ్ ‘ నిఘా ఉంటుంది. ఈ మేరకు కేంద్రం తెచ్చిన కొత్త నిబంధనల ప్రకారం ‘కాగ్’ ఖర్చుల వివరాలు తేల్చుతుంది. ఈ నిధుల ఖర్చు లో అవినీతి జరిగే అవకాశం ఉండదు అంటున్నారు. అయితే పనుల్లో ను నాణ్యత పెరిగే అవకాశం ఉంది.

**15 కిలోమీటర్లలోపు 80 శాతం పనులు**

అంతేకాదు ఇప్పుడు సింగరేణి ఇస్తున్న ఈ నిధులలో 80శాతం నిధులు ఆయా సింగరేణి ప్రాంతంలో 15 కిలోమీటర్లలోపు ఖర్చు చేయాలి. మిగతా 20 శాతం నిధులు 30 కిలోమీటర్లలోపు ఖర్చు చేయాలి. ఈ నిబంధన దాటేది లేదు. కోల్ బెల్ట్ లోని ఎమ్మెల్యేలకు డిఎం ఎఫ్టీ నిధులు వరంలాగా పనిచేస్తున్నాయి. నియోజకవర్గం అంతా ఈ నిధులను వాడుతున్నారు. జిల్లా కలెక్టర్ల పరిధిలో ఈ నిధులు ఉంటాయి. ఇప్పటి దాకా బొగ్గు బావులు లేని ప్రాంతంలకు,జిల్లాలకు కూడ సింగరేణి ఇస్తున్న ఈ నిధులు అభివృద్ధి కార్యక్రమం లకోసం వాడుతున్న పరిస్థితి ఉన్నది. ఈ నిధుల మీద ఎమ్మెల్యే ల ఆజమాయిషీ ఉంటున్నది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ నిధుల దుర్వినియోగం ఆరోపణలు కూడ వచ్చాయి. సింగరేణి విస్తరించి ఉన్న 15 కిలోమీటర్లలోపు 80 శాతం,30 కిలోమీటర్ల పరిదిలో 20 శాతం నిధులు ఖర్చు చేయడం జరిగితే సింగరేణిలోని ఆయా ఏరియాల పరిధిలో పట్టణాల లో మంచి అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుంది. బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల, భూపాలపల్లి, రామగుండము, మంతెని, ఇల్లందు, సత్తుపల్లి, ఆసిఫాబాద్, మణుగూరు ( పినపాక )కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం లలోని కాలరీ ప్రాంతాలకు మాత్రమే నిధులు వాడాలి. విచ్చలవిడిగా సింగరేణి ఇచ్చిన నిధులను ఇతర ప్రాంతాలలో మునుపటి లాగా వాడుకునే పరిస్థితి ఉండదు. ఇలాంటి కొత్త నిబంధనల వల్ల, ‘కాగ్ ‘ భయం తో నైనా నిధుల సద్వినియోగం పెరిగుతుంది అని ఆశించవచ్చు!నిజానికి ప్రత్యేకంగా నిధులు ప్రభుత్వం నుంచి ఆయా నియోజకవర్గంలకు వస్తున్నవి తక్కువే. కొన్ని నియోజకవర్గంలలో నిధులు ప్రత్యేక గ్రాంట్స్ ఆయా నియోజకవర్గంల ఎమ్మెల్యేల చొరవతో వస్తున్నాయి. అక్కడ పనులు కూడ చెక చెకా నడుస్తున్నాయి. ఎక్కువ నియోజకవర్గంలలో డిఎంఎఫ్టీ నిధుల మీదనే ఎమ్మెల్యేలు ఆధారపడి ఉన్నారు. ప్రత్యేక గ్రాంట్స్, అధిక నిధుల కోసం ప్రయత్నాలు చేయడం లేదా, లేక వారికి నిధులు రావడం లేదా? ఎందుకు అలా? ఎవరికీ వారు పరిశీలించుకోవాలి. ఇక మీదట డిఎంఎఫ్టీ ఫండ్స్ మీద ఆధారపడే పరిస్థితి లేదు. ఎందుకంటే ఆ నిధులు ఇక మీదట సింగరేణి పరిధిలోనే ఖర్చుచేయాలి కాబట్టి, ఎవరికీ వారు కొంత ప్రత్యేక నిధులు ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనుల కోసం తెచ్చుకోవాలి.

## వెలుగు రేఖలవుదాం

తరతరాలుగా కరుడుగట్టిన
తారతమ్యాల తలలు దించుదాం
యుగయుగాలుగా పాతుకుపోయిన
వైశమ్యాలను నివారించుదాం
ఎర్రమట్టి పిడికిలి పట్టుసడలకుండా
పట్టుదలతో ముందుకడుగేద్దాం
హక్కులకై దిక్కులు పిక్కటిల్లేలా
నినాదపు స్వరాన్ని వినిపించుదాం

వెలుగు రేఖలై ప్రజ్వరిల్లుతూ
చైతన్య దీపికలై మేల్కొందాం
గుండెలు పిండే బాధల బందీ నుంచి
సగటు బ్రతుకులను తప్పించేద్దాం
పోరాటాలను ఆరాటంగా మలిచి
బడుగు జీవన బతుకుల కొరకై
బహీనతకు తిలోదకాలిచ్చేద్దాం

అందరమొకటై మమేకమౌతూ
ఒకే తాటిపై అడుగులు కదుపుదాం
బానిసత్వాల సంకెళ్ళను తుంచి
సమసమాజానికై ఒకటైపోదాం
ఎగసిపడే కష్టాల కెరటాలకు ఎదురై
ఉన్నతి కోసం ఉరకలు వేద్దాం
గందరగోళ పరిస్థితిని తరిమికొట్టి
ఒకే బాటలో న్యాయ పోరాటం చేద్దాం

ఎర్రజెండా రెపరెపలతో
నిరసన ధ్వని తరంగాలమై
నీతి పాలన నిబద్ధతకు ఓటేద్దాం
నీటి మూటల మాటల మాయలో
మునకలేసే అమాయకత్వాన్ని
విడిచి బ్రతుకుదాం కలిసి నడుద్దాం
వెలుగులో సమాజాన్ని నడుపుదాం

జనంసాక్షి

**నరెద్దుల రాజారెడ్డి**
**సెల్ : 9666016636**


## మంచితనం.. మానవత్వం..!

ఆగనిది ...కాలం
అందనిది...ఆకాశం
ఆకర్షించేది....మనసు
అన్వేషించేది ...మనిషి
అంతరించేది....జీవితం

సమాజంలో మన గౌరవాన్ని
పెంచేది...అనునిత్యం మనతో
వుండేది...మనలోని...మంచితనం..!

అగుపించనిది...
ఆ పరమాత్మ
అందించేది...అవకాశం
అనుభవించేది...జీవితం
అస్తమించేది...
ఈ మట్టి మనిషి దేహం...

ఫలభరితం...ఈ జీవితం
పరిమళిస్తే మనలోని...మానవత్వం..!



**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**

### బేషరతుగా కార్పొరేట్లకు అనుకూలంగా..

# మధ్యతరగతి వారి కలలను తడుముకొనేటట్లుగా బడ్జెట్

ఊహించినట్లుగానే, దేశంలోని అత్యంత అణగారిన శ్రామిక వర్గాన్నిమరియు అణగారిన ప్రజలను కేంద్ర బడ్జెట్ స్థూలంగా విస్మరిస్తూ భారతదేశంలో పెరుగుతున్న మధ్యతరగతి కలలను విలాసాల వైపు మళ్లేటట్లు చేయడం( పాంపరింగ్ చేయడం) లేదా మధ్యతరగతి ఆలోచనలను తట్టుడంతో పాటుగా మితవాద నయా ఉదారవాద విధానాలను వేగవంతం చేయాలనే మోదీ పాలన సంకల్పాన్ని భారత ఆర్థిక మంత్రి 2025 బడ్జెట్ ప్రసంగం వెల్లడి చేసింది. ఇది ప్రపంచ ఆర్థికవేత్తల అధ్యయనాల ప్రకారం, ప్రపంచంలోని 70 కోట్ల “ మొత్తం నిరుపేదల”లో 50% కంటే ఎక్కువ నిరుపేదలు”. దాదాపు 35 కోట్ల మందితో, 145 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలోనే ఉన్నారు. వారంతా చిన్నాచితకా, నైపుణ్యం లేని మొద్దు చాకిరి చేసే శ్రమజీవులుగా( మాన్యువల్) వివిధ రంగాలలో పనులలో నిమగ్నమై ఉన్నారు. అత్యధికులు ఈ అత్యంత అణగారిన, అణచివేతకు గురైన ప్రజలు, వారికి సంవత్సరానికి కనీసం 100 రోజుల ఉపాధి హామీ పథకం అమలు చేయాల్సి ఉన్నది. వీరంతా గ్రామీణ ప్రాంతాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం (ఎం జి ఎన్ ఆర్ ఇ జి ఏ- MGNREGA) కింద దేశమంతా వివిధ రాష్ట్రాలలో నమోదు చేయబడ్డారు.

భారతదేశంలో గత సంవత్సరం నిపుణుల అంచనా ప్రకారం, కనీసం 2.70 లక్షల కోట్లు - 2024లో భారతదేశ స్థూల జాతీయోత్పత్తి ( జిడిపి-GDP)లో దాదాపు 1.5% - మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఇ జి ఏ-MGNREGA) కోసం బడ్జెట్‌లో “ నిరుపేదలకు” లేదా అత్యంత దయనీయ స్థితిలో ఉన్న పేదలకు 100 రోజుల ఉపాధి కల్పించడానికి కేటాయించబడి ఉండాలి. అయితే, 2047 నాటికి “విక్షిత్ భారత్” సాధనలో నిమగ్నమై ఉన్న మోడీ పాలనలో, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు సంవత్సర సంవత్సరానికి క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. బడ్జెట్ అంచనాల ప్రకారం, 2021లో, ఇది స్థూల జాతీయోత్పత్తిలో( జిడిపి- GDP) 0.56%గా ఉంది. ఇది 2022లో 0.41%కి, 2023లో 0.33%కి, 2024లో 0.25%కి తగ్గింది. బడ్జెట్ అంచనాల ప్రకారం మోడీ ప్రభుత్వం మధ్యతరగతి వర్గాలను శాంతింపజేయడానికి బడ్జెట్‌లో అధిక ఉత్సాహం చూపుతోంది. “దేశం బడ్జెట్ పరిస్థితి మధ్యతరగతికి నిదర్శనం”గా ఉన్నది. వారి ఓటు బ్యాంకును నిర్ధారించడంగా ఉన్నది. “విక్షిత్ భారత్”ను వినియోగంతో నడిపించేదిగా చేస్తుంది, అయితే మోడీ ప్రభుత్వం 2025 బడ్జెట్‌లో ఆదాయపు పన్ను తగ్గింపులు, వివిధ మినహాయింపుల ద్వారా సుమారు 1 లక్ష కోట్లను వదులుకుంది. ఈ సమయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఏ-MGNREGA) గురించి అది ప్రస్తావించలేదు. తద్వారా భయంకరమైన పేదరికం, వేదన మరియు దయనీయమైన జీవితానికి “ గురి అవుతున్న వారిని, బేషరతుగా పేదలను” పూర్తిగా విస్మరిస్తున్నది. ఇది ఖండించాల్సిన అంశం .ప్రపంచ బ్యాంకు నిర్వచనం ప్రకారం “పూర్తి పేదలు” అని నిర్వచించినప్పుడు, రోజుకు $1.90 కంటే తక్కువ ఆదాయం ఉన్నవారు పేదలన్నది. భారతదేశంలో ఈ ప్రమాణం ప్రకారం రోజుకు $1.15 కంటే తక్కువ ఉన్నది!


ఇదే సమయంలో, భారతదేశం ప్రపంచంలోనే అతి తక్కువ




కార్పొరేట్ పన్ను విధానాన్ని కలిగి ఉంది. భారతీయ బిలియనీర్ల సంపద గత ఆర్థిక సంవత్సరంలో 42% పెరిగింది. ప్రపంచంలోని అత్యంత తిరోగమన వస్తు సేవల పన్ను( జి.ఎస్.టి-GST)ద్వారా పన్నుల భారం మొత్తం భారతదేశ సామాన్య ప్రజలపై పడింది. ఈ సందర్భంలోనే 2025 బడ్జెట్‌లో మరింత సరళీకరణ, నియంత్రణ సడలింపు, ప్రపంచీకరణ రూపంలో కార్పొరేట్ అనుకూల ప్రోద్బలంతో సహా “స్నేహపూర్వక పెట్టుబడి కోసం సులభతరం చేయడం” (ఈజ్ ఆఫ్ డూయింగ్”“ఇన్వెస్టర్-ఫ్రెండ్లీ”) చర్యల శ్రేణితో పాటు పన్ను విధానాన్ని మరింత సరళీకృతం చేయాలని విధాన రూపకల్పన, అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం భావించింది . విధాన రూపకల్పన, అమలు కొరకు బడ్జెట్‌లో పేర్కొన్న అన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధన, అభివృద్ధి, పట్టణాభివృద్ధి, అణు ఇంధన ప్రాజెక్టుల కోసం కూడా, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పిపిపి) పథకం అని పిలవబడే ఆశ్రిత పెట్టుబడిదారీ(క్రోనీ-పెట్టుబడిదారీ) ప్రమేయం ఈ బడ్జెట్‌లో నిర్ధారించబడుతుంది.

నయా ఉదారవాద కార్పొరేటీకరణ తర్కంలో పనిచేసే బడ్జెట్ మరియు దాని నిబంధనలు దేశం మరియు దాని ప్రజలను ఉంచిన విష వలయాన్ని విచ్ఛిన్నం చేయలేవు. మరియు పాలక పాలన పదేపదే ప్రతిధ్వనించే “అమృత్ కాల్” భారతదేశంలోని సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న కఠినమైన బాధలను, వాస్తవాలను తేటతెల్లంగా మార్చలేరు. రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ప్రజల దృక్పథంతో బడ్జెట్ యొక్క నిజమైన సారాంశాన్ని బహిర్గతం చేయడం అన్ని ప్రగతిశీల-ప్రజాస్వామ్య శక్తులతో కలిసి కార్మికవర్గం మరియు అణగారిన ప్రజలపై మరింత బాధ్యత ఉంది. అందుకు అన్ని ప్రగతిశీల శక్తులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

జనంసాక్షి



**పిజె జేమ్స్**
**ప్రధాన కార్యదర్శి , సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్**

**తెలుగుస్వేచ్ఛానుసరణ:**
**కొల్లిపర వెంకటేశ్వరరావు, కేంద్ర కమిటీ సభ్యుడు, సిపిఐ (ఎం.ఎల్ )రెడ్ స్టార్,**
**9392325652.**

### యాదాద్రి భువనగిరి కలెక్టర్ వితరణ

# యావన్మంది విద్యాభిమానులకు ప్రేరణ



టెన్త్, ఇంటర్ పరీక్షలకు సిద్ధమవుతోన్న తెలంగాణ స్టూడెంట్స్, పేరెంట్స్ గల ప్రతి ఇల్లూ కనెక్టయి ఉత్సాహం, ప్రేరణ పొందే సంభ్రమాశ్చర్యాల అరుదైన సన్నివేశం యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకుంది. మన కనుచూపు మేరలో, మన చుట్టు పక్కల నివాసాల్లో పేదరికంతో సతమతమయ్యే విద్యార్థులకు చేయూతనిచ్చేలా యావన్మంది విద్యాభిమానులకు మోటివేషన్ కాగలదు. మామూలు గానైతే ఏ కుటుంబంలోనైనా సూర్యోదయానికి ముందే పిల్లల్ని లేపి, శ్రద్ధగా చదువుకోమని తల్లిదండ్రులు చెప్పాలి. ఓ టెన్త్ విద్యార్థి ఇంటికి వేకువజామున ఐదింటికే వెళ్ళి ఆ పని సాక్షాత్తూ ఆ జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు చేశారు! అంత పొద్దున్నే తన బృందంతో ఆ బీద విద్యార్థి ఇంటికి చేరుకొని తలుపు తట్టారు. మనసు తలపును తట్టి లేపారు! కంఫర్ట్ గా కూచొని చదువుకునేందుకు వీలుగా తాను బహూకరించిన రీడింగ్ చైర్ వాకిట్లో వేసి, స్వయంగా సర్దారు. రీడింగ్/రైటింగ్ ప్యాడ్ నూ ఇచ్చారు. ఇంట్లోంచి విద్యార్థి తెచ్చిన పుస్తకాలను చూస్తూ మెలకువలు చెప్పారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పరీక్షలకు మిగిలిన రోజుల్లో బాగా చదువుకోవాలని హితవు పలికారు. కుటుంబంలో అందుకు అనువైన పరిస్థితుల కోసం ఆర్థికంగానూ ఆపన్నహస్తం అందించారు. పరీక్షలు రాసే వరకు రెండు నెలలపాటు(ఫిబ్రవరి, మార్చి) రూ.5 వేల చొప్పున ఇస్తానంటూ ఈ నెలవి అక్కడికక్కడే అందజేసి ఆ విధంగానూ ప్రోత్సహించారు. కుటుంబ యోగక్షేమాలు, స్థితిగతులను విద్యార్థి తల్లిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు అధికారి కావాలనే ఆ విద్యార్థి ఆశయం సిద్ధించాలని మనసారా ఆకాంక్షించారు.

కలెక్టర్ ద్వారా ఈ భాగ్యం టెన్త్ స్టూడెంట్ భరత్ చంద్రకు సొంతమైంది! పరీక్షల్లో తగిన జవాబులు చక్కగా రాసి బాగా మార్కులు తెచ్చుకోవడమే ఆ అబ్బాయికి ఇక మిగిలింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఈ నెల 5న రాత్రి నిద్రించారు. పరీక్షలకు సిద్ధం అవుతోన్న విద్యార్థులను అంతకుముందు కార్యోన్ముఖ పరిచారు. వారితో కలిసి భోజనం చేశారు. అదే మండలంలోని కంకణాలగూడేనికి మరుసటి రోజు వెళ్ళినపుడు మనందరినీ ఆకట్టుకునే, ఆలోచింపజేసే, పులకింపజేసే ఆ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. రాష్ట్రంలో మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు ఉంటాయి. తెలంగాణలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్ల నుంచి దాదాపు 2 లక్షల మంది స్టూడెంట్లు ఎగ్జామ్స్ రాయాల్సి ఉంటుంది. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు జరుగుతాయి. తెలంగాణ వ్యాప్తంగా అన్ని రకాల ఇంటర్ కాలేజీల్లో సుమారు 9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. పరీక్షలు రాసే ప్రతి విద్యార్థినీ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు క్షేత్ర స్థాయిలోని సూక్ష్మ ప్రయత్నం, చొరవ, పెద్ద మనసు ఆకర్షిస్తోంది. తాను అనుసరిస్తూనే జిల్లాలోని సంబంధిత సమస్త యంత్రాంగాన్నీ విద్యార్థుల మేలుకొలుపులో నిమగ్నం చేశారు. జిల్లాలోని 86 గ్రామాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో 5600 టెన్త్ విద్యార్థులకుగాను చదువుల్లో మెరుగుపడాల్సిన 1200 మందిని మరింత అప్రమత్తం చేస్తున్నారు. బాధ్యత గల స్థానాల్లో ఉండే ఆఫీసర్లు, పాలకులు, ప్రజాప్రతినిధులు, విద్యాభిమానులు అటువంటి గుండె తడితో ఎక్కడిక్కడ దృష్టి పెట్టాలే కానీ సమాజంలో అట్టడుగు నుంచి అద్భుతాలు వెల్లివిరుస్తాయి. విద్యార్థులు మానసిక ఒత్తిడి జయించేలా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ వ్యాప్తంగా వారితో సంభాషించడం చూస్తున్నాం. మన రాష్ట్రంలో కలెక్టర్ హనుమంతరావు లెగ్ వర్క్ మరింతగా సగటు స్టూడెంట్ మనసు తలపును తట్టి లేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ పరీక్షల వేళ స్వయంగా ఏదైనా వినూత్న ఒరవడికి శ్రీకారం చుడితే బాగుండేది. సానుకూల దృక్పథంతో, తిరుగులేని ఆత్మవిశ్వాసంతో, అవసరం మేరకు ప్రిపరేషన్ తో విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయాలి. ఆల్ ది బెస్ట్!

జనంసాక్షి



ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు
హైదరాబాద్
**9440850384**

## చాయ్ పే కవితా

గురజాడ పరధ్యానంలో రాసాడేమో
కానీ.. ఆకాశతోవల్లో
అమృతభాండమొలికి
నేలరాలిన చుక్క పొగాకై మొలవలేదు.
జాలువారే జవ్వనాల తేయాకు చెట్టై
పొడిచింది
చైనా కొండ వాలుల్లో పుట్టింది
ఆంగ్లేయుల నయనాల్లో పడింది
దేశ దేశాలకు పాకింది
మదగజాన్ని మచ్చిక చేసుకున్నట్లు
మహా జగాన్ని దాసోహం చేసుకుంది
కొవ్వొత్తి త్యాగం తేయాకుది
తన పత్రాలను మరిగించి
తావిపూరిత సుమధురామృతాన్ని
ఇస్తుంది
చాయ్ అని దేశీయులు
టీ అని మ్లేచ్ఛులు
తేనీరు అని గ్రాంథికులు
ఏ పేరుతో పిలిచినా
వేడివేడిగా అదరానికి అందుతుంది
షడ్రుచులకు మించిన శ్రేష్టమైన రుచి
అల్లమేస్తే ఓ తీరు
బెల్లంతో మరో తీరు
మసాలా చాయ్ -కడక్ చాయ్
గోల్డెన్- సింగిల్, కట్ చాయ్
పేరులోనేముంది పెన్నిధి
గుణములో ఉంది రసనిధి
సిప్ వెనుక సిప్
స్టిములేటింగ్ నర్వ్స్
జివ్వుమన్న నరాలు
ఉరకలెత్తే జవనాశ్వాలు
నలుగురున్నచోట నారాయణడేమో
కానీ
ఛాయి ఉంటుంది
కవులు కథకులైనా
కథలు నడిపించే నేతలైనా
వైద్యశాలలో శస్త్రకారుడైనా
వీరు వారననేమి ఎవ్వారలైనా
కప్పు టీ సేవిస్తే
కుదుటపడుతుంది మనసు


నిండైన మెండు గుణాలున్నా..
పథ్యమని -పైత్యమని
ఎసిడిటి -గ్యాస్ట్రిక్ అని
చాయ్ ని గ్రోలవద్దనడం
హృది నుండి నెచ్చెలిని
దూరం చేసే పాపం కాదా

జనంసాక్షి

హెచ్.రవీందర్

# ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు

**• భూభారతిపై అందరి ఆశలు**




**ఝరాసంగం, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** ధరణి పోర్టల్‌లో పలు సాంకేతిక సమస్యలతో రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, ఇతర లావాదేవీలు ఆలస్యం అవుతున్నాయి. స్లాట్ బుక్ కావడంలో సైతం జాప్యం ఏర్పడుతోంది. డిజిటల్లీ నాట్ సైన్డ్, సర్వే నంబరు సరిగా లేదని అంటూ వివిధ కారణాలు చూపుతూ సర్వర్ మొరాయిస్తోంది. ఇప్పటి వరకు ధరణి డాష్ బోర్డ్‌లో సేల్ డీడ్లు 1932,వారసత్వం 325, భాగస్వామ్య ఒప్పందాలు 31, నాలా 215 దరఖాస్తుల పెండింగ్ చూపిస్తున్నాయి.ధరణి పోర్టల్ టెర్రాసిస్ నుంచి నేషనల్ ఇన్ఫర్మెటిక్స్ సెంటర్ చేతుల్లోకి వెళ్లినా తిప్పలు తప్పడం లేదు. జిల్లాలో మ్యుటేషన్, నాలా, జీపీఏ, పీవోబీ, కోర్టు కేసులు, పాస్ బుక్ డేటా కరెక్షన్ తదితర దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం ధరణి పోర్టల్ మాడ్యూల్స్‌లో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ పరిష్కారం కావడం లేదు. దీంతో బాధితులు తహసీల్దార్, ఆర్‌డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఖాతా, సర్వే నంబర్లు మిస్సింగ్, తప్పులు, పట్టాదారు పేర్లు, ఫొటోల్లో తప్పులు, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, పట్టా, అసైన్డ్ భూములు ప్రభుత్వ భూములుగా నమోదు వంటి తప్పులు పరిష్కారం కావడం లేదని దరఖాస్తుదారులు అంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ భూములకు డిమాండ్ వచ్చింది. ఈ క్రమంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ భూ సమస్యలు కొలిక్కి రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సిటిజన్ పోర్టల్లో ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నా రెవెన్యూ అధికారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేవని తిరస్కరణ చేస్తున్నారు. ఈ విషయమై ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించగా అధికారుల నుంచి సరైన సమాధానమే ఉండడం లేదని రైతులు వాపోతున్నారు.

**కార్యాలయాల్లో మూలుగుతున్న దరఖాస్తులు..**

ధరణి పోర్టల్‌ను భూ సమస్యలు పారదర్శకంగా పరిష్కరించేందుకు జీఎల్ఎం పేరిట వెసులుబాటు కల్పించింది. రైతులు మీసేవ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నేరుగా కలెక్టర్ లాగిన్‌కు వెళ్తుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయా తహసీల్దార్లకు కలెక్టర్ చేరవేస్తారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చిన నాలుగు రోజుల్లోనే పరిష్కరించాలి. అభ్యంతరాలు ఉంటే వాటిని నమోదు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఏ దశలో ఉందనే విషయాన్ని సంబంధిత దరఖాస్తుదారుడికి తెలపాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు తమ భూ సమస్యలను ధరణి వెబ్‌సైట్ ద్వారా కలెక్టర్లకు విన్నవించేందుకు వెబ్‌సైట్ జీఎల్ఎం, టీం-33 మాడ్యుల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆప్షన్ల ద్వారా వేల మంది రైతులు తమ భూ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి సర్వే నంబర్‌పై మోఖా పంచనామా నిర్వహించి తుది నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపుతున్నారు. అక్కడకు చేరిన నివేదికలను వేగంగా పరిశీలించి డిజిటల్ సంతకాలు చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైతుల దరఖాస్తులు నెలల తరబడి కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి.

**భూ భారతిపై ఆశలు..**

ధరణి పోర్టల్‌లోని నిబంధనలతో రైతులు సమస్యల పరిష్కారానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన రేవంత్‌రెడ్డి సర్కార్ భూభారతి పోర్టల్ తేవాలని యోచిస్తోంది. దీనికి సంబంధించిన నిబంధనలు ఇంకా ఖరారు కానప్పటికీ ఆయా మండలాల్లోని తహసీల్దార్లు మాత్రం త్వరలో భూభరతి వస్తుందని, మీ సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యే అవకాశం ఉందని చెబుతూ కార్యాలయాలకు వచ్చే రైతులను తిరిగి పంపిస్తున్నారు. భూ సమస్యలు పరిష్కారం కాక పట్టదారు పాసుపుస్తకాలు రాక రైతులు బ్యాంకు రుణాలు, రైతు బంధు, ఇతర ప్రయోజనాలు పొందక తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో కాంగ్రెస్ సర్కార్ తీసుకొచ్చే భూభరాతి కోసం రైతులు నిరీక్షిస్తున్నారు.

## గ్రీన్‌వుడ్ పాఠశాలకు సీబీఎస్ఈ అనుమతి



**• స్కూల్ చైర్మన్ తుమ్మలూర్రు మర్రెడ్డి, డైరెక్టర్ సరిత**

**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** పట్టణంలోని గ్రీన్ వుడ్ పాఠశాలకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ద్వారా అనుమతి లభించిందని ఇది తమకు చారిత్రాత్మకమైన విషయమని పాఠశాల చైర్మన్ తుమ్మ లూర్దు మర్రెడ్డి, డైరెక్టర్ సరిత లు అన్నారు. గురువారం సీబీఎస్ఈ గుర్తింపు పొందిన సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ టు సెకండరీ ఎడ్యుకేషన్ వరకు గ్రీన్ వుడ్ పాఠశాల సీబీఎస్ఈ కింద గుర్తింపు పొందిందన్నారు. పూర్తిస్థాయి సొంత భవనాలతో, అధునాతనమైన లేబరేటరీలు, పూర్తిస్థాయి కంప్యూటర్ వ్యవస్థ, సిబిఎస్ఈ కి అవసరమైన మౌలిక వసతులు, అత్యున్నతమైన బోధన వసతులు, ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన సిబ్బందితో ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు. సీబీఎస్ఈ గుర్తింపుతో ఈ ప్రాంత విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలు, అత్యున్నత స్థాయి విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. ఈ విషయంలో సహకరిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎన్.సి.ఈ.ఆర్.టి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ద్వారా సీబీఎస్ఈ గుర్తింపు పొందిన పాఠశాల యాజమాన్యాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏవి కృష్ణారావు, ప్రిన్సిపాల్ రాజారెడ్డి పాల్గొన్నారు.

## గుర్తింపు పొందిన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలి

**• జిల్లా అదనపు కలెక్టర్ నరసింహారావు**



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** ప్రామాణికంగా గుర్తింపు పొందిన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి కార్యాలయంలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, హైదరాబాద్ బ్రాంచ్ ఆఫీస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెన్సిటైజేషన్ అవగాహన కార్యక్రమంలో జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. బిస్ కేర్ యాప్ ద్వారా సంబంధిత రంగాలకు సంబంధించిన ప్రమాణాలను తెలుసుకోవడం, డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని పి.వి శ్రీకాంత్, డైరెక్టర్ అండ్ హెడ్, డైరెక్టర్ తమ్మడి సుజాత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రామాణిక ఉత్పత్తుల నాణ్యతా తనిఖీలు, మార్కెట్‌లోని నాసిరకం ఉత్పత్తులను నియంత్రించే చట్టాల గురించి జిల్లాలోని అధికారులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఇండియన్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్, వారి సెక్టార్-నిర్దిష్ట ప్రమాణాలు మరియు సర్టిఫికేషన్ వివరాల గురించి అవగాహన కల్పించాలన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలను మరింతగా అనుసరించి, నాణ్యమైన ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. బిస్ యాప్ వినియోగదారులకు ఉత్పత్తుల ప్రమాణాలు, హాల్మార్క్, లైసెన్సు వివరాలు,రిజిస్ట్రేషన్ నంబర్లను సులభంగా తనిఖీ చేయగలుగుతుందని అన్నారు.ఈ యాప్ ద్వారా వినియోగదారులు నాణ్యమైన ఉత్పత్తులను ఎంపిక చేసుకోగలరని, అలాగే నాణ్యత లోపం లేదా దుర్వినియోగం గురించి ఫిర్యాదు చేయవచ్చువని తెలిపారు. బిస్ కేర్ యాప్ వినియోగదారుల హక్కులను రక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలను అవగాహన పెంచడం,ఉత్పత్తుల ప్రామాణీకరణను అనుసరించడం, నాణ్యమైన ఉత్పత్తుల వినియోగం గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**• జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్**



**మక్తల్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. గురువారం నేషనల్ హైవే ఎన్‌హెచ్ 67 జాతీయ రహదారిపై ఉన్న జక్లేర్ చౌరస్తా నుండి కాచ్ వార్ గ్రామ రోడ్డు, మంతన్ గోడ్ క్రాస్ రోడ్, దండు క్రాస్ రోడ్, నల్లజానమ్మ టెంపుల్, మక్తల్ బస్టాండ్ చౌరస్తా, కన్యక పరమేశ్వరి దేవాలయం క్రాస్ రోడ్, దాసరపల్లి క్రాస్ రోడ్ వరకు మొత్తం రోడ్డు ప్రమాదాలు జరిగే యాక్సిడెంట్స్ ప్రోన్ ఏరియాస్ ను గుర్తించి అక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పార్ట్స్ ని, రోడ్డు మలుపుల దగ్గర, క్రాస్ రోడ్స్ వద్ద, గ్రామాల నుండి ప్రధాన రహదారికి కలిసే చోట ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సిఐ చంద్ర శేఖర్, ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి లు ఎస్పీ కి తెలిపారు. నేషనల్ హైవే మరికల్ నుండి కృష్ణ 54 కిలోమీటర్ల వరకు గ్రామాల నుండి ప్రధాన రహదారిపైకి వచ్చే ప్రతి రోడ్డు మార్గాన స్పీడ్ బ్రేకర్లు లేని చోట వేయించాలని, వాటికి వైట్ పెయింట్ తో కలర్స్ వేయించాలని ఎస్పీ సూచించారు. నేషనల్ హైవే పై రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రధాన చౌరస్తాల్లో బ్యారికేట్స్ ఏర్పాటు చేయాలని, స్పీడ్ నియంత్రణ కొరకు స్పీడ్ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని, మలుపుల దగ్గర రేడియం స్టిక్కర్స్ తో బోర్డ్స్ వేయించాలని హైవే అధికారులకు తెలిపారు. రాత్రి సమయంలో రహదారిపై వాహనాలు నిలిచి ఉండడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున హైవే పెట్రోల్ వాహనాలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ రోడ్డుపై ఎలాంటి వాహనాలు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని మిగతా వాహనాలకు ఏలాంటి ఆటంకాలు లేకుండా విజిబుల్ పోలీసింగ్ గా ఉండి విధులు నిర్వర్తించాలని పోలీసులకు తెలిపారు. వాహనాల వేగ నియంత్రణ కొరకు 80 స్పీడ్ దాటితే చలన్స్ విధించాలని, వాహనదారులకు కనిపించే విధంగా ఇంకా కొన్ని స్పీడ్ నియంత్రణ సూచికలు అవసరమైన చోట వేయించాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాల కంటే ఈ సారి ఏకువగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రజలకు, వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు రహదారులపై వాహన దారులు ప్రయాణిస్తున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సైన్ బోర్డ్స్‌ను గమనిస్తూ వెళ్లాలి. ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవింగ్ చేసేవారు విధిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. రహదారి పైకి వెళ్లే సమయంలో, రోడ్డు క్రాస్ చేసే సమయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రష్ డ్రైవింగ్ చేయరాదు అని జిల్లాలో ప్రజలందరూ పై నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎస్పీతో పాటు సిఐ చంద్రశేఖర్, మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, ఏఈ ఆర్అండ్‌బీ అభిషేక్ రెడ్డి, ప్రధాన రోడ్డు కాంట్రాక్టర్ మధువర్మ పాల్గొన్నారు.

## సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



**మల్దకల్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** బేటి బచావో బేటి బడావో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లా మహిళా సాధికారత బృందము గురువారం మల్దకల్ మండలంలోని అమరవాయి గ్రామంలో అవగాహన నిర్వహించారు.జిల్లా మహిళా సాధికారత కేంద్రంలోని ఫైనాన్షియల్ లెటర్స్ నాగరాజు మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లలను చదివిద్దాం అని సూచించడం జరిగింది.విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని చదవాలి,బేటి బచావో బేటి పడావో అనగా లింగ సమానత్వం సాధించడం ఆడపిల్లలు కచ్చితంగా చదువుకునేటట్లు చూడాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అక్రమాలను దృష్టిలో పెట్టుకొని,గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం ద్వారా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారిపై ఈ చట్ట ప్రకారం శిక్ష విధించబడుతుంది సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుంది జీరో నుంచి పది సంవత్సరాల ఆడపిల్లలకి ఈ యొక్క పథకం ఉపయోగపడుతుందిని, గ్రామంలో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోగలరు,పిల్లలకు సేఫ్ టచ్ అండ్ సేఫ్ టచ్, బాల్య వివాహాలు ఫోక్సో ఆక్ట్ గురించి అవగాహన కల్పించడం జరిగింది.ఆపదలో ఎవరైనా బాలలు కనిపించినట్టయితే 1098కి సమాచారం అందించగలరు తెలిపారు. 1098తో పాటు 181, 1930 ,100,108 మొదలైన హెల్ప్ లైన్ ల గురించి అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనరల్ స్పెషలిస్ట్ సరోజ,కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య, అంగన్వాడీ టీచర్స్ పద్మా, యశోదమ్మ,తిమ్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో శాంతి సామరస్యాలు వెల్లివిరియాలి



**• హజ్రత్ ముఫ్తి అబు బకర్ జాబెర్ ఖాస్మి సహాబ్**

**దేవరకొండ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** ఇస్లామిక్ విద్య విప్లవాత్మకంగా మార్చడంలో మోమిన్ ఆన్లైన్ కోర్సులు అగ్రగామిగా నిలుస్తుందని, ఆన్లైన్ క్లాసులు పిల్లలు, మహిళల జీవితాలను మెరుగుపరుస్తున్నాయని నాజిం కఫుల్ ఇమామ్ ట్రస్ట్ హైదరాబాద్ హజ్రత్ ముఫ్తి అబు బకర్ జబెర్ ,వస్తాద్ దారుల్ ఉలూం రషీదియా హైదరాబాద్ హజ్రత్ ముఫ్తి సయ్యద్ సల్మాన్, హైకోర్టు న్యాయవాది ఖుద్సియా తబస్సుమ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో దారుల్ ఇల్మ్,ఇజ్లాస్ ఏ ఆమ్ కార్యక్రమంలో భాగంగా ముఫ్తి జావిద్ హుస్సేన్ అధ్యక్షతన గత నాలుగు సంవత్సరాల నుండి ముఫ్తి రిజ్వాన్ ఖాస్మి జరిపిన మోమిన్ ఆన్లైన్ కోర్సుల సర్టిఫికెట్లను రాయల్ ఫంషన్ హాల్ లో మహిళలకూ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులకూ స్థానిక ఉలేమా లు శాలువతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నావభారత్ ఇన్నోవేటివ్ పాఠశాలలో, తదనంతరం ఖుతుబ్ షాయి మస్జీద్ లో పురుషుల కొరకు ఏర్పాటుచేసిన జల్సాలో అతిథులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాలలో ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ మోమిన్ ఆన్లైన్ కోర్సుల ద్వారా వందలాది మంది మహిళలు ఖురాన్ బోధనలు వ్యక్తిత్వ వికాసం, రంజాన్ పూర్వ కోర్సులు బేసిక్ అరబిక్, గ్రామర్ మెమోరియలైజేషన్ కోర్సులతో సహా విభిన్న కోర్సుల నుండి ప్రయోజనం పొందుతున్నారని అన్నారు. చిన్నారులకు ప్రస్తుత తరుణంలో మనిషి స్వార్థపూరితమైన నా, నేను,నాకు అనేటువంటి జీవితం కొనసాగిస్తున్నాడని ఈ భూలోకం మనిషికి శాశ్వతం కాదని, పరలోకం శాశ్వతం అన్నారు భూలోకంలో చేసిన ప్రతి పనికి పర లోకంలో అల్లాహ్ కు జవాబు చెప్పాల్సి ఉంటుందని గ్రహించాలని అన్నారు.

## వ్యాన్ కిందపడి చిన్నారి మృతి

**• పెద్ద అంబర్‌పేట్‌లో రోడ్డు ప్రమాదం**



**అబ్దుల్లాపూర్మెట్, ఫిబ్రవరి 6, (జనం సాక్షి) :** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం జరిగిన దారుణ రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయింది. వివరాల్లోకి వెళితే, బోబ్బిలోగామ రిత్విక (వయస్సు: 4), శ్రీ చైతన్య స్కూల్‌లో ఎల్ కె జి చదువుతున్న విద్యార్థిని, స్కూల్ వేళలు ముగిసిన తర్వాత ప్రయివేట్ స్కూల్ వ్యాన్ (టీఎస్18టీ1071)లో తన ఇంటికి బయలుదేరింది. ఇంటి వద్ద వ్యాన్ దిగుతున్న సమయంలో, డ్రైవర్ కొమ్ము గణేష్ (వయస్సు: 27, నివాసం: ఎల్లారెడ్డి కాలనీ, హయత్‌నగర్) అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో బాలిక వ్యాన్ ముందు పడిపోయింది. ఈ క్రమంలో వ్యాన్ ముందు చక్రం ఆమె తలపై నుంచి వెళ్లిపోయి, చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో కుటుంబసభ్యులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా హాస్పిటల్ మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజుగౌడ్ కేసు నమోదు చేసుకొని, పూర్తి వివరాలను విచారణలో భాగంగా పరిశీలిస్తున్నారు.

## చారకొండలో జాతీయ రహదారి బైపాస్ బాధితులకు కొత్తగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

**• ఈ నెల 10న బాధితులతో జిల్లా కలెక్టర్ ముట్టడి నిర్వహిస్తాం**



**చారకొండ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** చారకొండ మండల కేంద్రంలో జాతీయ రహదారి 167 రోడ్డుకు అడ్డంగా ఉన్న ఇండ్లను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా 29 ఇండ్లను జెసిబి లతో నేలమట్టం చేయడంతో పేదలంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, బాధితులకు వెంటనే నూతన ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం చారకొండ మండల కేంద్రంలో బైపాస్ బాధితులను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలో బాధితులతో ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ జాతీయ రహదారి బైపాస్ బాధితులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపియకుండా హఠాత్తుగా వచ్చి అధికారులు, పోలీసు భారీగా మోహరించి వారి ఇండ్లను నేలమట్టం చేశారని అన్నారు. కనీసం తమ ఇంట్లో ఉన్న సామాన్లను తీసుకోవడానికి సమయం ఇవ్వండి అని అడిగినా ఇవ్వకుండా దౌర్జన్యంగా నిర్ధాక్షణంగా కూల్చివేశారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన నష్టపరిహారం బాధితులకు ఏమాత్రం సరిపోదని వారికి ఇచ్చిన పరిహారం కనీసం 100 గజాల జాగా కూడా రాని దుర్మార్గమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం బాధితులకు ఇంటి స్థలం తో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిర్వాసితులకు 50 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన శుక్రవారం కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట బైపాస్ బాధితులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేదలకు న్యాయం జరగకపోతే ఈనెల 10న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. అనంతరం తాసిల్దార్ సునీతకు బాధితుల పక్షాన వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింత ఆంజనేయులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏపీ మల్లయ్య, సిపిఎం ఏరియా కార్యదర్శి బి. బాలస్వామి, సిపిఎం నేత మధు, బాధితులు కిరణ్, అనిల్ సందూరి నరేష్, గ్యార రాజు, అలివేలు శిరీష, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## భరోసా సెంటర్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూలు జిల్లాలో భరోసా సెంటర్ పెట్టి సంవత్సరం పూర్తి అయినందున నాగర్‌కర్నూల్ జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ రామేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ ప్రెస్‌మీట్ నిర్వహించి భరోసా సెంటర్ ద్వారా ఐతున్న పనుల గురించి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల సమక్షంలో అందరికీ వివరించడం జరిగింది. మహిళలకు భరోసా సెంటర్ ద్వారా స్టేట్మెంట్ రికార్డ్, కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని భరోసా సెంటర్ సిబ్బంది మంచిగా పని చేస్తున్నారని కొనియాడారు. అలాగే ఆపరేషన్ స్మైల్ ఆపరేషన్ ముస్కాన్ ద్వారా మైనర్ బాల బాలికలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారి మీద కేసులు నమోదు చేసి చిన్నపిల్లలకు బరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి సిహెచ్ రామేశ్వర్, సత్యనారాయణ, నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్య, నాగర్ కర్నూల్ ఎస్సై గోవర్ధన్‌తో పాటు భరోసా సిబ్బంది సఖి సెంటర్ సిబ్బంది, షీటీం సిబ్బందితో పాటు ప్రింటర్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
07 ఫిబ్రవరి 2025

# బంజారాలకు10 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు సభావాత్ రాముల నాయక్



**నల్గొండ బ్యూరో, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** బంజారాలకు చట్టసభల్లో జనాభాకు తగ్గట్టుగా సీట్లు కేటాయించాలని ఆల్ ఇండియా బంజారా రాష్ట్ర అధ్యక్షుడు రాముల నాయక్ కోరారు.ఆల్ ఇండియా బంజారా సేవా సంఘఆధ్వర్యంలో గురువారం నల్గొండ పట్టణంలో నల్గొండ జిల్లా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు సపవత్ రాములు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మా జనాభా దామాషా ప్రకారం10 శాతం రిజర్వేషన్ కల్పించి, రాజకీయపరంగా మాకు దక్కవలసిన సీట్లుహక్కుల కోసం కుల నిష్పత్తి ప్రకారం మేమెంతో మాకంతా కేటాయించాలన్నారు.33 జిల్లాలలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా స్థాయిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని,ఈ సమ్మేళనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా బంజారా జాతీసమస్యలు పరిష్కరించే విధంగా భవిష్యత్తులో కార్యచరణ రూపొందించుకొని,ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమ్మేళనానికి హాజరైన ప్రతి ఒక్క బంజారా జాతి బిడ్డలకు ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో నలగొండ జిల్లా డిసిసి ప్రెసిడెంట్ కేతావత్ శంకర్ నాయక్,ఏఐ బి ఎస్ ఎస్ ఎల్ పాండు నాయక్,ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భగవాన్ నాయక్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బాబు నాయక్, నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, మునుగోడు నియోజకవర్గం అధ్యక్షుడు బిక్షపతి నాయక్, బంజారా నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నవ శకానికి నాంది పలికిన కలెక్టర్

**సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** తెల్లవారుజామున పదవ తరగతి విద్యార్థి ఇంటికి వెళ్లి తలుపు కొట్టి భరత్ చంద్ర ఉన్నారా..! నేను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావుని వచ్చాను అని అన్నారు. విద్యార్థి తల్లి తన కొడుకు కోసం జిల్లా కలెక్టర్ ఎందుకు వచ్చాడని వెంటనే తలుపుతీసింది. నమస్కారం సార్ ఇంత పొద్దున్నే మా ఇంటికి వచ్చారు. ఏంటి సార్ అని తన తల్లి భరత్‌ను తోడుకొని కలెక్టర్ వద్దకు వచ్చింది. భరత్ పదో తరగతి చదువుతున్నాడు కదా తను ఎలా చదువుతున్నాడు పరిశీలిద్దాం అని వచ్చాను అని కలెక్టర్ చెప్పాడు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం శేరిగూడెం గ్రామంలో గురువారం తెల్లవారుజామున జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమానికి నాంది పలికారు. పదవ తరగతి అనేది విద్యార్థి జీవితానికి మైలురాయి లాంటిదని, భరత్‌కు జిల్లా కలెక్టర్ చెప్పారు. భరత్‌కు తండ్రి లేకపోవడంతో వాళ్ళ అమ్మ కష్టపడి చదివిస్తుంది. జిల్లా కలెక్టర్ నువ్వు పదవ తరగతిలో మంచి మార్కులు సాధించి మీ అమ్మకి సంతోషాన్ని ఇవ్వాలని, కష్టపడి చదివి పాస్ అయితే జీవితంలో విజయానికి తొలిమెట్టు అవుతుందని, తల్లిదండ్రులకు గురువులకు జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. భరత్ జీవితంలో స్థిరపడే వరకు సహకారం అందిస్తానని తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రతినెల 5000 రూపాయల సహాయాన్ని అందిస్తానని, చెప్పి వెంటనే ఫిబ్రవరి నెల సాయాన్ని భరత్ కు అందజేశారు. అదేవిధంగా విద్యార్థి చదువుకునేందుకు వీలుగా స్టడీ చైర్, రైటింగ్ ప్యాడ్ అందజేశారు. అనంతరం తల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.భరత్ తనకి పోలీస్ ఆఫీసర్ కావాలని, ఉందని కష్టపడి సాధిస్తానని, కలెక్టర్ కు స్వయంగా ఇంటికి రావడం నమ్మలేకపోతున్నానని, కలెక్టర్ సార్ రావడంతో తనలో ఆత్మవిశ్వాసం



పెరిగిందని బాగా చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానని తెలిపారు. భరత్ నారాయణపురం జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు మండల స్థాయి అధికారుల నుండి మొదలుపెడితే జిల్లా అధికారుల వరకు పదో తరగతిలో కాస్త వెనుకబడిన విద్యార్థుల ఇంటి తలుపులు తట్టి వారిని ప్రోత్సహించే కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఆయన వెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, స్థానిక పంచాయతీ కార్యదర్శి సుభాష్, శ్రీను ఉన్నారు.

# మూడు కోట్ల విలువైన సెల్‌ఫోన్‌ల రికవరీ

- ఫోన్ పోతే సిఈఐఆర్‌లో ఫిర్యాదు చేయండి
- బాధితులకు అందజేసిన సిపి

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** రాచకొండ కమిషనరేట్ లోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజల నుండి దొంగిలించబడిన, పొరపాటున పోయిన మూడు కోట్ల విలువైన1016 మొబైల్ ఫోన్లను సిఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేశామని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు నే రెడ్ మెట్ లోని కమిషనర్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.దొంగిలించబడిన మొబైల్స్ ను తక్కువ ధరకు విక్రయిస్తుంటే కొనుగోలు చేయరాదనీ, అలాంటి సంఘటన ఎక్కడైనా చోటు చేసుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గత నెల రోజుల్లో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా 1400 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి 1016 సెల్ ఫోన్ లను బాధితులకు ఇచ్చే కార్యక్రమాన్ని నేరెడ్‌మేట్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బాధితులకు ఇచ్చే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫోన్ పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు,నమోదు చేయడం వల్ల ఆ ఫోన్ లొకేషన్ ట్రేస్ చేసి తిరిగి పొందే అవకాశం ఉంటుందని ఆయన ప్రజలకు సూచించారు. ప్రజలు



తమ మొబైల్ పోయిన వెంటనే ఈ పోర్టల్‌లో కంప్లయింట్ నమోదు చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్లను రికవరీ చేసేందుకు రాచకొండ కమిషనరేట్‌లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలియజేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీ నగర్ డివిజన్‌లో 655 ఫోన్లు, మల్కాజిగిరి డివిజన్ లో 290 ఫోన్లు, భువనగిరి డివిజన్ లో 71 ఫోన్లు రికవరీ చేశామన్నారు.మొబైల్ ఫోన్ గల్లంతైన వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు వేగంగా స్పందించి ఫోన్‌ను తిరిగి ఇవ్వగలుగుతారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.



### పోలీసులపై మరింత నమ్మకం పెరిగింది

తాను మూడు నెలల క్రితం రాత్రి 11 గంటల సమయంలో సరూర్ నగర్ నుంచి ఎల్బీనగర్ కు వస్తుండగా తన ఫోన్ పోగొట్టుకున్నట్టు శ్రీధర్ పేర్కొన్నారు. పోయిన పోను మళ్ళీ పోలీసులు తనకు అప్పగించడంతో చాలా సంతోషంగా ఉందని పోలీసుల విధి నిర్మాణాల పట్ల మరింత నమ్మకం పెరిగిందని పేర్కొన్నారు.

### లినా భర్త గిఫ్టుగా ఇచ్చిన ఫోన్

సెల్ఫోన్ను బర్త్ డే గిఫ్ట్ గా తన భర్త ఇచ్చాడు.పెళ్లిరోజు పోయింది. పోలీసుల సహకారంతో తన భర్త అమూల్యమైన గిఫ్ట్ ను పొందగలిగాను.ఓ మహిళా తన ఆనందాన్ని పోలీసుల ముందు వ్యక్త పరిచింది.

# భూ నిర్వాసితుల తీవ్ర ఆందోళన

- పట్టించుకోని ప్రజా ప్రభుత్వం
- సర్వం కోల్పోయామని మిన్నంటిన రోదనలు
- 32 మందికి ఇళ్ల స్థలాలు
- 15 మందికి రాని ప్యాకేజ్
- నర్సిరెడ్డిగూడెం గ్రామాన్ని ఖాళీ చేయాలని ఇరిగేషన్ అధికారుల ఒత్తిడి
- ఫిబ్రవరి 10 తర్వాత గ్రామానికి కరెంటు, నీళ్లు కట్..
- ప్రాణాలైనా వదులుతాం కానీ... గ్రామాన్ని మాత్రం ఖాళీ చేసే ప్రసక్తే లేదు

**మర్రిగూడ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** భూ నిర్వాసితుల తీవ్ర ఆందోళన, పట్టించుకోని ప్రజా ప్రభుత్వం.. మర్రిగూడ మండలంలోని శివన్న గూడెం గ్రామంలో దిండి ఎత్తిపోతలో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితుల దీన గాథ, ముంపుకు గురవుతున్న నర్సిరెడ్డిగూడెం గ్రామాన్ని ఇరిగేషన్ అధికారులు ఖాళీ చేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గురువారం నర్సిరెడ్డిగూడెం గ్రామంలో ఇళ్ల స్థలాలు, ఆర్అండ్ఆర్



ప్యాకేజీ, భూ నష్టపరిహారం రావాలని గ్రామంలో భూ నిర్వాసితులు ఆందోళన నిర్వహించారు, సర్వం కోల్పోయామని బోరున విలపిస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు, ప్రభుత్వం తమకు రావలసిన నష్ట పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దగ్గరకు చాలాసార్లు వెళ్లిన ఫలితం లేకపోగా తమను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, గ్రామంలో 32 మందికి ఇళ్ల స్థలాలు, 15 మందికి ఇళ్ల స్థలాలతో పాటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూ నష్టపరిహారం రావాల్సి ఉందని తెలిపారు, ఫిబ్రవరి 10వ తేదీన గ్రామానికి దారి, కరెంటు, నీళ్లు నిలిపివేస్తామని ఇరిగేషన్ అధికారులు తమని భయభ్రాంతులు చేస్తున్నారని, ఓ ఇరిగేషన్ అధికారి తమపై దౌర్జన్యం చేస్తున్నాడని దగ్గరుండి ఇల్లు ఖాళీ చేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు, మాకు రావాల్సిన అన్ని రకాల పరిహారాలు అందిన తర్వాతనే గ్రామాన్ని ఖాళీ చేస్తామని ఇబ్బందులకు గురి చేస్తే తమ ప్రాణాలను తీసుకుంటామని హెచ్చరించారు.

# విష సర్పాలకు ఆవాసం ఈ ఉద్యానవనం

- చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ ఆధ్వర్యంలో ఆందోళన



**కాప్రా, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** పేరుకే ఆదర్శనగర్ ఎటు చూసినా సమస్యలే స్వాగతం పలుకుతాయి.పేదల నివసించే బస్తీలో పార్కులు కబ్జాకు గురవుతున్నాయి. అభివృద్ధికి అందనంత దూరంలో చర్లపల్లి డివిజన్‌లో కాలనీలో ప్రథమ స్థానంలో ఉన్నాయని అక్కడి సమస్యల చూస్తే కనిపిస్తోంది. ఆహ్లాదం పంచే మార్గాలు చూపించండి మహాప్రభో అని వేడుకుంటున్నారు. కాలనీలోని పార్కులు చెత్త చెదారంతో బిక్కుబిక్కు మంటూ బతకాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, ఆదర్శ కాలనీ ప్రతినిధులు నరసింహ వంశరాజ్, ముత్తు వంశరాజ్, సిసిఎస్ ఉపాధ్యక్షులు గంప కృష్ణ, యావపురం రవి, బివి నరసింహారెడ్డి, ఉపేందర్ వంశరాజ్, సింగిరెడ్డి నరసింహారెడ్డి, కంచు గట్ల రాము, చిట్టిబాబు, గిరి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

- ప్రభుత్వ వైఖరి పట్ల నల్ల బ్లాడ్జిలతో వీఆర్ఏల నిరసన

**చేర్యాల, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** వీఆర్ఏ లను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని వీఆర్ఏ జేఏసీ తీవ్రంగా ఖండిస్తూ గురువారం వీఆర్ఏలు చేర్యాల తహసీల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్లాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వీఆర్ఏ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. 2022లో 80 రోజుల సుదీర్ఘ సమ్మె పోరాట ఫలితంగా గత ప్రభుత్వం జీవో నెంబరు 81, 85 లను విడుదల చేసిందన్నారు. ఆ జీవో ని అనుసరించి రాష్ట్రంలో ఉన్న 20,555 మంది వీఆర్ఏ ల్లో 16,758 మంది వీఆర్ఏ లకు పదోన్నతులు ఇచ్చి ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. ఆ జీవోలో ఉన్న 3797 మంది వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి 19 నెలలు గడుస్తున్న నేటికీ వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదన్నారు. పలుమార్లు ముఖ్యమంత్రి రెవిన్యూ శాఖ మంత్రిని రెవెన్యూ అధికారులను కలిసి సమస్య విన్నవించి అనేక నిరసనలు తెలిపినా ప్రభుత్వం సానుకూలంగా స్పందించని కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతుంది. జీవో ఇచ్చి 19 నెలలు కావస్తుందని, ప్రభుత్వం విఆర్ఏ ల సమస్యల పరిష్కారం కోసం కమిటీని వేసి సంవత్సరం అవుతుంది ఇప్పటివరకు ప్రభుత్వం వీఆర్ఏ వారసులకు



ఉద్యోగాలు ఇవ్వకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తుంది? రెవిన్యూ శాఖ మంత్రి సీసీఎల్ఏ వీఆర్ఏ వారసులతో ఎందుకు చర్చించడం లేదు సమస్య పరిష్కరించుటకు ప్రభుత్వం ఎందుకు సర్వ తీసుకోవడం లేదు. వీఆర్ఏలు 300 మంది పైగా మరణించిన అనేకమంది వీఆర్ఏ వారసులు ఆత్మ హత్యలు చేసుకుంటున్న ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలైన వీఆర్ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, జీవో నెంబర్ 81,85 ప్రకారం వారసులకి ఆర్డర్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో బొల్లె మల్లేశం, సత్తాల మహేష్, సనాది ప్రవీణ్ కుమార్, జక్కుల పర్శరాములు, అరిగే సత్తయ్య, అరిగే చంద్రమౌళి, బోయిని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# మోసపోయిన రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

- కాంగ్రెస్ నేతలకు సంబంధం లేదు
- మాజీ ఎమ్మెల్యేలు రేగా, హరి ప్రియల ఆరోపణలు అర్థరహితం
- విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు

**టేకులపల్లి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** ఇటీవల టేకులపల్లి మండలానికి చెందిన కొంతమంది రైతులు మొలకెత్తని మొక్కజొన్న విత్తనాలు వలన నష్టపోయామని, అందుకు బేతంపూడి సొసైటీ అధ్యక్షులు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు లక్కినేని సురేందర్ రావు ప్రోత్సాహంతోనే విత్తనాలు తీసుకొని నష్టపోయారని,నష్టపరిహారం చెల్లించకపోవడంతో బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని, అక్రమ కేసులు పెట్టారని కాంగ్రెస్ నేతలను బనాయించడం సరైనది కాదని టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య దేవా, మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరి ప్రియ కాంగ్రెస్ పార్టీ వారే అక్రమంగా కేసు పెట్టించార ని ఆరోపించడం సరికాదని, అర్థరహితమని వారు అన్నారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, రేగా కాంతారావు గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన వారేనని నేడు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సరికాదని వారు గుర్తు చేశారు. హరిప్రియ, వారికి ఎమ్మెల్యేలుగా కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్షేనని, కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన వారే కాంగ్రెస్ పార్టీని, నాయకులను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అమాయక గిరిజనులను మోసం చేయడంతో తీవ్రంగా నష్టపోయారని, గతంలో కూడా ఎన్నో కేసులు ఉన్నాయని, ప్రభుత్వ భూములను లాక్కున్న దాఖలాలు కూడా ఉన్నాయని, ఐటిడిఏ కలెక్టర్



స్వయంగా ఇచ్చిన పట్టా భూములు కూడా ఆక్రమించుకున్నారని అటువంటి పెద్ద మనిషి మీద కేసులు పెడితే అక్రమమని అనడం సరి అయింది కాదన్నారు. పెద్దమనిషిగా మండలంలో చలామణి అవుతున్న వ్యక్తి మీద రౌడీషీటర్ ఉంటే దానిని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య రద్దు చేపించారని అటువంటి వ్యక్తినీ పట్టుకొని అక్రమంగా కేసులు పెట్టారని బనయించడం సబబు కాదని అన్నారు. రోజుకో పార్టీ పూటకో జెండా మారిన వ్యక్తిని వెనుక వేసుకుని రావడం సరైనది కాదని హితవు పలికారు. నేడు కష్టపడి పండించుకున్న రైతులకు మోసం చేస్తుంటే ఆ పెద్దమనిషిని వెనకేసుకోరాటం విడ్డూరంగా ఉందని అన్నారు. నష్టపోయిన రైతులను పరామర్శించాల్సిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, రైతులను పట్టించుకోకుండా తప్పు చేసిన వారికి కొమ్ము కాయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటికైనా హరిప్రియ నష్టపోయిన రైతులను పరామర్శించి వారికి న్యాయం జరిగేలా బాధ్యత తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, ఇస్లావత్ రెడ్యానాయక్, వాంకుడోతు పుణ్య నాయక్, బండ్ల రజిని, బుర్ర ధర్మయ్య గౌడ్, మోకాళ్ళ పోషాలు, బానోత్ శంకర్, ఈది గణేష్, బానోతు రవి, సర్దార్, బాధిత రైతులు నరేష్, మంగీలాల్, గణేష్ ,హరీ, హనుమ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వశక్తితో స్వయం ఉపాధి పొందాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** మహిళలు స్వశక్తితో స్వయం ఉపాధి పొందవచ్చని ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్ కుమార్ అన్నారు.గురువారం ఉట్కూరు మండలం పెద్ద జట్రం రైతు వేదికలో షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పొందడంపై మహిళలకు మూడు నెలల ఉచిత కొట్టు శిక్షణ కేంద్రాన్ని న్యాక్ డైరెక్టర్ రాజిరెడ్డి తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ నైపుణ్యం రాష్ట్రమంతా ఇస్తున్నట్లు తెలిపారు.ఇంతవరకు 11,000 మంది శిక్షణ పొంది 9,000 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. శిక్షణ కొరకు ఇంతవరకు 120 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. వివిధ రంగాల ద్వారా ఒప్పందం చేసుకుని శిక్షణ ఇస్తామని తెలిపారు.రాష్ట్రంలో 20 శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధిలో అభివృద్ధి సాధించారని తెలిపారు. మహిళలకు నారాయణపేట జిల్లాలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందజేసి అనంతరం ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు. వారు పాఠశాలలు హాస్టల్స్ యూనిఫామ్ కొట్టడానికి కలెక్టర్




ఆధ్వర్యంలో ఆర్డర్లు పొంది పని ప్రారంభించి ఉపాధి పొందవచ్చు అన్నారు. న్యాక్ డైరెక్టర్ రాజిరెడ్డి మాట్లాడుతూ నాక్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 35 మంది మహిళలకు 90 రోజులపాటు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. దేశంలో అనేక సంస్థలు నాక్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకొని ఉద్యోగాలు పొందుతున్నాయని తెలిపారు. జెసిబి ఆపరేటర్ కన్స్ట్రక్షన్స్ సూపర్వైజర్ ల్యాండ్ సర్వే ట్రైనింగ్ ఆడపిల్లలకు స్వయం ఉపాధి రంగం తదితర వాటిపై 20వేల మందికి ఇంతవరకు శిక్షణ ఇచ్చామని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈజీఎం డిఆర్డిఓ లాంటి సంస్థలు వారి సౌజన్యంతో ఇతర ప్రైవేటు సంస్థలు కూడా శిక్షణ తీసుకుని వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ. డి.ఎస్సీ కార్పొరేషన్ అబ్దుల్ కలీల్, డి పి ఆర్ ఓ రషీద్, మండల్ స్పెషల్ ఆఫీసర్ ఉమాపతి,ఎడి నాక్ శివశంకర్, కోఆర్డినేటర్ హాజమ్మ, మాజీ సర్పంచ్ శైలు గౌడ్,అశోక్ బాబు, కథలాప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా ప్రైవేటు పాఠశాలలు..

- కానరాని మౌలిక వసతులు
- అర్హతలేని ఉపాధ్యాయులు
- పస్తాపూర్ కృష్ణవేణి పాఠశాల యాజమాన్యం నిర్వాకం
- ఆందోళనకు దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు





**జహీరాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో గల పస్తాపూర్‌లో గల శ్రీకృష్ణవేణి ఉన్నత ప్రైవేటు పాఠశాల నిబంధనలకు తాము దూరమంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫీజుల వసూళ్లపైనే అధికశ్రద్ధ కనబరుస్తూ ఇటు విద్యార్థులు, అటు తల్లితండ్రులను వేధించే యాజమాన్యాలు కనీస మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించడం లేదు. తమ పిల్లలను శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఎందుకు చదివిస్తున్నామో అని విద్యార్థుల తల్లితండ్రులు ఆవేదన చెందుతున్నారు. గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యజమాన్యంపై తీరుపై ప్రశ్నించారు. పస్తాపూర్‌లోని శ్రీకృష్ణవేణి పాఠశాలలో విద్యార్థుల కు అవసరమైన వసతులు కల్పించడంలో యాజమాన్యం విఫలమయిందని విద్యార్థుల పేరెంట్స్ ఆరోపిస్తున్నారు. కనీసం సరిపడా మూత్రశాలలు కూడా లేవని ఆరోపిస్తున్నారు. మంచినీటి సౌకర్యం కూడా లేకపోవడంతో విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్నట్లు పేరెంట్స్ చెబుతున్నారు.

**కనీస అర్హతలు లేని ఉపాధ్యాయులు..**

తమ పిల్లలని పాఠశాలలో చేర్చుకునే ముందు మా పాఠశాలలో కేరళకు చెందిన నాణ్యమైన ఉపాధ్యాయులు ఉన్నారంటూ ఆశ చూపి విద్యార్థులను పాఠశాలలో చేర్చుకున్నారని. తీరా చూస్తే కనీస విద్యార్హత లేని వారిచే బోధన చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నప్పటికీ ఇంగ్లీషు మాట్లాడడం రావడంలేదని ఆరోపిస్తున్నారు. ఫీసులు ఆలస్యమైతే విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న యజమాన్యం పిల్లలకు చదువు చెప్పడంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని చెబుతున్నారు. పలుమార్లు విద్యాశాఖ అధికారులకు పాఠశాలపై ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు.

**కృష్ణవేణి పాఠశాలపై చర్యలు తీసుకోండి : ఏఐఎస్ఎఫ్**

అర్హత లేని ఉపాధ్యాయులచే బోధిస్తూ ఫీజులు మాత్రం ఏమాత్రం తగ్గకుండా వసూలు చేస్తూన్నారని ఆరోపిస్తూ జహీరాబాద్ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల ముందు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనకు దిగారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న వారికి ఇప్పటికీ తెలుగు, ఇంగ్లీష్ చదవడానికి రావడంలేదన్నారు. అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో పాఠశాల యాజమాన్యం చెలగాటమాడుతుందని మండిపడ్డారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం డిమాండ్ చేశాయి.

# అంతిమ యాత్రపై తేనెటీగల దాడి

- పలువురికి తీవ్ర గాయాలు



**నంగునూర్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** నంగునూరు మండల కేంద్రంలో మృతి చెందిన వ్యక్తి దహన సంస్కారాల కోసం స్మశాన వాటికకు తరలిస్తుండగా మార్గమధ్యంలో తేనెటీగల దాడి చేసిన సంఘటన నంగునూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నంగునూరు మండల కేంద్రానికి చెందిన ముత్యాల రాజయ్య అనారోగ్యంతో మృతి చెందాడని, అతని దహన సంస్కారాల కోసం స్మశాన వాటికకు వెళ్తుండగా స్మశాన వాటిక సమీపంలో తేనెటీగలు ఒక్కసారిగా వారిపై దాడి చేశాయి. ఈ దాడిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించగ పలువురికి తేనెటీగలు ఎక్కువ కుట్టడంతో కాంగ్రెస్ నాయకులు దేవులపల్లి యాదగిరి సిద్దిపేట ఏరియా ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు.

## రేవంత్ సర్కార్ చేపట్టిన బీసీల కులగణన ఓ బూటకం



**జహీరాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ చేపట్టిన బీసీల కుల గణన ఓ బూటకమని, తప్పుల తడకయని, ప్రతి 10 సంవత్సరాల కోసారి దేశవ్యాప్తంగా సగటున13.5 శాతం జనాభా పెరుగుతుంటే రాష్ట్ర సర్కారు మాత్రం అస్పష్టంగా కులగణన చేపట్టిందని రాష్ట టిఎస్-ఎస్ సిసి డిసి మాజీ చైర్మన్ బిఆర్ఎస్ నేత వై.నరోత్తం ప్రభుత్వ తీరుపై విమర్శించారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం కేసిఆర్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా 3.60 కోట్ల జనాభాలో 51శాతం బీసీలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. 10 సంవత్సరాల అనంతరం 2024 డిసెంబర్ మాసంలో రేవంత్ రెడ్డి సర్కార్ చేపట్టిన బీసీల కులగణనలో 3.70 కోట్ల జనాభాలో బీసీలు 46.25 ఉన్నట్లు గుర్తించారు. పది సంవత్సరాల అనంతరం సగటున జనాభా 13.5 శాతం పెరుగుతే ఆ లెక్కన నాలుగు కోట్లకు పైగా జనాభా ఉండి తీరాలి. ప్రభుత్వం చేపట్టిన సర్వే పూర్తిగా అసంపూర్తిగా, తప్పుల తడకగా మారిందని విమర్శించారు. బీసీ డిక్లరేషన్ తో అధికారంలో వచ్చిన సర్కార్ బీసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జి నర్సింలు, బి. విట్టల్, ధర్మ పవార్, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఇంటలిజెన్స్ అధికారులు



**ఖమ్మం, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాంతీయ ఇంటెలిజెన్స్ అధికారి రామోజీ రమేష్, గురువారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ డిఎస్పీ యు. వెంకన్న బాబు, ఇన్స్పెక్టర్లు సిహెచ్. శ్రీనివాసరావు, ప్రసాద రావు, ఏఎస్సై శ్రీనివాసరావులు ఉన్నారు.

## భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తహసిల్దార్, ఎంపీడీవోలతో మాట్లాడుతూ మండలంలోనీ ప్రజలు భూ సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం సూచించాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ అందేలా చూడాలని, అధికారులందరూ సకాలంలో ఆఫీసులో అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు అన్నింటిని పరిష్కరించాలని సూచించారు. రెవిన్యూ అంశాలకు సంబంధించిన అన్ని పనులను ప్రజలకు వేగంగా, సమర్థంగా అందించాలనీ, ప్రజల అవసరాలకు సరైన ప్రతిస్పందన ఇవ్వాలనీ కలెక్టర్ సూచించారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్ని అర్హులైన వ్యక్తులకు చేరవేయడం కూడా చాలా ముఖ్యమని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందడానికి అధికారులు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# విద్యార్థులు వైజ్ఞానిక ఆలోచనను అలవర్చుకోవాలి

- విజ్ఞానదర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్



**మద్దూరు, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** భావిభారత పౌరులైన విద్యార్థులు వైజ్ఞానిక ఆలోచనను అలవర్చుకోవాలని, నిజజీవితంలో వినియోగించాలని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ అన్నారు. విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో సైన్స్ మహోత్సవం పేరుతో తెలంగాణలోని పలు జిల్లాలలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా మద్దూర్ మండలం పేదిరిపాడ్ గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులను ఉద్యేశించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న సమాజంలో సైన్స్ ఎంత అభివృద్ధి చెందుతుందో అంతే స్థాయిలో ప్రజలలో మూఢనమ్మకాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ఈ మూఢనమ్మకాలు పేద ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిలో పెరుగుతుండటం విచారకరమన్నారు. ఈ దయ్యాలు, భూతాలు కూడా పేదలకే పడతాయి తప్ప డబ్బున్న వారికి పట్టవని అన్నారు. ప్రభావం మహిళలపై అధికంగా ఉందని వాటిని నిర్మూలించడమే విజ్ఞాన దర్శని ప్రధాన లక్ష్యమన్నారు. ఆ దిశగానే నేడు విజ్ఞాన దర్శని అడుగులు వేస్తుందని తెలిపారు. అయితే ఫిబ్రవరి సైన్స్ రంగానికి చాలా ప్రాముఖ్యత కలిగిన నెల అన్నారు. ఈ నెలలోనే జాతీయ సైన్స్ దినోత్సవం ఫిబ్రవరి 28న ఉందన్నారు. మద్దూర్ మండల విద్య అధికారి బలకిష్టప్ప, రిటైడ్ ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, కస్తూరి బాలికల పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాటి కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని వారి బృందం పాఠశాలలో, గ్రామాలలో ఏర్పాటు చేసి విద్యార్థులకు, యువత, ప్రజలకు సైన్స్ పట్లా అవగాహన కల్పించడంలో చాలా గొప్ప విషయం అన్నారు. ఇలాంటి అంశాలు ఎవరు సహజంగా చెప్పరు కానీ, విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ ఎన్నో సంవత్సరాలుగా ఉభయ రాష్ట్రాలలో తిరుగుతూ అనేక మందిని చైతన్య పరుస్తూ నిరంతరం ఇదే పనిగా చేయడం ఈరోజు మా పాఠశాలకు మా గ్రామానికి రావడం చాలా ఆనందకరం అని అన్నారు. తదనంతరం విజ్ఞాన దర్శిని బృందం మంటలు మింగడం, ఒంటికి మంటలు, రాసుకోవడం గాలిలో దయ్యం, గాజు పెంకులపై నడక ఇలా అనేకమైనటువంటి మిరాకిల్ ఎక్స్పోజర్‌ని విద్యార్థులకు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శని రాష్ట్ర నాయకులు శోభారాణి, మహమ్మద్ అలీ, పద్మ, విష్ణు, వర్ధన్, కనకప్ప, స్థానిక గ్రామ నాయకులు భరత్ కుమార్, అశోక్, డి శ్రీనివాస్, ఎల్లప్ప, సి అంజి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల భద్రత, పోషణ, ఆరోగ్య, విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి సమావేశం హాల్ నందు భద్రత, పోషణ, సాధికారత, ఆరోగ్య శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ మహిళలను బలోపేతం చేయడం ద్వారా పిల్లల సమస్యలను సమర్థంగా పరిష్కరించవచ్చని అన్నారు.బాల్య వివాహాల నిరోధం అత్యంత ముఖ్యమని,18 సంవత్సరాలు నిండే వరకు ఆడపిల్లలు, 21 సంవత్సరాలు నిండే వరకు మగపిల్లలు వివాహం చేసుకోవద్దనే అవగాహన తల్లిదండ్రులకు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా గట్టు,కె.టి.దొడ్డి మండలాల్లో ఈ అవగాహన కార్యక్రమాలను మరింత బలపర్చాలని ఆదేశించారు.15 నుండి 18 ఏళ్ల వయస్సు కీలకమైన దశ కావడంతో, ఈ దశలో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు.10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు మధ్యలో విద్యాభ్యాసం మానేసిన విద్యార్థులు తిరిగి పాఠశాలలు, కళాశాలలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్తహీనత (అనీమియా) నివారణ కోసం గ్రామీణ స్థాయిలో రక్తపరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు సరైన పోషణ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ మహిళా సంఘాలు ప్రభుత్వ అనుకూల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూనిఫామ్ కుట్టడం వంటి స్వయం ఉపాధి కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని, గ్రామ స్థాయిలో సక్రమంగా పని చేయాలని, ఉత్సాహంతో చురుకుగా పాల్గొని సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,యూనిసెఫ్ స్టేట్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, ఏపీడి నరసింహులు, గ్రామ సంఘాల ప్రతినిధులు,సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌లో అఖిలపక్షం బంద్ విజయవంతం

- డంప్ యార్డు నిర్మాణాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి
- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**నర్సాపూర్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** నర్సాపూర్ పట్టణంలో అఖిల పక్షం బంద్ విజయవంతమైంది, గురువారం బిఆర్ఎస్, బిజెపి, సిపిఎం, సిపిఐ, బిఎస్పి పార్టీల ఆధ్వర్యంలో ప్యారా నగర్ లో డంప్ యాడ్ కు వ్యతిరేకంగా నర్సాపూర్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు,ఈ సందర్భంగా పట్టణంలోని వ్యాపార,వాణిజ్య పాఠశాలలు,విద్యాసంస్థలు, హెూటల్స్ స్వచ్ఛందంగా మూసివేశారు,అలాగే అఖిలపక్షం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ రాస్తారోకో నిర్వహించారు,ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ప్యారా నగర్ లో నిర్మిస్తున్న డంప్ యాడ్ నిర్మాణాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు,పచ్చని అడవి మధ్యలో డంప్ యాడ్ నిర్మించడం వల్ల పర్యావరణనికి పెద్ద నష్టం జరుగుతుందని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు,ఈ కార్యక్రమంలోబిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేశం గౌడ్, బిఆర్ఎస్ నాయకులు అశోక్ గౌడ్,సింగయ్యపల్లి గోపి,ఎండి నయీముద్దీన్,సిపిఐ జిల్లా కార్యదర్శి టీఎం కాలేజ్, సిపిఎం జిల్లా నాయకులు నాగరాజు, లోక్ సత్తా పార్టీ నాయకులు మిరియాల చంద్రశేఖర్,బీజేపీ నాయకులు పాప గారి రమేష్ గౌడ్,గోడ రాజేందర్, సంఘసాని సురేష్, ఆంజనేయులు గౌడ్, బిఆర్ఎస్ పంబాల బిక్షపతి,బాల్ రెడ్డి, రమణారావు,సత్యం గౌడ్, జ్ఞానేశ్వర్, రాకేష్,జాన్ రత్నం,నాయకులు వేణుగోపాల్, కొత్త శీను,నరేందర్,శ్రీకాంత్ ఫైజాన్,సైఫ్ అలీ,ఆంజనేయులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నల జీవితాల్లో వెలుగు నింపడానికె ప్రభుత్వ పథకాలు

- చేనేత చైర్మన్ వర్కల అశోక్



**జోగిపేట, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపడానికె కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం అభయహస్తం, నేతన్న పొదుపు నేతన్న భద్రత నేతన్న భరోసా లాంటి పథకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టిందన. జోగిపేట చేనేత సహకార సంఘం చైర్మన్ వర్కల అశోక్ అన్నారు. జోగిపేట చేనేత సహకార సంఘంలో ఈ కార్యక్రమం జరిగింది దీనికి సంబంధించిన మార్గదర్శకాలను జౌలీ శాఖ ఏడి వెంకట్రావు కార్మికులకు వివరించారు, నేతన్న పొదుపు పథకంలో చేరుటకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే చేనేత కార్మికులకు జియో ట్యాగ్ నెంబర్ లు ఇవ్వాలని చైర్మన్ అశోక్ ఏడి వెంకట్రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట చేనేత సహకార సంఘం చైర్మన్ వర్కాల అశోక్ జౌళి శాఖ ఏడి వెంకట్రావు, అధికారులు శ్రీమతి లలిత, ఉన్ని సహకార సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, రాజేందర్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్

**అచ్చంపేట, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** సమాచార హక్కు చట్టం పై అందరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులకు ఉండాలని గంగాపురం రాజేందర్ అన్నారు. పట్టణంలో సమాచార హక్కు చట్టం రక్షణ సమితి అధ్యక్షులు సభ్యులు కలిసి ఇటీవల నాగర్ కర్నూల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సమాచార హక్కు చట్టం రక్షణ సమితి న్యాయవాది గంగాపురం రాజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కొరకు ఏర్పాటు చేయబడిన వ్యవస్థను జవాబు దారితనంతో అవినీతి రహితంగా పని చేయాలంటే ప్రజలు తమ బాధ్యతను సక్రమంగా పోషించాలని అని ఆయన కోరారు.ప్రజాస్వామ్యం సక్రమంగా అమలవుతుందని ప్రజలందరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించి వారిని చైతన్య పరిచి సహ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని సభ్యులను కోరారు. కొన్ని ప్రభుత్వాలు ఈ సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి అజీజ్ కోశాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులను మించిన జీవనశైలి వ్యాధులు

- వీటి నివారణకు ప్రో హెల్త్ సర్వీస్‌తో ముందడుగు
- అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి
- అపోలో హాస్పిటల్స్ ఎల్సాకాన్ 2025



**హైదరాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** జీవనశైలితో వచ్చే వ్యాధులు అంటువ్యాధులను మించిపోయాయని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి తెలిపారు. అపోలో హాస్పిటల్స్, ఈసీఎంఓ సొసైటీ ఆఫ్ ఇండియా, సొసైటీ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ తో కలిసి హైదరాబాద్ మాదాపూర్ లోని హెూటల్ వెస్టిన్ లో రెండు రోజుల పాటు అత్యాధునిక క్రిటికల్ సర్వీస్, ఈసీఎంఓ (ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజినేషన్) పై శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవనశైలిలో వచ్చే వ్యాధులను త్వరగా గుర్తించగలిగితే నివారించవచ్చన్నారు. ప్రో హెల్త్ సర్వీస్ అనేది ఈ రోగాలు తీవ్రమయ్యే ముందే గుర్తించడానికి అపోలో హాస్పిటల్ తీసుకున్న ముఖ్యమైన ముందడుగు అన్నారు. అపోలో హాస్పిటల్ అందరికీ ప్రపంచ స్థాయి వైద్యం అందించడానికి కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ (జూబ్లీ హిల్స్) క్రిటికల్ కేర్ మెడిసిన్, అసోసియేట్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ హెచ్‌ఓడీ డాక్టర్ కే సుబ్బా రెడ్డి మాట్లాడుతూ అపోలో హాస్పిటల్స్‌లోని ఈసీఎంఓ సేవల ఫలితాలు విశేషంగా మెరుగుపడ్డాయన్నారు. ఇటీవల జరిగిన జేసీఐ (జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్) అంచనాలో ప్రశంసలు దక్కాయన్నారు. అపోలో హాస్పిటల్స్ ఎల్సాకాన్ 2025లో దేశ, విదేశాల నుంచి వందకు పైగా ఈసీఎంఓ నిపుణులు ఈ శిక్షణా సమావేశానికి హాజరయ్యారు. దేశం నలుమూలల నుంచి మూడు వందల మంది వైద్య విద్యార్థులు శిక్షణ తీసుకున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ పొందారు.

# మహిళలకు అండగా భరోసా కేంద్రం

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** సమాజంలో వేధింపులకు గురైన అమ్మాయిలు, మహిళలు న్యాయం కొరకు ఎక్కడికి వెళ్ళాలి ఎవరిని సంప్రదించాలి అనే సందిగ్ధం లేకుండా భరోసా కేంద్రం అండగా ఉంటుందని జిల్లా కలక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.వనపర్తి జిల్లాలో భరోసా కేంద్రం ఏర్పాటు చేసి సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా గురువారం ఉదయం పట్టణంలోని ఆర్టీసీ కాలనిలో ఉన్న భరోసా కేంద్రంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి భరోసా కేంద్రంలో కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ తెలిసి తెలియని వయసులో ఉన్న అమ్మాయిలు కావచ్చు మహిళలు కావచ్చు సమాజంలో లైంగిక వేదింపులు లేదా బాల్య వివాహాలు, గృహ హింసకు గురి అయితే భరోసా 1098 లేదా సమీప పోలీస్ స్టేషన్, 100 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అన్యాయానికి గురైన వారి వివరాలు గోప్యంగా ఉంచుతూ సత్వర న్యాయం, ఆర్థిక, విద్యా సహకారాలు అందించేందుకు భరోసా కేంద్రం పనిచేస్తుందన్నారు. భరోసా కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలు ఉంటారని, పోలీస్ శాఖ, న్యాయ



శాఖ, స్త్రీ శిశు సంక్షేమ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి బాధితులకు న్యాయం చేకూర్చడం జరుగుతుందన్నారు. భరోసా ఏర్పాటు చేసిన తర్వాత 43 కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయడం జరిగిందన్నారు. 2024 సంవత్సరంలో జిల్లాలో 11 బాల్య వివాహాల కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బాల్య వివాహం చేయడం చట్ట విరుద్ధమని, ఎవరైనా బాల్య వివాహం చేసేందుకు ప్రయత్నం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యక్షంగా లేక పరోక్షంగా బాల్య వివాహంలో భాగస్వాములైన వారిని సైతం ఉపేక్షించబోమని చెప్పారు.సంవత్సర కాలంలో అమ్మాయిలు, మహిళలకు అండగా ఉండి మంచి భరోసా కల్పించినందుకు భరోసా కేంద్రం సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ బాధిత అమ్మాయిలకు, మహిళలకు వైద్య పరంగా, న్యాయ సేవా పరంగా, విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ నుంచి కొంత ఆర్థిక సహాయం చేస్తూ భరోసా కేంద్రం అండగా నిలుస్తుందని కొనియాడారు. సంవత్సర కాలములో మంచి ఫలితాలు సాధించినందుకు సిబ్బందిని అభినందించారు. బాధిత అమ్మాయిలు, మహిళలకు అండగా ఉంటూ వారిలో నమ్మకాన్ని కల్పించి తిరిగి తన దైనందిన జీవన శైలిలో జీవించే విధంగా భరోసా కేంద్రం పనిచేస్తుందన్నారు. అంతే కాకుండా భరోసా కేంద్రం సిబ్బంది విద్యాలయాలకు వెళ్లి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అమ్మాయిలకు అవగాహన కల్పించడం, బాధితులు మానసిక క్షోభకు గురి కాకుండా ధైర్యంగా ముందుకు వచ్చి కేసులు పెట్టే విధంగా వారికి ధైర్యాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. మంచి సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు .అనంతరం విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ నుంచి అయిదు మంది బాధితులకు 36 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, డిఎస్పీ వేంకటేశ్వర రావు, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, భరోసా కోఆర్డినేటర్ శిరీష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

- కుటుంబానికి రక్షణ కల్పించండి
- బాధితులను పరామర్శించి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యాన్ని నింపిన..
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** ఇటీవల హత్యగావించబడిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్,సభ్యులు బంటి ఇంటికి వెళ్ళి బంటి భార్య బార్గవి, తండ్రి భిక్షం, అక్కబావలను పరామర్శించి మనో ధైర్యం కల్పించారు.బంటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం జిల్లా కలెక్టరెట్ కు వెళ్ళి బంటి హత్య కేసు పురొగతిపై చర్చించారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని, భాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చూడాలని అన్నారు.కేసు వెనక్కి తీసుకుంటే రెండు కోట్ల రూపాయలు ఇస్తామని లేకపోతే చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితులు కమిషన్ చైర్మన్‌కి చెప్పగా హత్యలో పాల్గొన్న నిందితులను, బెదిరింపులకు పాల్పడుతున్న దుండగులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని ఆదెశించారు. ఇప్పటి వరకు ఆరుగురు నిందితులను అరెస్టు చేశామని, మిగతా వారిని సైతం అరెస్టు చేస్తామని అదనపు ఎస్పీ, డిఎస్పి వివరించారు. బాధిత కుటుంబానికి నాలుగు లక్షల నష్టపరిహారం చెల్లించామని వివరించారు. కుటుంబాన్ని పూర్తి స్థాయిలో ఆదుకోవాలని, చట్టం ప్రకారం నిత్యావసర సరుకులు, తక్షణ సహాయం అందజేయాలని,పెన్షన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని,అయిదు ఎకరాల భూపంపిణీ చెయాలని, ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా డివియంసి సమావేశం జరపాలని, ప్రతి నెల చివరన పౌర హక్కుల దినోత్సవం జరపాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు, ఆర్డిఓ వేణు మాధవ్, ఎస్సీ సంక్షేమ అధికారి లత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెల్కలపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించాలి

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



**సిద్దిపేట బ్యూరో, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** చిన్న కోడూరు మండలం చెల్కల పల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించాలని వారికి ప్రత్యేక పునరావస కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్యాకేజ్ ఇవ్వాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ వ్రాసారు.సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూర్ మండలం లోని చెల్కల పల్లి గ్రామ పరిధిలో చుట్టూ కాళేశ్వరం లో భాగంగా అన్నపూర్ణ అంతగిరి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడం జరిగింది ఈ చెల్కలపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించి నిర్వాసితులకు ఇచ్చే ప్యాకెజ్ మరియు ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణం చేపట్టాలని హరీష్ రావు ఉత్తమ్ కుమార్ రెడ్డి కి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.. గత 17 రోజులుగా నిరాహార దీక్ష ధర్నా చేస్తున్నారని వెంటనే ప్రభుత్వం చొరవ చూపి గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించి చెల్కపల్లి గ్రామస్తులను ఆదుకోవాలని కోరారు. గతం లోనే ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కి జిల్లా కలెక్టర్ లేఖ వ్రాసారని ఈ సందర్భంగా ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డితో హరీష్ రావు ఫోన్ లో మాట్లాడి విషయాన్ని ద్రుష్టికి తీసుకెళ్లారు.

## ఫార్మసిస్టులు లేకుండా మందుల విక్రయం

**గద్వాల్ రూరల్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణంలో ఏర్పాటు చేసిన జీవనాధార మెడికల్ షాపులో మందులు అధిక రేట్లకు అమ్ముతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హత లేని వారు విధులు నిర్వహిస్తూ ఫార్మసిస్టులమని రోగులకు మందులు ఇస్తున్న దృశ్యం కనిపించింది. ఈ విషయం పై చరవాణి ద్వారా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ను సమాచారం కోసం సంప్రదించగా అందుబాటులో లేకపోవడం గమనార్హం ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ మందుల దుకాణాన్ని సందర్శించి లైసెన్స్ దారుడుపై ఉన్నత అధికారులు చర్య తీసుకోవాల్సిందిగా జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# నకిలీ విత్తన కంపెనీల నుండి రైతులను కాపాడుకోవాలి


- అధికారులు రైతు మేలు కోరాలి
- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి
- నకిలీ విత్తనాలతో మోసపోయిన బాధితుల పొలాల పరిశీలన

**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** నకిలీ విత్తన కంపెనీల నుండి రైతులను కాపాడుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు.గురువారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన పెన్ పహాడ్ మండలం పొట్లపహాడ్ గ్రామ రైతులు పొలాలను సందర్శించారు.ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని వెంకటసాయి సీడ్స్ వారి నుండి కొనుగోలు చేసిన సిరి 101, కావేరి సింట్లు అనే రకానికి చెందిన వరి విత్తనాలు నాటు పెట్టిన 40 రోజులకే ఈనటం మొదలు అయిందని, ఇట్టి విషయం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ దృష్టికి రావటంతో వరి నాటు పెట్టిన 75 రోజుల తర్వాతనే ఈనటం మొదలు అవుతుంది కానీ 40 రోజులకే ఈనటం ఏంటి అని తెలుసుకెనేందుకే వ్యవసాయ కమిషన్ సభ్యులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించామని తెలిపారు.భాధిత రైతులు సంబంధిత కంపెనీ వారితో మాట్లాడగా వాతావరణం వల్ల ఇలా జరిగిందని అంటున్నారని తెలిపారని అన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల వరికి తెగుళ్లు వస్తాయి కానీ నాటిన 40 రోజులకే ఈనదని అవి నకిలీ విత్తనాల వల్లే ఈ సమస్య వచ్చిందని, అట్టి విత్తనాలు మెరుగైన సర్టిఫైడ్ విత్తనం కాదని, నకిలీ విత్తనం అని నిర్ధారణ అయిందని తెలిపారు.నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోయారని ఇట్టి విషయాన్నీ నివేదిక రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.ఇప్పటికైనా కంపెనీలు వ్యాపారం దృష్ట్యా ఆలోచించకుండా రైతు నష్టపోకుండా రైతు బాగు కోరి విత్తనాలు తయారు చేయాలని సూచించారు.అనంతరం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ డీలర్ షిప్ అనుమతి,సర్టిపికెట్ ఉన్న విత్తన కంపెనీలు మాత్రమే విత్తనాలు అమ్మేలా చూడాలని అన్నారు. జిల్లాలో ఎన్ని ఎకరాలలో వరి, ఇతర పంటలు సాగు చేశారని




అధికారులను అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనుమతి ఉన్న డీలర్ల్, సర్టిపికెట్ ఉన్న విత్తనాల శాంపిల్స్ సేకరించి పరిశీలన చేసిన తర్వాతనే రైతులకి విత్తనాలు విక్రయించేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, సునీల్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, భవాని, జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ సాయి గౌడ్, వ్యవసాయ శాఖ పరిపాలన అధికారి ఆశా కుమారి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



**హుస్నాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారులలో రోడ్డుకు ఇరువైపులా నిబంధనలు అతిక్రమించి ఏర్పాటు చేసుకున్న బోర్డులను, చిరు వ్యాపారుల బండ్లను మున్సిపల్ అధికారులు తొలగించారు. ప్రధాన రహదారుల్లో ఇరువైపులా సర్కిల్ లైన్ వేసి సర్కిల్ లైన్ లోపలే దుకాణాల బోర్డులు, ఇతరాత్రా సామాగ్రి, వాహనాల పార్కింగ్ చేసుకోవాలని దుకాణాదారులకు, వీధి వ్యాపారులకు సూచించారు. రోడ్డుకు ఇరువైపులా నిబంధనలు అతిక్రమించి ఏర్పాటు చేసుకున్న బోర్డులు చిరు వ్యాపారాల సముదాయాలతో వాహనాల పార్కింగ్ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. యజమానులు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారి దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు జరిమాణాలు విధించడం జరుగుతుందన్నారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా దుకాణ యజమానులు వ్యవహరించాలని, లేకుంటే వారిపై చట్టరిత్య చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ ఎస్సై మహేష్ హెచ్చరించారు.

## తాజా మాజీ కౌన్సిలర్లపై సస్పెన్షన్ ఎత్తివేత

**వనపర్తి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ తాజా మాజీ కౌన్సిలర్స్ సమద్, శాంతి రమేష్ నాయక్ పైన ఉన్న సస్పెన్షన్ ను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశం మేరకు ఎత్తివేయడం జరిగిందని పట్టణ పార్టీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. వారు పార్టీ కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొంటూ సంస్థాగత పటిష్టత కోసం పని చేస్తున్నారని రమేష్ గౌడ్ తెలిపారు.

## హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన



**హుస్నాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** వరంగల్‌లో న్యాయవాదిపై దాడి చేసిన పోలీసుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన చేపట్టారు. గడిచిన కొన్ని రోజులుగా రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీసులు తరచుగా దాడులకు పాల్పడుతున్నారని న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న పోలీసులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకువచ్చి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా విధులను బహిష్కరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

## హెూటళ్లు, పబ్బుల యజమానులు భద్రతా ప్రమాణాలను పాటించాలి

- మాదాపూర్ డిసిపి డాక్టర్ జి. వినీత్




**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మాదాపూర్ జోన్ పరిధిలో నెలకొని ఉన్న వివిధ హెూటల్స్, పబ్బులు, ఈవెంట్ ఆర్గనైజర్స్ తప్పకుండా భద్రతాపరమైన ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం కారణం చేతనైనా అనుకోని ప్రమాదాలు చోటు చేసుకోవడం, అలసత్వం కనిపిస్తే ఉపేక్షించేది లేదని మాదాపూర్ డిసిపి డాక్టర్ జి. వినీత్ స్పష్టం చేశారు. ఈ మేరకు మాదాపూర్ జోన్ పరిధి హెూటల్, పబ్బులు, ఈవెంట్ ఆర్గనైజర్లతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డిసిపి మాట్లాడుతూ ప్రైవేటు హెూటళ్లు, పబ్బుల యజమానులు, వాటిని నిర్వహించే మేనేజర్లు, ఈవెంట్ ఆర్గనైజర్లు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరిస్తూ సరైన భద్రతా ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా హెూటళ్లకు, పబ్బులకు, వివిధ ఈవెంట్లకు అపరిచిత వ్యక్తులు హాజరవుతూ నేరాలకు పాల్పడుతుండడంతోపాటు ఆత్మహత్యలకు సైతం పూనుకుంటుండడం ఆలోచించాల్సిన విషయం అన్నారు. ఈ మధ్యకాలంలో అనేక సంఘటనలలో భద్రతాపరమైన సమస్యలు కూడా తలెత్తుతున్నాయని అందువల్ల ఆయా యాజమాన్యాలు తమ హాస్టళ్లు, హెూటల్స్, ఈవెంట్ల నిర్వహణ విషయంలో తప్పకుండా భద్రతా ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం సెక్యూరిటీ పరంగా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా తప్పనిసరిగా ప్రతి హెూటల్ భవనం, పబ్బుల చుట్టూ సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఆయా ప్రదేశాలకు విచ్చేస్తున్న వారి వద్దనుండి సమగ్రమైన సమాచారాన్ని సేకరించి పెట్టుకోవాలని, వారి అడ్రస్ ప్రూఫ్ లు, ఆధార్ కార్డు తదితర ధ్రువపత్రాల సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆవరణలో సైతం స్వచ్ఛతను పాటించాలని ఆదేశించారు. తరచుగా తనిఖీలు నిర్వహించి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని డిసిపి ఆయా యాజమాన్యాలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడిసిపి, మాదాపూర్ ఏసిపి, మాదాపూర్, ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్ల విధుల్లో నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలు

- ఐసిడిఎస్ సూపర్వైజర్లు సిడిపిఓలతో సమీక్ష
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి

**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** అంగన్వాడి సూపర్వైజర్లు, సిడిపివోలు, టీచర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సిడిపివోలు అంగన్వాడీ సూపర్వైజర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ భవనాల నిర్మాణం, టాయిలెట్స్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. టాయిలెట్స్ కు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో మిషన్ భగీరథ త్రాగునీరు ఇబ్బందులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. కరెంట్ మీటర్ల కనెక్షన్లు ఏర్పాటుకై ఎంపీడీవోలు పంచాయతీ సెక్రటరీతో సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలని సిడిపిఓలకు సూపర్వైజర్లకు సూచించారు. అంగన్వాడి సూపర్వైజర్లు సిడిపిఓలు ప్రతిరోజు విధిగా తమ




పరిధిలోని అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు జిల్లాలో అంగన్వాడీ సూపర్వైజర్లు సిడిపివోలు తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇకమీదట అలాంటి సంఘటనలు పునరావృతం అయితే చర్యలు తప్పవని అన్నారు నారాయణఖేడ్ మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో జరిగిన సంఘటన జిల్లాలో మరి ఎక్కడ జరగకుండా అధికారులు అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు . శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలను సురక్షితమైన భవనాలకు తరలించాలన్నారు. అంగన్వాడి సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని అంగన్వాడీ సిబ్బంది ఏఎన్ఎం, ఆశా వర్కర్లు కలిసి గ్రామంలో నిర్వహించాల్సిన సమావేశాలు, విధులను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఎవరికి అప్పగించని బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో బాలింతలు గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు సరైన పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పోషణ అభియాన్ టీములను ఆదేశించారు.అంగన్వాడి కేంద్రాల్లో నిర్ణీత సమయానికి, క్రమం తప్పకుండా తల్లిదండ్రులు సమావేశాలు నిర్వహించాలని ఈ సమావేశాలకు సూపర్వైజర్లు, సిడిపిఓ స్థాయి అధికారులు క్రమం తప్పకుండా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐసిడిఎస్ సిబ్బంది వారి విధులను బాధ్యతలను తప్పకుండా నిర్వర్తించాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి లలిత కుమారి, జెడ్పి సీఈవో జానకి రెడ్డి, డిపిఓ సాయి బాబా, ఈఈ పి ఆర్ జగదీష్, మిషన్ భగీరథ ఈఈ పాష, సంబంధిత శాఖల అధికారులు, జిల్లాలోని సిడిపివోలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఖరీఫ్ 20245 పంటకు సంబంధించి సీఎంఆర్ డెలివరీని వెంటనే పూర్తి చేయాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్ 2024-25 పంటకు సంబంధించిన సిఎంఆర్ డెలివరీని వెంటనే పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ,కంజ్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్ అండ్ కమిషనర్ ఆఫ్ సివిల్ సప్లైస్ డి.ఎస్.చౌహాన్, అధికారులకు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో సి ఎం ఆర్ డెలివరీ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇట్టి వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, డిఎస్ఓ స్వామి కుమార్, జిల్లా మేనేజర్ విమల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ 2024-25 కు సంబంధించి, సి.ఎం.ఆర్ రైస్ డెలివరీలను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లులో నిలువ ఉంచిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఖరీఫ్ 2024-25 పంటకు సంబంధించి ఇప్పటివరకు ఇవ్వని బ్యాంకు గ్యారెంటీ లను బ్యాంకు మేనేజర్ లతో మాట్లాడి త్వరగా తెప్పించుకోవాలన్నారు. క్వాలిటీ గల సన్న బియ్యాన్ని సమర్థవంతంగా డెలివరీ చేయించుకోవాలని సూచించారు. రబీ 2024-25 పంటకు సంబంధించి, అవసరమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్, ప్యాడీ క్లీనర్లు, గన్నీ బ్యాగులు వంటి ప్రాథమిక వనరులను ముందుగానే సమకూర్చుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# అదరగొట్టిన ఎస్బీఐ..
# భారీగా పెరిగిన లాభాలు..

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్యూ3 ఫలితాల్ని ప్రకటించింది. నికర లాభం ఏకంగా 84 శాతానికిపైగా పెరిగింది. ఆదాయం కూడా పెరిగింది. అయితే ఇదే సమయంలో ఎస్బీఐ మంచి ఫలితాలు నమోదు చేసినప్పటికీ.. స్టాక్ ధర మాత్రం పడిపోయింది. గత కొద్ది రోజులుగా కూడా ఈ షేర్ ధర పతనమైంది.

దేశంలోని దిగ్గజ కంపెనీలు వరుసగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికం ఫలితాల్ని ప్రకటిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. తొలుత టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ కంపెనీలు ఫలితాల్ని వెల్లడించగా.. తర్వాత బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు




కూడా ఫలితాల్ని వెల్లడించాయి. తాజాగా దేశంలోని ప్రభుత్వ రంగానికి చెందిన అతిపెద్ద బ్యాంక్.. ఎస్బీఐ కూడా అక్టోబర్- డిసెంబర్ క్వార్టర్ ఫలితాల్ని విడుదల చేసింది. క్యూ3లో ఈ బ్యాంకు నికర లాభం ఏకంగా 84.32 శాతం పెరిగి రూ. 16,891 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఈ సమయంలో లాభం కేవలం రూ. 9,164 కోట్లుగానే ఉండేది. దీంతో ఈసారి భారీగా పెరిగిందని చెప్పొచ్చు. ఈ లాభం.. అంచనాల్ని మించింది.

ఇక సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 4 శాతం పెరిగి రూ. 41,446 కోట్లుగా వచ్చింది. ఏడాది కిందట ఇదే సమయంలో వడ్డీ ఆదాయం రూ. 39,816 కోట్లుగా ఉంది. మరోవైపు టాక్స్ తర్వాత లాభం రూ. 16,891 కోట్లుగా వచ్చింది. ఇక్కడ అంచనాల్ని తప్పినట్లు తెలుస్తోంది. ఇక బ్యాంకు.. ఉద్యోగులపై వెచ్చించే ఖర్చులు 17 శాతం తగ్గి రూ. 16,074 కోట్లకు చేరింది. ఎస్బీఐ డొమెస్టిక్ లోన్స్ 14.06 శాతం మేర పెరిగాయి. ఏడాది కిందటి నుంచి పోలిస్తే ఇలా ఉండగా.. కిందటి త్రైమాసికం అంటే జులై- సెప్టెంబర్ త్రైమాసికం ఫలితాలతో చూస్తే లాభం 8 శాతం తగ్గడం గమనార్హం. ఇక సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం 10 శాతం పెరిగి రూ. 1.17 లక్షల కోట్లుగా ఉంది.

ఎస్బీఐ ఈ సమయంలో మంచి ఫలితాలే నమోదు చేసినప్పటికీ.. మరోవైపు స్టాక్ నెగెటివ్‌లో ట్రేడవుతోంది. కిందటి సెషన్లో రూ. 766.05 వద్ద ముగిసిన స్టాక్.. ఇవాళ ఆరంభంలో స్వల్ప లాభాల్లోనే ట్రేడయినప్పటికీ తర్వాత మార్కెట్లు నష్టపోతున్న క్రమంలో.. మరోవైపు ఫలితాల నేపథ్యంలో ఈ స్టాక్ పడిపోతూ వచ్చింది. ప్రస్తుతం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎస్బీఐ షేర్ ధర 1.75 శాతం నష్టంతో రూ. 752.65 వద్ద ఉంది. ఇంట్రాడేలో రూ. 751.05 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ఇక స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 912 గా ఉంది. బ్యాంక్ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 6.72 లక్షల కోట్లుగా ఉంది. ఈ బ్యాంక్ స్టాక్.. గత5 రోజులు, నెల, 6 నెలల సమయంలో చూస్తే ప్రతికూల ఫలితాల్నే అందిస్తోంది. ఏడాదిలో మాత్రం 15 శాతం పెరగ్గా.. ఐదేళ్లలో చూస్తే 130 శాతానికిపైగా పుంజుకుంది.



# బడ్జెట్ తర్వాత కూడా..
## సుకన్య వంటి పథకాల్లో పెట్టుబడి పెట్టాలా?

2025: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2025లో ఆదాయపు పన్నులకు సంబంధించి సంచలన నిర్ణయం తీసుకుంది. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించింది. దీంతో కొత్త పన్ను విధానంలోకి మారతారు. యూనియన్ బడ్జెట్ 2025లో కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చారు. రూ.12 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించారు. ఈ నిర్ణయం మరింత మంది ట్యాక్స్ పేయర్లు పాత పన్ను విధానం నుంచి కొత్త పన్ను విధానంలోకి మారేందుకు ప్రోత్సహిస్తుంది. అయితే, పాత పన్ను విధానంలో ఉంటే వివిధ పన్ను మినహాయింపులు, డిడక్షన్లు కొత్త విధానంలో ఉండవు. అయినప్పటికీ రూ.12 లక్షల వరకు రిబేట్, స్టాండర్డ్ డిడక్షన్ కల్పించడం గమనార్హం. దీంతో 97 శాతం మంది ట్యాక్స్ పేయర్లు కొత్త విధానంలోకి మారే అవకాశం ఉందని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఛైర్మన్ ఇటీవలే వెల్లడించారు. సాధారణంగా సెక్షన్ 80సీ ద్వారా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, సుకన్య సమృద్ధి యోజన, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వంటి పెట్టుబడులపై రూ.1.50 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంటుంది. అలాగే సెక్షన్ 80డీ ద్వారా ఆరోగ్య బీమాపై గరిష్ఠంగా రూ.50 లక్షల మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80సీసీసీ ద్వారా పెన్షన్ ఫండ్ కంట్రిబ్యూషన్‌పై ట్యాక్స్ డిడక్షన్స్ ఉంటాయి. హోమ్ లోన్ వడ్డీ, హెచ్ఆర్ఏ మినహాయింపులు వంటివి పాత పన్ను విధానంలో ఉంటాయి. కానీ, కొత్త పన్ను విధానంలో ఇవేవీ ఉండవు. చిన్న మొత్తాల పొదుపు పథకాలైన పీపీఎఫ్, ఎన్ఎస్సీ, ఈఎల్ఎస్ఎస్, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్న ట్యాక్స్ పేయర్లకు ఎలాంటి ప్రోత్సాహకాలు కల్పించే పాత పన్ను విధానంలో కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ స్కీమ్స్ అన్నీ సెక్షన్ 80సీ కిందకు వస్తాయి. రూ.1.50 లక్షల వరకు మినహాయింపు ఉంటుంది. 2020లో కొత్త పన్ను విధానం ప్రవేశపెట్టినప్పటి నుంచి చూసుకుంటే పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ, కొత్త విధానంలోకి మారిన వారికి ప్రతి ఏడాది భారీ ఊరట కల్పిస్తున్నారు. పన్ను శ్లాబుల్లో మార్పులు, ట్యాక్స్ మినహాయింపుల పెంపు వంటివి ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో బడ్జెట్ 2025 తర్వాత కూడా చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో పెట్టుబడులు కొనసాగించాలా? వద్దా? అనే విషయంపై చాలా మంది ట్యాక్స్ పేయర్లు ఆయోమయంలో పడ్డారు. చాలా మంది కొత్త పన్ను విధానంలోకి మారిన తర్వాత పెట్టుబడులు పెట్టడం మానేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై ఆర్థిక నిపుణులు పలు విషయాలు వెల్లడించారు. ట్యాక్స్ సేవింగ్ ప్రయోజనాలు లేనప్పటికీ ఆయా పథకాల్లో పెట్టుబడులు కొనసాగించాలని చెబుతున్నారు. ఈ పొదుపు పథకాలను ఎంచుకోవడం కేవలం పన్ను ఆదా కోసం మాత్రమే ఉండకూడదంటు న్నారు. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు ఇప్పటికీ సురక్షితమైన, స్థిరమైన రిటర్నులు అందిస్తాయని గుర్తు చేశారు.

బడ్జెట్ తర్వాత ట్యాక్స్ పేయర్లకు తమ పెట్టుబడి నిర్ణయాలపై మరింత సౌలభ్యం ఏర్పడిందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ట్యాక్సే సేవింగ్ పథకాలే కాకుండా ఇతర పొదుపు పథకాలను ఎంచుకునేందుకు అవకాశం లభించిందని, తమ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడి పథకాలను ఎంచుకోవచ్చంటున్నారు. దీంతో ట్యాక్స్ సేవింగ్ స్కీమ్స్ ఈఎల్ఎస్ఎస్ వంటి మూడేళ్ల లాకిన్ పీరియడ్ లేదా 15 ఏళ్ల లాకిన్ పీరియడ్ ఉన్న పీపీఎఫ్ కాకుండా ఇతర పథకాలనూ ఎంచుకోవచ్చని చెబుతున్నారు. ఏదైనా ట్యాక్స్ బెనిఫిట్స్ కోసమే ఆలోచించకూడదని, ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుడులను కొనసాగించాలంటున్నారు.

## నైపుణ్యం, వికేంద్రీకరణ, వ్యాపార సామర్థ్యాల
# పెంపుపై దృష్టి పెట్టండి

- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్
- ఘనంగా మూవ్ ఇన్ సింక్ జీసీసీ కాన్‌క్లేవ్ 2025

**హైదరాబాద్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** నైపుణ్యం, వికేంద్రీకరణ, వ్యాపార సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం (ఐ అండ్ సీ), సమా చార సాంకేతికత (ఐటీ) విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల (జీసీసీ) వృద్ధి కోసం ప్రభుత్వంతో వ్యాపార ప్రముఖులు చర్చించేందుకు హైదరాబాద్‌లోని షెరటన్ హోటల్‌లో మూవ్ ఇన్ సింక్ జీసీసీ కాన్‌క్లేవ్ 2025 నిర్వహించారు. ఈ కాన్‌క్లేవ్ కు అధ్యక్షత వహించిన జయేశ్ మాట్లాడుతూ గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు ఆర్థిక వృద్ధికి మూలమ న్నారు. ఇవి మా ఆర్థిక వ్యవస్థకు ప్రధానమైన వృద్ధి శక్తిగా మారాయన్నారు. ఇటీవల బడ్జెట్‌లో జాతీయ స్థాయిలో దీనిపై ఒక విధానం అమలు చేయను న్నట్లు వెల్లడించామన్నారు. హైదరాబాద్ అన్ని వృద్ధి ప్రమాణాలలో దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు. దీనికి గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల సహకారం ఎంతో ఉందని చెప్పారు. వికేంద్రీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామ న్నారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన టైర్-2 సిటీల పాలసీ ద్వారా హైదరాబాద్ వెలుపల కంపెనీలు ఏర్పాటు చేస్తే ప్రోత్సాహ కాలు అందిస్తున్నట్లు తెలిపారు. తూర్పు హైదరాబాద్‌లోని మేడ్చల్, దక్షిణ హైదరాబా ద్‌లోని మల్లంపేట ప్రాంతాలను ప్రస్తా విస్తూ..ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిం చారు. వ్యాపార సంస్థలు తమ ఉద్యోగులను ఈ ప్రాంతాల్లో ప్రణాళికబద్ధంగా ఏర్పాటు




చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మూవ్ ఇన్ సింక్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో దీపేశ్ అగర్వాల్ మాట్లాడుతూ 2030 నాటికి భారతీయ గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల మార్కెట్ 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. ఇప్పటికే 30 శాతం పైగా గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు ఇతర నగరాల కంటే హైదరాబా ద్‌ను ప్రాధాన్యతగా ఎంచుకున్నాయని తెలిపారు. హ్యూమనైజ్ వ్యవస్థాపకుడు, సీఈవో జగదీష్ మిత్ర మాట్లాడుతూ 2030 నాటికి 2,400 గ్లోబల్ కెపాసిటీ సెంటర్లకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనున్నదని తెలిపా రు. ఇప్పటికే గ్లోబల్ కెపాసిటీ సెంటర్లకు ముఖ్యమైన ఇన్నోవేషన్ హబ్‌గా మారింద న్నారు. హ్యూమనైజ్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో జగదీష్ మిత్ర, లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ ఇండియా సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ శిరీషా ఓరుగంటి మధ్య ఫైర్‌సైడ్ చాట్ జరిగింది. భారతదేశం లోని వ్యాపారా లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజె న్స్ పాత్రపై చర్చించారు. ఈ చర్చలో ఎవర్నార్త్ హెల్త్ సర్వీసెస్ ఇండియా మేనేజిం గ్ డైరెక్టర్ అశోక్ వెంకటాచలం, జీసీసీ సైట్ లీడర్, కెన్వ్యూ సొల్యూషన్స్ ఇండియా జీసీసీ వీపీ, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ పునేయాని, కార్లైన్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా ప్రకాశ్ దేవరకొండ, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ వీపీ, మేనేజింగ్ డైరెక్టర్ హరికృష్ణ వర్మ నడింపల్లి, హ్యూమ నైజ్ సహ వ్యవస్థాపకుడు రాజారాయ్ పాల్గొన్నారు.

# పనామా కాలువపై అమెరికాకు రాయితీ అంతా ఉత్తదే..

పనామా కాలువలో ప్రయాణించే అమెరికా నౌకలకు ఆ దేశం ఎలాంటి ఫీజు తీసుకోవడం లేదని చెబుతూ అగ్రరాజ్యం అమెరికా విదేశాంగ మంత్రి తాజాగా పోస్ట్ పెట్టిన విషయం అందరికీ తెలిసిందే. అయితే అదేమీ లేదని.. తాను అమెరికాకు ఎలాంటి రాయితీ కల్పించలేదంటూ తాజాగా పనామా కెనాల్ అథారిటీ సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇచ్చింది. ముఖ్యంగా టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం, మార్పులు వంటివి తమ పరిధిలోకే వస్తాయని.. ఇప్పటి వరకు తాము ఎలాంటి సవరణలు చేయలేదంటూ షాక్ ఇచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అగ్రరాజ్యం అమెరికాకు చెందిన యుద్ధ నౌకలు.. పనామా కాలువపై నుంచి ప్రయాణిస్తే ఎలాంటి ఫీజును తీసుకోమని ఆ దేశం చెప్పిందంటూ యూఎస్ తాజాగా ప్రకటించింది. ముఖ్యంగా అమెరికా రక్షణ మంత్రి హెగ్సే ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలుపగా.. ఇదంతా నిజమేనంటూ అమెరికా విదేశాంగ కూడా ధ్రువీకరించింది. కానీ దీనిపై తాజాగా పనామా కెనాల్ అథారిటీ స్పందించింది. అలాంటిదేమీ లేదని.. తామేమీ అమెరికాకు రాయితీ కల్పించలేదని స్పష్టం



చేసింది. ముఖ్యంగా టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం, మార్పులు వంటివి తమ పరిధిలోకే వస్తాయని.. ఇప్పటి వరకు తాము ఎలాంటి సవరణలు చేయలేదంటూ షాక్ ఇచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అమెరికా రక్షణ మంత్రి హెగ్సే ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ మరీ.. అమెరికా యుద్ధ నౌకలు పనామా కెనాల్‌పై ప్రయాణిస్తే ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని వివరించింది. ఇందుకు ఆ దేశం కూడా ఒప్పుకుందని వెల్లడించింది. ఇది నిజమేనంటూ అమెరికా విదేశాంగ శాఖ కూడా క్లారిటీ ఇవ్వగా.. అంతా నిజమేనని భావించారు. కానీ తాజాగా ఇదంతా అబద్ధం అని.. పనామా కెనాల్ అథారిటీ తేల్చి చెప్పింది. పనామా అమెరికాతో ఎలాంటి ఒప్పందమూ చేసుకోలేదని వివరించింది.

ముఖ్యంగా పనామా కెనాల్ నిర్వహణ బాధ్యత తమవద్దే ఉంటుందని.. టోల్ వ్యవస్థను బలోపేతం చేయడం, మార్పులు వంటివన్ని తమ పరిధిలోకే వస్తాయని వెల్లడించింది. ఇప్పటి వరకు తాము పనామా కాలువకు సంబంధించిన ఎలాంటి సవరణలు చేయలేదని.. ముఖ్యంగా యూఎస్‌కు ఎలాంటి రాయితీ కల్పించలేదని ప్రకటించింది. దీంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. అసలు అమెరికా ఇలా ఎందుకు చెప్పిందని ఆలోచిస్తున్నారు.

ప్రపంచ వాణిజ్యానికి ఎంతో కీలకం అయిన ఈ జల మార్గాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు ఎన్నో ఏళ్లుగా కలలు కంటుకున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడే ఈ విషయాన్ని తెలిపిన అతడు.. మరోసారి అధికారం చేతిలోకి రావడంతో కలను సాధించుకోవాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తం 51 మైళ్ల (82 కిలో మీటర్లు) కల్గిన ఈ పనామా కాలువ అట్లాంటిక్-పసిఫిక్ సముద్రాల మధ్య దూరాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.

అయితే ఈవారంలోనే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో లాటిన్ అమెరిగా దేశాల్లో పర్యటించబోతున్నారు. ఈ సందర్భం గానే కెనాల్‌పై చైనా నియంత్రణల్లో తక్షణమే మార్పులు తీసుకు రావాలని ఒత్తిడి చేయబో తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఆ దేశం చర్యలు తీసుకోకపోతే తామే ఏదో ఒకటి చేయాల్సి ఉంటుందని కూడా అమెరికా భావిస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే రూబియో పనామా అధ్యక్షుడు జాస్‌రౌల్‌తో పాటు కాలువ నిర్వాహకుడు రికార్టే వాస్క్వేజ్ మోరేల్స్‌ను కలిశారు.

# భారత్‌తో సంప్రదింపులపై పాక్ ప్రధాని సన్నాయినొక్కులు!

దేశ విభజన జరిగిన 75 ఏళ్లు గడిచినా.. ఇప్పటికీ కశ్మీర్ అంశం రగులుతూనే ఉంది. దాయాది పాకిస్థాన్.. ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించి భారత్‌ను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. అయితే, ఈ కుట్రలను భారత్ తిప్పికొడుతూ.. పాక్ తీరును ఐరాస వంటి వేదికలపై ఎండగడుతోంది. కశ్మీర్‌లో అంగుళం భూమి కూడా వదులుకోబోమని... అది ఎప్పటికీ మా దేశంలో అంతర్భాగమేనని భారత్ కుండ బద్దలు కొడుతోంది. ఇందులో ఇతరుల జోక్యాన్ని సహించబోమని చెప్పింది. దాయాది పాకిస్థాన్ మరోసారి శాంతి మంత్రం వల్లించింది. కశ్మీర్ అంశం సహా భారత్‌తో ఉన్న అన్ని సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకో వాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. కానీ, ఐక్యరాజ్యసమితిలో చేసిన వాగ్దానాలను భారత్ నెరవేర్చి, చర్చలకు ముందుకు రావాలంటూ పసన్నాయి నొక్కులు నొక్కింది. 'కశ్మీర్ సంఘీభావ దినం' సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాల్లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 ఆగస్టు 5 నాటి ఆలోచన నుంచి భారత్ బయటకు రావాలని కోరారు. అయితే, ఐరాసకు చేసిన వాగ్దానం నేరవేర్చుతూ కశ్మీర్ సహా అన్ని సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలని షెహబాజ్ అన్నారు. పరోక్షంగా భారత ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దును పాక్ ప్రధాని ప్రస్తావించడం గమనార్హం. 'కశ్మీరీలకు స్వయం నిర్ణయాధికార హక్కు లభించే వరకు పాకిస్థాన్ దృఢమైన నైతిక, దౌత్య, రాజకీయ మద్దతును అందిస్తూనే ఉంటుంది' అని ఆయన అన్నారు, 'కశ్మీర్ సమస్యకు ఏకైక పరిష్కారం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం ప్రకారం స్వయం నిర్ణయాధికార హక్కు మాత్రమే' అని కూడా ఆయన తెలిపారు.

# రెండు పౌర విమానాలు ఢీ

అగ్రరాజ్యం అమెరికాలో వరుసగా విమాన ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవలే మూడు ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలు ప్రజలు ప్రాణాలు కోల్పోగా.. తాజాగా మరో ప్రమాదం జరిగింది. సియాటెల్-టకోమా విమానాశ్రయంలో రెండు పౌర విమానాలు ఢీకొనగా.. అదృష్ట వశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టమూ సంభవించలే దు. కాకపోతే ఇందుకు సంబంధించిన వీడియో మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతుంది. అలాగే ప్రమాద సమయంలో రెండు విమానాల్లోనే పెద్ద ఎత్తున ప్రయాణికులు ఉండగా.. ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఈమధ్య కాలంలో అగ్రరాజ్యం అమెరికాలో వరుసగా విమాన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవలే మూడు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోగా.. తాజాగా మరో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రెండు పౌర విమానాలు ఢీకొన్నాయి. విమానాశ్రయంలోనే ఈ ప్రమాదం సంభవించగా.. ఆ సమయంలో రెండు విమానాల్లోనూ పెద్ద ఎత్తునే ప్రయాణికులు ఉన్నారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట ప్రస్తుతం తెగ వైరల్ అవుతోంది. అమెరికా వాషింగ్టన్‌లోని సియాటెల్ నగరంలో తాజాగా మరో విమాన ప్రమాదం జరిగింది. సియాటెల్-టకోమా అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం రోజు ఉదయం 10.17 గంటల సమయంలో డెల్టా ఎయిర్ లైన్స్, జపాన్ ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానాలు ప్రమాద వశాత్తు ఢీకొన్నాయి. డెల్టా ఎయిర్ లైన్స్‌కు చెందిన బోయింగ్ 737 విమానం 142 మంది ప్రయాణికు లతో సియాటెల్ నుంచి మెక్సికోలోని ప్యూర్టో వర్లర్టాకు వెళ్లాల్సి ఉండగా రన్‌వేపై సిద్ధంగా ఉంది.

అదే సమయంలో జపాన్ ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానం 172 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బందితో జపాన్‌లోని నరిటా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వచ్చి సియాటెల్‌లో ల్యాండ్ అయింది. ఈక్రమంలోనే టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న డెల్టా ఎయిర్ లైన్స్ విమానం తోక భాగాన్ని జపాన్ విమానం రెక్కలతో ఢీకొట్టింది. ప్రమాద విషయం గుర్తించిన రెండు విమానాల్లోని సిబ్బంది వెంటనే.. సదరు విమానాల నుంచి ప్రయాణికులను కిందకు దింపేశారు. అదృష్టవశాత్తు ఎలాంటి ఘోర ప్రమాదమూ జరగలేదు.

# అమెరికాలో కోడిగుడ్ల కొరత

సాధారణంగా కోళ్లను దొంగిలించే వాళ్లను చూస్తూనే ఉంటాం. అయితే ఇప్పుడు అమెరికాలో మాత్రం కోడి గుడ్లను దొంగతనం చేశారు. అది కూడా ఒకటో రెండో గుడ్లు కాదు.. ఏకంగా లక్ష గుడ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. వినడానికి చాలా ఫన్నీగా ఉన్నా.. ఈ ఘటన నిజంగానే జరిగింది. ప్రస్తుతం అమెరికాలో గుడ్ల కొరత అక్కడి వారిని వేధిస్తుండగా.. కొందరు దాన్ని ఆసరాగా చేసుకుని.. లక్ష గుడ్లు చోరీ చేయడం తీవ్ర దుమారానికి కారణం అవుతోంది. అసలు అమెరికాలో గుడ్ల కొరత ఎందుకు వచ్చింది. ఈ దొంగతనం ఎలా జరిగింది అనేది ఈ స్టోరీలో చూద్దాం.

అమెరికాలో ప్రస్తుతం కోడి గుడ్ల కొరత నెలకొంది. కోడి గుడ్లను కొనుగోలు చేసేందుకు అమెరికన్లు భారీగా ఎగబడుతున్నారు. దీంతో కోడి గుడ్ల ధరలు అక్కడ అమాంతం పెరుగుతున్నాయి. అయితే ఉత్పత్తి తక్కువ కావడం.. డిమాండ్ పెరిగిపోవడంతో.. గుడ్ల ధరలు భారీగా పెరుగుతున్నాయి. మరోవైపు.. బర్డ్ ఫ్లూ కారణంగా గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గిపో యిందని అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలోనే గుడ్లు దొంగతనం జరగడం గమనార్హం. ఏకంగా 1 లక్ష గుడ్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు తాజాగా పోలీసులకు ఫిర్యాదు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కోడి గుడ్ల కొరత నెలకొనగా.. ఇప్పుడు ఏకంగా లక్ష గుడ్లు దొంగతనానికి గురి కావడం సంచలనంగా మారింది.

పెన్సిల్వేనియా రాష్ట్రంలోని గ్రీన్‌క్యాసెల్ నగరంలో ఉన్న పీట్ అండ్ గ్యారీస్ ఆర్గానిక్స్ ఎల్ఎల్‌సీ సంస్థకు చెందిన లక్ష గుడ్లు మాయం అయ్యాయి. రిటైల్ షాపులకు సరఫరా చేసేందుకు గుడ్లను లారీల్లో లోడ్ చేయగా.. ఆ లోడ్ నుంచి దొంగలు కోడి గుడ్లను ఎత్తుకెళ్లినట్లు సదరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. చోరీ అయిన గుడ్ల విలువ 40 వేల డాలర్లు అని.. అయితే ఇది మన భారత కరెన్సీలో దాదాపు రూ.35 లక్షలు ఉంటుందని తెలుస్తోంది.

గత కొన్ని రోజులుగా కోడి గుడ్ల కొరతతో అమెరికావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2 ఏళ్ల క్రితం డజన్ గుడ్లు ఒక డాలర్ అంటే మన కరెన్సీలో రూ.84 ఉండగా.. ఇప్పుడు అదే డజన్ గుడ్ల ధర ఏకంగా 7 డాలర్లు అంటే దాదాపు రూ.590 పలుకుతున్నట్లు చెబుతున్నారు. గుడ్ల కొరత కారణంగానే ఒక్కసారిగా వీటి ధర అమాంతం పెరిగిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక అమెరికాలో గుడ్ల ధరలు పెరగడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి బర్డ్‌ఫ్లూ కాగా.. మరొకటి పెరుగుతున్న గుడ్ల డిమాండ్. గత 2 ఏళ్లుగా అమెరికాలోని పలు ప్రాంతాల్లో క్రమంగా బర్డ్‌ఫ్లూ ప్రభావం



పెరుగుతూ వస్తోంది. గత దశాబ్దకాలంలోనే ఇంతటి భారీ స్థాయిలో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాపించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. గతనెలలో లూసియానా రాష్ట్రంలో మనుషులకు కూడా ఈ ప్రాణాంత కరమైన స్థాయిలో ఉండే బర్డ్‌ఫ్లూ వేరియంట్‌ను డాక్టర్లు కనుగొన్నారు. దీంతో పౌల్ట్రీ యజమానులు.. ప్రతి నెలా లక్షలాది కోళ్లను చంపేస్తున్నారు. 2022లో బర్డ్ ఫ్లూ కారణంగా 10.4 కోట్ల గుడ్లు పెట్టే కోళ్లు చనిపోయాయని యునైటెడ్ ఎగ్ ప్రొడ్యూసర్స్ వెల్లడించింది. ఇవే కాకుండా గతేడాది అక్టోబర్‌లో 29 లక్షల కోళ్లు చనిపోయాయని.. ఈ కారణంగానే అమెరికాలో ప్రస్తుతం గుడ్ల కొరత ఏర్పడినట్లు చెబుతున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ తినలేని అమెరికన్లు మొత్తం.. ఇప్పుడు గుడ్లు తినడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని.. అందుకే గుడ్ల ధరలు భారీగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. గుడ్ల ధరలు భారీగా పెరుగుతుం డటంతో గుడ్లతో తయారు చేసే వంటకాల ధరలను కూడా రెస్టారెంట్లు, హొటళ్లు పెంచుతున్నాయి.

అమెరికాలో ప్రస్తుతం కోడి గుడ్ల కొరత నెలకొంది. కోడి గుడ్లను కొనుగోలు చేసేందుకు అమెరికన్లు భారీగా ఎగబడుతున్నారు. దీంతో కోడి గుడ్ల ధరలు అక్కడ అమాంతం పెరుగుతున్నాయి. అయితే ఉత్పత్తి తక్కువ కావడం.. డిమాండ్ పెరిగిపోవడంతో.. గుడ్ల ధరలు భారీగా పెరుగుతున్నాయి. మరోవైపు.. బర్డ్ ఫ్లూ కారణంగా గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గిపోయిందని అధికారులు వెల్లడించారు.



# కాంగ్రెస్‌తోనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారం

- ప్రశ్నించే గొంతుకలు కాదు - పరిష్కరించే నాయకులు కావాలి
- ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీతోనే ఉద్యోగ నిరుద్యోగ పట్టబద్రుల సమస్యలు పరిష్కారం అవుతాయని కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి వూటుకూరి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కళాశాల మైదానం , బతుకమ్మ ఘాట్, కార్గిల్ లేక్, ఇంద్ర పార్క్, రాజీవ్ నగర్ స్టేడియంవాకర్స్ తో ముఖాముఖి సమావేశం నిర్వహించి రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టబద్రుల ఎమ్మెల్యే ప్రచారంలో భాగంగా తాను ఉమ్మడి నాలుగు జిల్లాలలో పర్యటించడం జరిగిందని, చాలా సమస్యలు తన దృష్టికి వచ్చాయని తన పర్యటనలో వచ్చిన సమస్యలు ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటన్నిటి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. పట్టభద్రులకు ప్రశ్నించే గొంతులు అవసరం లేదని సమస్యలు పరిష్కరించే సత్తా ఉన్న నాయకులు కావాలని వెల్లడించారు. విద్యారంగ సమస్యలపై అవగాహన ఉన్న తనకు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ప్రభుత్వం చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలను యువత ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన యేడాది కాలంలోనే నిరుద్యోగ యువతకు 55 వేల ఉద్యోగాలు ఇచ్చి వారికి భరోసా కల్పించారని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ యాజమాన్య కళాశాల ప్రతినిధి ఊటుకూరు రవీందర్ రెడ్డి , రాజన్న సిరిసిల్ల జిల్లా వీఎన్నార్ టీం ఇంచార్జ్ మాసం రత్నాకర్ పటేల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం నర్సయ్య, సంగీతం శ్రీనివాస్, గోలి వెంకటరమణ, వేల్పుల తిరుపతిరెడ్డి, విఎన్ఆర్ టీం సభ్యులు, ఆనందం, కనపర్తి జగదీశ్వర్, తోపుల శ్రీనివాస్, సుద్దాల శ్రీనివాస్, రాజు, మల్లేశం, మడుపు ప్రవీణ్ రెడ్డి, యేసు రత్నం, గోనె ఎల్లప్ప, కల్లూరు చందన తదితర నాయకులు పాల్గొన్నారు.

# లక్షలాదిగా తరలిరండి.. మీ వాడిగా ఆశీర్వదించండి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్
- మీరంతా వచ్చి మీ కుటుంబ సభ్యుడిగా అండగా నిలిచి ఆశీస్సులు అందించండి
- ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 06 (జనం సాక్షి) :** మేధావులు మౌనం వీడాల్సిన సమయం ఇది. ప్రశ్నించే గొంతుకగా, సమస్యలను పరిష్కరింప చేసే సత్తా ఉన్నవాడిగా శుక్రవారం కరీంనగర్, నిజమాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నాను. నాకు అండగా నిలిచి మద్దతుగా లక్షలాదిగా తరలి వచ్చి ఆశీర్వదించండి. నా 19 సంవత్సరాల ప్రభుత్వ ఉద్యోగ జీవితానికి రాజీనామా చేసి నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యలకు ప్రశ్నించే గొంతుకగా సమస్యలను పరిష్కరింప చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చాను. ఇప్పటి వరకు మీరందరు అండగా నిలిచి ఆశీర్వదించారు. (ఈనెల 7వ తేది) నేడు శుక్రవారం రోజున మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ వేస్తున్నాను. మీరందరు నా వెంట తరలి వచ్చి నాకు అండగా నిలిచి మీ బిడ్డగా, మీ వాడిగా, మీ కుటుంబ సభ్యుడిగా ఆదరించి ఆశీర్వదించగలరు. నా నామినేషన్ ప్రక్రియ కరీంనగర్ ఎస్సారార్ కాలేజీ నుండి లక్షాలాధిగా తరలివచ్చిన మీ అందిరితో కలిసి కోర్టు సర్కిల్, ఆర్ అండ్ బి గెస్ట్‌హౌజ్, తెలంగాణ చౌక్ నుండి ప్రతిమ మల్టీప్లెక్ మీదుగా కరీంనగర్ కలెక్టరేట్‌లో పట్టభద్రుల సాక్షిగా నామినేషన్ వేస్తున్నాను. భ్రష్టుపట్టిన ప్రస్తుత రాజకీయాలను ప్రక్షాళన చేయడానికి మీరు నాకు అండగా ఉన్నరనే ధైర్యంతో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి అడుగుపెట్టిన నాతో వెంట ఉండి ముందుకు నడిపించాలని మీ అందరికి పేరుపేరున సవినయంగా మనవి చేస్తున్నానని ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ తెలిపారు.

# గ్రామాల్లో పిల్లలు ప్రభుత్వ బడిలోనే చదవాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**తంగళ్ళపల్లి, ఫిబ్రవరి 06 (జనంసాక్షి) :** తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, చీర్లవంచ గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలోనే 70 శాతం ప్రసవాలు అయ్యేలా చూడాలని వైద్యులకు సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఆస్పత్రి ఆవరణలో గడ్డి నిరుపయోగంగా మొక్కలు పెరగడంతో వాటిని తొలగించాలని ఎంపీవో ను ఆదేశించారు. సీసీ కెమెరాలను మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. ఆస్పత్రి పరిధిలోని ఓపి ఇతర రిజిస్ట్రార్లను తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ ఆయా గదులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రిక రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చీర్లవంచ గ్రామంలోని తేనుగువారి పల్లెలో మండల పరిషత్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పాఠశాల ఆవరణ, గ్రామంలోని రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. తరగతి గదులు, మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తుండగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వాటర్ ప్యూరిఫైర్డ్, ఫ్యాన్లు మరమ్మత్తులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వంటగది నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. పాఠశాలకు మంచి భవనం ఉందని కానీ విద్యార్థుల సంఖ్య తక్కువ ఉందని పేర్కొన్నారు. గ్రామంలోని పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చదివేలా చూడాలని, ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన సాంకేతికతతో కూడిన విద్య పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులు చదువులలో రాణించేలా క్రమశిక్షణతో కూడిన బోధన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కార్తిక్ లాల్ పాల్గొన్నారు.



# తెలంగాణ బాలికల గురుకులంలో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య





**బాలానగర్, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** ఉరేసుకొని బాలిక మృతిచెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలో గురువారం ఉదయం జరిగింది. స్థానికులు పాఠశాల ఉపాధ్యాయులు సహచర విద్యార్థుల వివరాల ప్రకారం.. జనరల్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులు ప్రార్థన కోసం సిద్ధమవుతున్న సందర్భంలో విద్యార్థి పాఠశాలలో ఎవరూ లేని సమయంలో ఏడవ తరగతి గదిలో పదవ తరగతి బాలిక ఆరాధ్య (15) ఉరేసుకుంది. గమనించిన తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఉపాధ్యాయులు విద్యార్థిని బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం షాద్ నగర్ తరలించగా.. అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. బాలిక స్వగ్రామం నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన కొమ్ము రమేష్, రజిత కూతురు. ఈ సంఘటన తెలుసుకున్న విద్యార్థి సంఘాలు పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జడ్చర్ల సిఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో.. పోలీసులు పాఠశాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ విజయేందిర బోయి పాఠశాలకు సందర్శించి విద్యార్థి మృతికి గల కారణాలు పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోధిస్తున్న తల్లిదండ్రులను ఓదార్చారు. విద్యార్థి కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాన్ని కల్పిస్తామని, విద్యార్థి మృతికి కారణమైన వ్యక్తులపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా.. రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, జనరల్ గురుకుల పాఠశాల, కళాశాల డిప్యూటీ సెక్రటరీ ప్రసాద్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగార్జున గౌడ్, రాజాపూర్ ఎస్సై రవి నాయక్, బాలానగర్ ఎస్సై లెనిన్ గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాదిగల , మాదిగ ఉప కులాల పోరాటం ఫలించింది

ఎస్సీ వర్గీకరణ ఆమోదించిన సర్కారుకు యావత్ దళిత జాతి పక్షాన కృతజ్ఞతలు




**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 06 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు కాంగ్రెస్ ప్రజా పాలన ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. జిల్లా నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గురువారం రోజు నగరంలో అంబేద్కర్ చౌరస్తా నుండి జగ్జీవన్ రామ్ చౌరస్తా వరకు కృతజ్ఞత ర్యాలీ చేపట్టడం జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం , జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి అరుణ్ , లింగంపల్లి బాబు లు హాజరై అంబేద్కర్ , జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... 30 ఏళ్ల వర్గీకరణ పోరాటానికి తెరదించుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అన్ని వర్గాలు మద్దతు తెలిపారు. కాబట్టి వర్గీకరణ చేసినందుకు కృతజ్ఞతగా మేము విజయోత్సవ ర్యాలీ చేయడం జరిగింది. ఎన్నో రోజులుగా పోరాటాలు చేసి పోరాటంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని వర్గీకరణ వల్ల ఎవరి వాటా ఎంతో అని చేవెళ్ల ఎన్నికల మేనిఫెస్టోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున కర్గే లు వాగ్దానం ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చినందున వారికి మా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ నాయక్, కల్వల రామచందర్, సముద్రాల అజయ్, జీడి రమేష్, పోతారపు సురేందర్, దీకొండ శేఖర్ ,హస్తపురం రమేష్, మారంపల్లి లక్ష్మీనారాయణ, గాలి అనిల్ కుమార్, హస్త పురం తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# రూ. 40 కోట్ల 39 లక్షలతో విద్యుత్ ఆధునికీకరణ పనులు

ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**నారాయణఖేడ్: జనవరి 6 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ నియోజకవర్గంలో విద్యుత్ లైన్లు, ఫీడర్ల అదునికరణ కోసం ప్రభుత్వం రూ.4 కోట్ల 39 లక్షల నిధులు మంజూరు చేసిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన లైన్లు, ఫీడర్ల ఆధునీకరణ కోసం నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి ఇచ్చిన వినతిపత్రం మేరకు విద్యుత్ అధికారులు మంజూరు చేశారు. గత జులై 30 న ఇచ్చిన వినతిపత్రం మేరకు కంగ్టి మండలం దెగుల్ వాడీ ఫీడర్ ను విభజి, 11 గ్రామాల విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి రూ. 23 లక్షలు, కంగ్టి రూరల్ ఫీడర్ విభజించడం తోపాటు నూతన లైను ఏర్పాటు కోసం రూ.18 లక్షలు మంజూరయ్యాయి. కంగ్టి మండలం రాసోలు, తుర్కవడగాం, చౌకన్ పల్లి, తదితర గ్రామాల్లో విద్యుత్ ఆధునీకరణ పనులకు రూ.18 లక్షలు, నారాయణఖేడు మండలం హనుమంత్ రావు పేట్ పరిధిలో లైన్ల విభజన విభజన, నూతన పీడర్ ఏర్పాటుకు రూ.5 లక్షలు, మనూర్ మండలం బోరంచ , బాదల్ గాం, తోర్నాల్ , ఎన్.జి. హుక్రైన, పుల్ కుర్తి, బెల్లాపూర్, మాయి కోడ్, గ్రామాలలో ఆధునీకరణ పనులకు రూ. 21 లక్షలు, నాగల్ గిద్ద మండలం ఇరక్ పల్లి, ఫీడర్ పరిధిలో ఆధునికరణకు రూ. 8 లక్షలు, అంతేకాకుండా పలు గ్రామాలలో ఓల్టేజీ సమస్య నిర్మూలన కోసం రూ. 21 లక్షలు, కల్హేర్ మండలం కిష్టాపూర్ , తదితర గ్రామాలలో లో ఓల్టేజీ సమస్యకు రూ.9 లక్షలు, నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ తదితర గ్రామాలలో ఓల్టేజీ సమస్య నిర్మూలనకు రూ.18 లక్షలు, నిజాంపేట మండలం పలు గ్రామాలలో లో ఓల్టేజీ సమస్యను నిర్మూలనకు రూ. 24 లక్షలు, సిర్గాపూర్ మండలంలోని పలు గ్రామాలలో లో ఓల్టేజీ సమస్యకు రూ. 27 లక్షలు, కిష్టాపూర్ నుంచి కల్హేర్ పరిధిలో 7 కిలోమీటర్ల లైన్లు అభివృద్ధికి రూ.49 లక్షలు, కంగ్టి నుంచి తడ్కల్ 14 కిలోమీటర్లు లైన్ల అదునికరణకు రూ. 98 లక్షలు, నియోజకవర్గంలో విద్యుత్ స్తంభాల ఆధునికరణ కోసం 2 స్తంభాల కోసం రూ. 1 కోటి రూపాయలు మంజూరు చేస్తూ విద్యుత్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను కోరిన వెంటనే ఉపముఖ్యమంత్రి భ ట్టి విక్రమార్క నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.4.39 కోట్లు మంజూరు చేశారని గురువారం తెలిపారు. నియోజకవర్గంలో దివంగత కిష్టారెడ్డి హాయంలో అనేక సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందని, తిరిగి విద్యుత్ లైన్ల ఆధునికరణ , సమస్య పరిష్కరించడానికి భారీ ఎత్తున నిధులు రావడం ఆనందంగా ఉన్నదన్నారు.

# పారమిత పాఠశాలను సందర్శించిన ఎన్‌సిసి కమాండింగ్ అధికారి



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 06 (జనంసాక్షి) :** గురువారం రోజు స్థానిక పారమిత పాఠశాలలోని ఎన్. సి. సి విభాగాన్ని 9 తెలంగాణ బెటాలియన్ ఎన్ సి సి కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాకేశ్వర్ జస్వాల్, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ సందర్శించారని పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. పారమిత పాఠశాలలో 3 సంవత్సరాల పాటు వివిధ దశలుగా అభివృద్ధి చెందిన క్రమాన్ని, ఎన్ సిసి కార్యక్రమాలను నిర్వహించే విధానాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో కమ్యూనిటీ ఔట్రీచ్ కార్యక్రమాలను చేపట్టే విధానాన్ని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాలను సందర్శించి, సలహాలు సూచనలు ఇచ్చిన లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ జస్వాల్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ నేపథ్యంలో పారమిత పాఠశాల ఎన్.సి.సి విభాగ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చిన లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ జస్వాల్ , సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ లను పారమిత పాఠశాలల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, సమన్వయకర్తలు, ఎన్.సి.సి. కేర్ టేకర్ బి. ప్రశాంత్, ఏక్సర్వీస్ మెన్ రమేశ్ లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు 15 నామినేషన్లు

గ్రాడ్యుయేట్ స్థానానికి 12 , ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 3 • జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పమేలా సత్పతి

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 06 (జనం సాక్షి) :**

మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 12 మంది నామినేషన్ వేయగా, టీచర్స్ ఎమ్మెల్సీకి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థుల నుండి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్లు స్వీకరించారు.

**పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి..**

సంగారెడ్డి జిల్లా కంది మండలానికి చెందిన లంటు చంద్రశేఖర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీకి నామినేషన్ వేయగా, కరీంనగర్ లోని విద్యానగర్ కు చెందిన యాదగిరి శేఖర్ రావు తరఫున పచ్చునూరి సురేందర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి నామినేషన్ దాఖలు చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన మేకల అక్షయ్ కుమార్, నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం చిట్టాపూర్ కు చెందిన అబ్బగోని అశోక్ గౌడ్, నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన దేవతి శ్రీనివాస్, నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం పెరుందేవి గూడేనికి రైకల సైదులు, జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం గుండం పల్లికి చెందిన గుయ్య సాయి కృష్ణమూర్తి, కరీంనగర్ నగరానికి చెందిన ఎడ్ల సాయి కృష్ణప్రియ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి నామినేషన్లు దాఖలు చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన దొడ్ల వెంకటేశం, మంచిర్యాల జిల్లా తిరుమలగిరి కాలనీకి చెందిన కొమిరెడ్డి మహేష్, నిజామాబాద్ కు చెందిన గడ్డం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం కొసునూరు పల్లికి చెందిన వేముల విక్రమ్ రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ కి నామినేషన్ వేశారు.




**ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి..**

మెదక్ జిల్లా టేకుమల్ మండలం ఎల్లుపేట గ్రామానికి చెందిన మామిడి సుధాకర్ రెడ్డి, సికింద్రాబాద్ ఈస్ట్ మారేడుపల్లికి చెందిన మల్కా కొమురయ్య, సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం న్యూ మల్కాపూర్ కు చెందిన వై.అశోక్ కుమార్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి నామినేషన్ దాఖలు చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి ఇదివరకే నామినేషన్ వేసిన ఆదిలాబాద్ జిల్లా యాపల్ గూడాకు చెందిన మంచి కట్ల ఆశమ్మ మరో రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఇదివరకే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి నామినేషన్ వేసిన మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడేనికి చెందిన కంటే సాయన్న మరో సెట్ నామినేషన్ సమర్పించారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి ఇదివరకే నామినేషన్ దాఖలు చేసిన కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన సిలివేరి శ్రీకాంత్ మరో సెట్ నామినేషన్ అందజేశారు. ఈ నెల 6 వరకు పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు కలిపి మొత్తం 28 మంది నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో 21 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి, 07 టీచర్స్ ఎమ్మెల్సీకి నామినేషన్ వేశారు.

# న్యాల్‌కల్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు చర్యలు

పరిశీలించిన జిల్లా గృహ నిర్మాణాధికారి చలపతి రావు



**న్యాల్ కల్, ఫిబ్రవరి 06, (జనం సాక్షి) :** ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళ గృహ నిర్మాణాల ఏర్పాటు కోసం జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సాధించారు. కలెక్టర్ ఆదేశం మేరకు గురువారం జిల్లా గృహ నిర్మాణాధికారి చలపతి రావు, జిల్లా గృహ నిర్మాణ ఏఈ మాధవరెడ్డిలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. జనవరి 26న న్యాల్ కల్ లో 150 గురికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మంజూరు చేశారు. తొలి ప్రాధాన్యతగా ఖాళీ స్థలం, పూరి గుడిసెలు, రేకుల షెడ్లు, ఒంటరి మహిళలు, వికలాంగులు, వితంతువులను గుర్తించి వారిని తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక పంచాయతీ రాజ్ అధికారులకు ఆదేశించారు. "ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం" నిబంధనల మేరకే అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీ రాజ్ అధికారులతో కలిసి గ్రామంలోని పలువురి ఇండ్ల ఖాళీ స్థలాలు, అసంపూర్తి ఇండ్ల నిర్మాణాలు, పూరి గుడిసెలు, రేకుల షెడ్డు, ఒంటరి మహిళలు, వికలాంగులు, వితంతువుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అధికారుల బృందం, అధికార పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వై జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 06 (జనంసాక్షి) :** సోన్ మండలం కడ్తాల్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారి 'వై' జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, కడ్తాల్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడ్తాల్ జాతీయ రహదారి 'వై' జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, వారి సమస్యను పరిష్కరించేందుకై సంబంధిత అధికారులందరితో ఇప్పటికే సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆర్డీఓ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ఇప్పటికే సమస్యాత్మక ప్రదేశానికి వెళ్లి వాహనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశిలించిందన్నారు. రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతోపాటు,. రహదారి సమస్య పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూర్తి వివరాలతో ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేయాలన్నారు. కడ్తాల్ గ్రామం నుంచి నిర్మల్ వైపుకు వాహనాలు మళ్లే దారిలో తాత్కాలిక రహదారి విభాగినులను ఏర్పాటు చేసి, భారీ వాహనాలు మళుృతాయో లేదో తెలుసుకునేందుకు పరిశీలనాత్మకంగా అధికారులు, గ్రామస్తుల సమక్షంలో ఆర్టీసీ బస్సులను తిప్పి చూడాలన్నారు. వీలైనంత త్వరగా గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి జానకి షర్మిళ, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్రా రెడ్డి లు, ఆర్డిఓ రత్నకళ్యాణి, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, జాతీయ రహదారుల అధికారి ప్రసన్న, ఆర్టీవో దుర్గప్రసాద్, సోన్ మండల తహసిల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, కడ్తాల్ గ్రామస్తులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అప్రకటిత కరెంటు కోతలు

- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు



**బోథ్ ఫిబ్రవరి 06(జనంసాక్షి) :** కరెంటు కోతలు అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి వేళాపాళా లేని విద్యుత్ సరఫరాతో రైతులు పొలాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు బోథ్ మండల వ్యాప్తంగా ఉన్న కారత్వాడ ఆయా కట్ట నీరు విడుదలలో సరైన సమయానికి పంటలకు అందక ఎండిపోతున్నాయి రైతులు చెబుతున్నారు. కనీసం బోర్ల ద్వారా అయినా పంటలను కాపాడుకుందాం అంటే రైతులకు కరెంటు కష్టాలతో పాటు భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతున్నాయి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికొచ్చే సమయంలో అప్రకటిత కోతలతో ఏం చేయాలో పాలు పోవడం లేదు. గత 15 రోజుల నుండి విద్యుత్ సరఫరా సరిగ్గా లేక పొలాల వద్ద కరెంటు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు**

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ సరైన సమయంలో విద్యుత్ సరఫర చేయడం లేదు ఉదయం ఐదు గంటలు నిరంతరాయంగా ఇస్తే పంటలు పండుతాయని లేదంటే ఎండిపోయి నష్టాలు మిగులుతాయి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కనీసం రాత్రి పూట కరెంటు సరఫరా చేస్తే పాములు,తేళ్ళు కుట్టి ప్రాణాపాయం కలుగుతుందన్నారు. సరైన సమయంలో పంటలకు విద్యుత్ సరఫరా అందించి రైతులకు మేలు చేకూర్చాలని అన్నదాతలు కోరుతున్నారు.

**కంటి నిండా కునుకు లేదు**

ట్రాన్స్ ఫార్మర్ల వద్ద కంటి నిండా కునుకు లేకుండా పొద్దంతా కూర్చుంటున్నాం. ఎప్పుడు వస్తుందో తెలియట్లేదు వచ్చిన అరగంట గంట మాత్రమే ఇస్తున్నారు. ఎవరిని అడిగిన సరైన సమాధానాలు చెప్పడం లేదు. రబీ పంట సాగు చేయడంతో నీరు లేక పంటలు వచ్చే పరిస్థితి లేదు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. ఎకరానికి ఒక్కరోజులో నీరు పెట్టేవాళ్ళం, కానీ ఇప్పుడు నాలుగురోజుల సమయం పడుతుంది 24 గంటలు కరెంట్ అన్నారు ఎప్పుడు వస్తుందో పోతుందో తెలియడం లేదు. గత పది రోజుల నుండి కరెంటు కోతలు ఎక్కువయ్యాయి. సరైన సమయంలో పంటలకు విద్యుత్ సరఫర అందించాలి

-భీమ శ్రీనివాస్ రైతు (కనుగుట్ట)

# సీజనల్ జ్వరాలపై జిల్లా కలెక్టర్ ఆరా



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలంలో గురువారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య అధికారిని సీజనల్ జ్వరాలపై అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం నెన్నెల, ఘన్పూర్, జోగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించి వారితో పాఠ్యాంశాలను చదివించి వారి నైపుణ్యాలను పరీక్షించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థులు అందరినీ ప్రభుత్వ పాఠశాల వైపు మళ్ళించాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణ, పూర్తయిన పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇట్టి నిర్మాణాలకు సంబంధించి బిల్లులు జనరేట్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ సబ్బ రమేష్, మండల అభివృద్ధి అధికారి దేవేందర్ రెడ్డి, ఏపీఓ నరేష్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే సమయస్ఫూర్తితో ముందుకెళ్లాలి

- ఎన్డిఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండర్ ఎస్కే బెహ్రా..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని ఎన్డిఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండర్ ఎస్కే బెహ్రా తెలిపారు. గురువారం భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి గ్రామంలో ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించిన సందర్భాలలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై కమ్యూనిటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, 10వ బెటాలియన్ కమాన్డెంట్ వీవీఎస్ ప్రసన్న కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 14వ తేదీ వరకు మండల కేంద్రాలు, పరిసర గ్రామాలు, పాఠశాలలు, పరిశ్రమలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కమ్యూనిటి అవగాహన కార్యక్రమాలు ద్వారా ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విపత్తు నివారణ, ఉరుములు, మెరుపులు, పిడుగులు, వడగండ్లు, ఈదురుగాలులు వీచినపుడు ప్రజలు భయాందోళలకు గురికాకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించి సహాయక చర్యలు చేపట్టి ప్రాణాలను కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఎఫ్ బృందాలు నిర్వహించిన పలు డెమోలను, విపత్తులు సమయంలో తీసుకొనే చర్యల మాక్ డ్రిల్ కార్యక్రమాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో నాగరాజు, ఆర్ఐ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ ఓపి వైద్య సేవలు ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఆయుష్ ఓపి వైద్య సేవలు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆయుష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య, నర్సింగ్, ఆయుష్ వైద్య సిబ్బందితో వసతి సౌకర్యం, సిబ్బంది సర్దుబాటు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్ సేవలు ప్రారంభించాలని ఆదేశించారు. నర్సింగ్ కళాశాలకు సిబ్బంది సర్దుబాటు, ఫర్నిచర్, పరికరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నర్సింగ్ కళాశాలలో సీసీ కెమెరాలు, మంచినీటి సరఫరాకు ఆర్ ఓ ప్లాంట్ తదితర సౌకర్యాల కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశం, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా, ఆయుష్ అధికారి తనూజా రాణి, టిజిఎంఎస్ఐడిసి ఏఈ రవికిరణ్ రావు, డీఈఈ రాందేవ్ అగర్వాల్, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హెప్సీబా, ఆయుష్ జిల్లా ప్రోగ్రాం అధికారి లియోచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి రాని వైద్య సేవలు

- మంత్రి సీతక్క ప్రారంభించి సరిగ్గా 8 నెలలు పూర్తి
- శిథిలమైన భవనంలోనే వైద్య సేవలు
- విద్యుత్ సౌకర్యం కల్పించక పోవడంతోనే ఆలస్యం : డిఎంహెచ్ఓ సీతారాం



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 6(జనం సాక్షి) :** మారుమూల వెనుకబడిన గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు కొంతమంది నిర్లక్ష్యం కారణంగా అందుబాటులోకి వైద్య సేవలు రావడం లేదు. స్వయాన రాష్ట్ర గిరిజన సంక్షేమ, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మాత్యులు,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి, సీతక్క ఈ ఆసుపత్రి నూతన భవనాన్ని ప్రారంభించారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని నజ్రుల్ నగర్ గ్రామంలో (విలేజ్ నెంబర్ 12)ఈస్ గాం ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి నూతన భవనాన్ని మంత్రి సీతక్క తేదీ : 30౹06౹2024 న ప్రారంభించారు. ఆయుష్మాన్ మందిర్ ఆరోగ్య నిధులు రు.1.56 కోట్లతో నిర్మించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సైతం పాల్గొన్నారు. భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రభుత్వానికి సంబంధిత కాంట్రాక్టర్ అప్పగించారు. గతంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ఆస్పత్రి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో స్లాబు పెచ్చులు ఎప్పుడుఊడిపడి ఎవరి ప్రాణాలు.. పోతాయో నని నిత్యం ఆస్పత్రి సిబ్బంది.. రోగులు భయం భయంగా గడుపుతున్నారు. దీంతో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన భవనానికి విద్యుదీకరణ అనుసంధానం (ఎలక్ట్రిసిటీ కనెక్షన్) జరగపోవడంతో శిథిలావస్థకు చేరుకున్న ఆస్పత్రి భవనంలోనే డాక్టర్లు, సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. సంబంధిత ఆస్పత్రి నిర్మాణ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా 8 నెలలుగా నూతన భవనంలోకి షిఫ్ట్ కాకపోవడంతో వైద్యులు, సిబ్బంది, రోగులకు ఇబ్బందులు తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో పరిధిలోకి నజరు ల్ నగర్, గన్నారం, అనుకోడ, మోసం, రాస్పల్లి, నాగంపేట, సార్ సలా, వల్ల కొండ తదితర గ్రామపంచాయతీల ప్రజలకు వైద్య సేవలు లభిస్తున్నాయి. నూతన భవనంలోకి హాస్పిటల్ షిఫ్ట కాకపోవడంపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ సీతారామ్ ను వివరణ కోరగా.. జిల్లా కలెక్టర్ వెంకటేష్ తో మాట్లాడినట్లు తెలిపారు. వారం రోజుల్లో నూతన భవనానికి విద్యుదీకరణ అనుసంధానం (ఎలక్ట్రిసిటీ కనెక్షన్) పూర్తిగా గావించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

# బాలికలు స్వీయ రక్షణలోనూ ముందుండాలి

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో



**మహబూబాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 06(జనం సాక్షి):** జాతీయ బాలిక దినోత్సవం-25, సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్త్రీ, శిశు, సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని బేటి బచావో బేటి పడావో నినాదంతో పోస్టర్లు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని వారు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధన కొరకు కృషి చేయాలని, అధికారులంతా బాలికల అభ్యున్నతకి తోడ్పాటును అందించాలని సూచించారు. బాలికలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. కౌమార దశలో ఉన్న ఆడపిల్లలకు సరైన దిశానిర్దేశం చేస్తూ భావిభారత పౌరులుగా తీర్చిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని కోరారు. ఆడపిల్లలపై ఇంకా కొన్ని చోట్ల జరిగే అఘాయిత్యాలు, భ్రూణ హత్యలు, పిండ నిర్ధారణా పరీక్షలు, పూర్తి స్థాయిలో నిర్మూలించుటకు సమాజంలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, భిక్షాటన, అత్యాచారాలు, భ్రూణ హత్యలు,బాల కార్మిక నిర్మూలన, వేధింపులు, అక్రమ దత్తత నిర్మూలించి, బాలికల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. విద్యతోపాటు సామాజిక అంశాలు, క్రీడలు, ఆర్థిక అభివృద్ధి, స్వయం రక్షణ పై ప్రభుత్వం అనేక కార్యక్రమాలు పథకాలు నిర్వహిస్తుందని, అలాంటి కార్యక్రమాల్లో బాలికలు ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిడబ్ల్యుసి చైర్పర్సన్ జి. నాగవాణి, డిఇఓ రవీందర్ రెడ్డి, జిల్లా వైద్య అధికారి డాక్టర్ మురళీధర్, డి ఆర్ డి ఓ మధుసూదన రాజు, సి డబ్ల్యు సి మెంబర్స్ దేవిడ్, అశోక్ కుమార్, డిడబ్ల్యుఓ ధనమ్మ, తదితరులు జాతీయ బాలిక దినోత్సవం గురించి మాట్లాడారు. అంతకుముందు బాలికలు మహిళా బాలికా సంరక్షణ పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.వివిధ క్రీడా పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలికలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓలు నిలోఫర్, శిరీష, ఎల్లమ్మ, రాజ్యలక్ష్మి, లక్ష్మి, కమల, విజయలక్ష్మి, ఇందిరమ్మ, సఖి సెంటర్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం పట్ల నిర్లక్ష్యం తగదు

- నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.సత్య శారద



**నర్సంపేట, ఫిబ్రవరి 6 ( జనం సాక్షి) :** నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద.గురువారం అధికారులను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణతో పాటు కళాశాల లెక్చర్ హాల్ హాస్టల్ యందు పర్యటించి వైద్య విద్యార్థులలో మాట్లాడి వారికి అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. హాస్పటలు వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అన్నారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది సంబంధ అంశాలు తన దృష్టికి రావడం జరిగిందని శానిటేషన్ గురించి నర్సంపేట మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయనున్నట్లు, హాస్పిటల్ యందు ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసి పేషెంట్ సేవలు అందించేందుకు చర్యకు చేపడతామని అన్నారు. అధికారులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. అంతకు ముందు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో గల డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ నిర్వహిస్తున్న రిజిస్టర్ ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిని వైద్య కళాశాల నియంత్రణ లోకి తెస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టి వి వి పి)ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఇందుకు సంబంధించిన విషయాల తో పాటు వైద్య కళాశాల లో పూర్తి స్థాయి లో చేయాల్సిన ఏర్పాట్లపై త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.మోహన్ దాస్, ప్రో.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
7 ఫిబ్రవరి 2025

# ఇథనాల్ కంపెనీ వల్ల జీవ మనగడకే ముప్పు




- తెలంగాణ ప్రజా ఫ్రంట్ కో కన్వీనర్ శంకర ప్రభాకర్

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** ఇథనాల్ కంపెనీ వల్ల జీవ మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని,ఇథనాల్ కంపెనీ రద్దుచేయాలనీ గత 15 రోజులుగా దీక్షలు చేస్తున్న గ్రామాల ప్రజలు దీక్షలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ మనుగడకు ముప్పును తెచ్చే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో ఈ ఇథనాల్ కంపెనీ ఇక్కడకు వచ్చారనీ, రాష్ట్రంలో చాలా చోట్ల ప్రమాదకర కంపెనీలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వలు పునుకున్నాయని ఇలాంటి కంపెనీలను ప్రజా పోరాటాల ద్వారా తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశంలో గానీ రాష్ట్రంలోగానీ ప్రజాసమస్యలను మరిచి పాలక ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని మీ దగ్గరకు వచ్చే ప్రజా ప్రతి నిధులను నిలదీయాలని స్థానిక ఎంఎల్ఏ, ప్రతి పక్షనేత కంపెనీ నిర్మాణంలో ప్రమేయం ఉన్నదని కంపెనీని రద్దు చేసే బాధ్యత మిదేనని ప్రజలు తలుసుకుంటే మికు రాజకియ భవిష్యత్తు ఉండదని ప్రాణాంతక కంపెనీ వెంటనే రద్దు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు నాగన్న, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కర్ణాటక ప్రభుత్వంతో తాగునీటి విడుదల కోసం మంతనాలు

**గద్వాల్ రూరల్ ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రాంత ప్రజల త్రాగునీటి కష్టాలు తీర్చేందుకు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య,డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ను బెంగళూరులో కలిసి ఆల్మట్టి,నారాయణపూర్ డ్యాంల నుండి నీటి విడుదలకై చర్చించిన తెలంగాణ రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు,శ్రీధర్ బాబు,ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన రెడ్డి,జి.మధుసూధన్ రెడ్డి,మేఘ రెడ్డి,పర్ణికా రెడ్డి,వాకాటి శ్రీహరి,ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్. నారాయణపూర్ జలాశయం నుండి 5 టీఎంసీలా నీటిని జూరాల డ్యాంకు విడుదల చేయాలని కోరగా త్రాగునీటి కొరకు 4 టీఎంసీలా నీటిని ఇవ్వడానికి కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్టు మంత్రులు, ఎమ్మెల్యేలు తెలిపారు.




## పెద్ద ధన్వాడలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

**రాజోలి, ఫిబ్రవరి 06 (జనంసాక్షి) :** పెద్ద ధన్వాడ గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ నిర్మాణ పనులు రద్దు చేయాలని గత కొన్ని నెలలుగా 13 గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గురువారం ఆయా గ్రామ రైతులు రిలే నిరాహార దీక్ష 15వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో పరిశ్రమ నిర్మాణం వలన తాము నష్టాలు ఎదురుకుంటామని వాయు కాలుష్యం వలన వెలువడే దుమ్ము వలన పంటలకు నష్టం వాటిల్లుతుందని, మాకు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆరోపించారు. రిలే నిరాహార దీక్షలను భగ్నం చేయాలని అధికారులు ప్రజలపై ఒత్తిడి తీసుకురావడం జరుగుతుందని, ఏది ఏమైనప్పటికీ మా రిలే నిరాహార దీక్షలు కంపెనీ రద్దు అయ్యే వరకు కొనసాగిస్తామని హెచ్చరించారు. గ్రామాల ప్రజల ఆరోగ్యాలను ఫణంగా పెట్టి వ్యక్తుల ప్రయోజనాల కోసం ఈ ఇథనాల్ కంపెనీని మొదలుపెట్టాలని చూస్తే సహించేది లేదుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇథనాల్ కంపెనీ ఆస్తులకు ఎలాంటి నష్టం కలిగించకున్నా మాపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టాలని చూసినా ఎట్టి పరిస్థితుల్లోనైనా మా ఉద్యమాన్ని కొనసాగిస్తామంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమలో దీక్షకు మద్దతుగా గద్వాల జిల్లా చైతన్య మహిళ సంఘం జిల్లా కార్యదర్శి రేవతి, పౌర హక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్, శుభాన్, జెఏసి ప్రభాకర్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ కన్వీనర్ గోపాల్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కార్యదర్శి నాగన్న, టీపీఎఫ్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, మహాదేవ్ పౌర హక్కుల సంఘం నాయకులు మాజీ ఎంపీపీలు జడ్పిటిసిలు, సర్పంచులు ఎంపిటిసిలు,అదే విదంగా రిలే నిరాహార దీక్షలకు వివిధ గ్రామాల ప్రజలు తదితరులు మద్దతు తెలిపారు.

## ఓఆర్ఆర్ వరకు తాగునీటి సరఫరా మరింత మెరుగు

- రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 3 రిజర్వాయర్ల ప్రారంభం
- ప్రెషర్ ఫిల్టర్ సైతం ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు
- పాల్గొన్న మండలి ప్రధాన విప్ ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ (జనంసాక్షి) :** ఓఆర్ఆర్ వరకు తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు, కొత్తగా ఏర్పడిన కాలనీలకు కూడా తాగునీటిని అందించేందుకు జలమండలి కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రాజేంద్ర నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రాంతంలో మంచినీటి సరఫరాను విస్తరించేందుకుగానూ నూతనంగా మూడు రిజర్వాయర్లను నిర్మించింది. ఈ రిజర్వాయర్లను ఫిబ్రవరి 6వ తేదీన గడ్డం ప్రసాద్ కుమార్, శాసన సభ స్పీకర్, శ్రీధర్ బాబు, ఐటీ ఈ అండ్ సీ, పరిశ్రమలు, వాణిజ్యం మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ కలిసి ప్రారంభించారు. వీటితోపాటు హిమాయత్ సాగర్, బుద్వేల్, గండిపేటలలో నిర్మించిన 11ఎమ్మెల్డిల మూడు ప్రెషర్ ఫిల్టర్లను సైతం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ రిజర్వాయర్లు మణికొండ మున్సిపాలిటీ ప్రాంతంలోని స్పోర్ట్ పార్క్, అల్కాపురి, 2.5 మిలియన్ లీటర్ల రిజర్వాయర్, నార్సింగి మున్సిపాలిటీ ప్రాంతంలోని గ్రీన్ ల్యాండ్, మంచిరేవులలో 5 మిలియన్ లీటర్ల రిజర్వాయర్, శంషాబాద్ మున్సిపాలిటీ ప్రాంతంలో 2 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్లను నిర్మించింది. ఈ రిజర్వాయర్ల నిర్మాణం వల్ల గ్రీన్ ల్యాండ్స్, మంచిరేవులో గ్రీన్ ల్యాండ్స్, మంచిరేవుల గ్రామం, బాలాజీ నగర్, ఔట్ సైడ్ ఓఆర్ఆర్ గేటెడ్ కమ్యూనిటీలు, శంషాబాద్ లో హుడా కాలనీ, సిద్దంతి, ఆర్ బి నగర్, సిద్దేశ్వర కాలనీ, ఆదర్శ నగర్, రెహమాన్ నగర్, మధుర నగర్, సోమ ఎన్‌క్లేవ్, శ్రీనివాస కాలనీ, శ్రీనివాస ఎన్‌క్లేవ్, స్పోర్ట్ పార్క్, అల్కాపురిలో అల్కాపురి టౌన్‌షిప్ కాలనీ, నెక్నాంపూర్, నార్సింగి గ్రామం. ప్రాంత ప్రజలకు నీటి ఇబ్బందుల నుండి శాశ్వతంగా విముక్తి లభించింది.

## పాలమూరుకు శాపంగా కాంగ్రెస్, బీజేపీలు

- జాతీయహెూదాకు నోచుకోని పాలమూరు-రంగారెడ్డి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, ఫిబ్రవరి06 (జనంసాక్షి) :** పార్లమెంట్ సాక్షిగా పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయహెూదా ఇచ్చేది లేదని కేంద్రం ప్రకటించడం బాధ్యతారాహిత్యమని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు బీజేపీ కాంగ్రెస్ లు శాపంగా దాపురించాయని ఎద్దేవా చేశారు. పీఎల్ఆర్ పట్ల బీజేపీ మొదటి నుంచి వివక్ష చూపుతున్నదని దీనికి ఆ పార్టీ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నల్లమల బిడ్డనని బీరాలు పలికే రేవంత్ రెడ్డి ఏడాదిగా పాలమూరు ఎత్తిపోతల పనులను పడావుపెట్టాడని అన్నారు. 31 సార్లు ఢిల్లీకి వెళ్లినా రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా పాలమూరు ఎత్తిపోతల గురించి కేంద్రాన్ని అడిగిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదిగా ఏపీ అక్రమంగా నీళ్లను తరలిస్తున్నా సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి తీసుకున్న చర్యలు శూన్యం అన్నారు. 90 శాతం పూర్తయిన పాలమూరు ఎత్తిపోతలలో మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయకుండా రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. 12 మంది ఎమ్మెల్యేలను గెలిపించినందుకు కాంగ్రెస్, ఒక ఎంపీని గెలిపించినందుకు బీజేపీ పాలమూరు ప్రజలకు ఇస్తున్న రిటర్న్ గిఫ్ట్ ఇదేనా అంటూ ప్రశ్నించారు. ఇటీవల మహబూబ్ నగర్ లో జరిగిన సభలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయహెూదా ఇస్తానన్న ప్రధాని మోడీ మాట తప్పాడని అందుకు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏపీలో పోలవరానికి ఆర్థికసాయం, కర్ణాటకలో అప్పర్ భద్రకు జాతీయహెూదా ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మొండిచేయి చూపిందని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీల వైఫల్యం వల్లనే పార్లమెంట్ లో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహెూదా లభించలేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు.

## మాదాపూర్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



**హైదరాబాద్, ఫిబ్రవరి6 (జనంసాక్షి) :** హైదరాబాద్ మహానగరంలో డ్రగ్స్ విక్రయం చాప కింద నీరులా విస్తరిస్తోంది. పోలీసులు సైతం ముమ్మర తనిఖీలు నిర్వహించానా.. ఈ డ్రగ్స్ విక్రయం మాత్రం ఆగడం లేదు. ప్రభుత్వం సైతం డ్రగ్స్ అంశంలో కఠిన వైఖరి అవలంబిస్తోంది. కానీ డ్రగ్స్ విక్రయాలు మాత్రం ఆగడం లేదు. మాదాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారస్తులే లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఓటీ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. మరోవైపు డ్రగ్ విక్రయిస్తున్న ఒలివర్ అలియాస్ జాన్సన్‌ను అరెస్ట్ చేశామని టాస్క్ ఫోర్స్ డీసీపీ సుధీంద్ర బుధవారం హైదరాబాద్‌లో వెల్లడించిన విషయం విదితమే. హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేయడానికి డ్రగ్ పెడర్లు వచ్చినట్లు తమకు సమాచారం అందిందని చెప్పారు. ఈ నేపథ్యంలో లంగర్ హౌస్ పోలీసులతో కలిసి నార్కోటిక్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారన్నారు. దీంతో డ్రగ్స్ కేసులో ఆఫ్రికాకి చెందిన ముగ్గురు డ్రగ్స్ నిందితులను అరెస్ట్ చేశామని వివరించారు. 2009లో జాన్సన్ అలియాస్ జాన్.. బిజినెస్ వీసాపై ఇండియాకు వచ్చాడని.. అతడి వీసా గడువు 2013లో ముగిసిందని తెలిపారు.

ఇండియా వచ్చిన అనంతరం అతడు డ్రగ్స్ సరఫరా చేస్తూ వస్తున్నాడని పేర్కొన్నారు. ఢిల్లీ నుండి బెంగళూరుకు బల్క్‌లో డ్రగ్స్ సప్లై చేసేవాడని చెప్పారు. నైజీరియన్స్‌తో పరిచయం చేసుకొని హైదరాబాద్, బెంగళూరుకు డ్రగ్స్ సప్లై చేస్తున్నాడని వివరించారు. వారి వద్ద నుంచి1300 గ్రాముల ఎండీఎంఏ, రూ. 1.60 కోట్లు డ్రగ్స్ సీజ్ చేశామన్నారు. అలాగే నిందితుడు ఒలివర్ అలియాస్ జాన్సన్‌ను కస్టడీలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక రోమియో అనే పాత నేరస్తుడిని సైతం అరెస్ట్ చేశామన్నారు. వీసా గడువు ముగిసిన సెల్ వేస్టార్.. హైదరాబాద్‌లోనే ఉంటున్నారని డీసీపీ సుధీంద్ర వివరించారు.

## నకిలీ యాప్స్‌తో మోసాలు

- ఖాతాదారులను హెచ్చరించిన ఎల్ఐసి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి6 (జనంసాక్షి) :** ఫేక్ యాప్స్‌తో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎల్ఐసి తన పాలసీదారులకు సూచించింది. తమ పేరు మీద నకిలీ యాప్స్ సర్క్యులేట్ అవుతున్నట్లు దృష్టికి రావడంతో తాజాగా పబ్లిక్ అడ్వైజరీని జారీ చేసింది. అలాంటి యాప్స్ వలలో పడొద్దని సూచించింది. 'ఎల్ఐసీ ఇండియా పేరు మీద కొన్ని నకిలీ మొబైల్ అప్లికేషన్లు చెలామణి అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కాబట్టి పాలసీహోల్డర్లు, కస్టమర్లు అప్రమత్తంగా ఉండాలి. ఎల్ఐసీ ఇండియా అధికారిక వెబ్‌సైట్, ఎల్ఐసీ డిజిటల్ యాప్, ఎల్ఐసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఇతరమార్గాల ద్వారా లావాదేవీలు జరపాలి' అని సూచించింది. ఇతర మార్గాల ద్వారా చేసే చెల్లింపులకు ఎల్ఐసీ బాధ్యత వహించబోదని స్పష్టంచేసింది. ఎల్ఐసీ అధికారిక యాప్‌ను గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటే.. వెబ్‌సైట్‌లోకి వెళ్లి సంబంధిత లింక్‌పై క్లిక్ చేసి మీకు కావాల్సిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. నకిలీ యాప్స్ అని గమనిస్తే ఫిర్యాదు చేయాలని సూచించింది.

## కండ్ల ముందే తరలిపోతున్న సహజ వనరులు




**ఆదిలాబాద్ ప్రతినిది (జనంసాక్షి) :** మన చుట్టూ ఉన్న సహజ వనరులు మన కళ్ల ముందే తరలిపోతున్నప్పటికి మనం చూస్తూ మనకెందుకులే అనుకుంటున్నామా? అవుననే అనిపిస్తుంది. కళ్ళ ముందే తరలిపోతున్న సహజ వనరులపై జనంసాక్షి అందిస్తున్న కథనం.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏంతో ప్రకృతి సంపద నెలకొని ఉంది. అందులో చెట్టు,పుట్ట, మొదలుకుని ఎన్నో సహజ వనరులు పుష్కలంగా ఉండేవి. ఇవన్నీ గతంలో కాని ఇప్పుడు ఈ సహజ వనరుల సంపదలు మెల్లి మెల్లిగా మన నుంచి దూరం అవుతున్నాయి. ఫలితంగా బావితరాలకు ఈ సంపద తెలియకుండా పోతుంది. వీటిని కాపాడవలసిన మనమే మన కల్ల ముందునుంచి తరలిపోతున్న మనకెందుకులే అనుకుంటున్నాం తప్ప బాధ్యతగా వాటిని కాపడలేక పోతున్నాం. ఎవరు ఏమి అనడం లేదుగా మనకెవరు అడ్డు అనుకుంటూ వ్యాపారం పేరుతో కొంతమంది అక్రమార్కులు ప్రకృతిలో ఉచితంగా ఉన్న చెట్టు, పుట్ట, గుట్టలు, ఇసుక, ఇలా ఏది పడితే అది ఇష్టానుసారంగా తరలిస్తూ కోట్లు గడిస్తూ ప్రకృతికి తీరని క్షోభ మిగిలిస్తున్నారు. ఫలితంగా మన కళ్లముందే ఈ సహజ వనరులు కనుమరుగు అయ్యే దశకు చేరుకున్నాయి. విచ్చల విడిగా చెట్లు నరికి వేస్తుండడంతో తీవ్ర కాలుష్యం ఏర్పడుతుంది. నదుల్లో ఉన్న ఇసుక నిలువలను తోడేస్తుండడం వల్ల నీరు నిలువ లేకుండా పోతున్నాయి. దీంతో భవిష్యత్తులో వాగుల్లో నీటి నిలువలు లేకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది. ఉమ్మడి జిల్లా అంతటా ప్రస్తుతం సహజ వనరుల జాడ ఎక్కడ మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో భావి తరాలకు ఈ సహజ వనరుల సంపద కనిపించకుండా పోతుంది. ఇంతగా సహజ వనరులను కొల్లగొడుతున్న అక్రమార్కులను మనం చూస్తూ ఊరూ కుంటున్నామె తప్ప ఇది తప్పు అని ఈ వనరులను ఎందుకు నాశనం చేస్తున్నారని కొల్లగొట్టే అధికారం మీకెక్కడిది అని వారిని ప్రశ్నించడం లేదు. దీంతో ఇంకా దర్జాగా అక్రమార్కులు తమ పని కానిచ్చేస్తున్నారు. కారణంగా ప్రకృతి అంతా బోసి పోయి ఎడారులను తలపిస్తున్నాయి. జరుగుతున్న దోపిడీకి అడ్డు కట్ట వేయలేకపోతే భవిష్యత్తులో ప్రకృతి సంపద అంతరించి పోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రకృతిలో జరుగుతున్న ఈ సహజ వనరుల దోపిడిని అడ్డుకట్ట వేయడానికి ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి కాపాడే దిశగా అడుగులు ముందుకు వెయ్యాలి. తమ బాధ్యతగా తీసుకుని భవిష్యత్ తరాల వారికి అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. లేకుంటే సంపద అంతా కొట్టుకపోయి ఎడారి ప్రాంతాలుగా మారే అవకాశం లేకపోలేదని ప్రకృతి నిపుణులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



## మగ పులి తోడు కోసం వాసన చూసి పసిగట్టి!

**అదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** మగ పులి జాడను తెలుసుకునేందుకు ఆడపులి ఎన్ని కిలో మీటర్ల దూరమైనా నడుస్తుంది. ఇలా వెళ్తున్న క్రమంలో అడవి దారిలో ఓ మగపులి విసర్జించిన మూత్రంను ఆడ పులి వాసన చూసి అది ఉండే స్థావరంకు వెళ్ళి ఆ పులి జాడను కనిపెడుతుంది. ఇలా రెండు పులులు కలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ చిత్రాన్ని జనంసాక్షి అదిలాబాద్ ప్రతినిది లింగంపల్లి కృష్ణ బుధవారం మహారాష్ట్ర యావత్మాల్ జిల్లా లోనితిప్పేశ్వర్ పులుల అభయారణ్యంలో తన కెమెరాల్లో బంధించాడు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370